అక్టోబర్
2014

102

సంపుటి : 9 సంచిక : 6

వెల రు. 10/-


## ఈ సంచికలో........

50 ఏళ్ల సిపిఐ(ఎం) : సాధించిన విజయాలు, ముందున్న సవాళ్లు
ముస్లింలపై ఆర్ఎస్ఎస్ విద్వేష ప్రచారం
కమ్యూనిస్టు పార్టీలో ఆంతరంగిక ప్రజాస్వామ్యం
లెనిన్ పేరిట లెనినిజంపై దాడి!
ప్రపంచీకరణ-వాణిజ్య ప్రకటనలు: 'ఆధునిక' భారతీయ మహిళలు
గుజరాత్‌లో విద్యార్థులపై కాషాయ సేన ప్రయోగాలు
ప్రణాళికా విధానానికి మంగళం పాడిన మోడీ
ప్రజా చరిత్రకారుడు బిపన్ చంద్ర

స్ఫూర్తి

# ప్రజా చరిత్రకారుడు బిపన్‌చంద్ర

**జి. విజయరావు**



కొద్ది వారాల క్రితం కన్ను మూసిన ప్రొఫెసర్ బిపన్ చంద్ర జీవితం అటు మేధావులకూ, ఇటు సామాజిక, రాజకీయ కార్యకర్తలకూ స్ఫూర్తిదాయకం. ఆయన తన మేధస్సును విశ్వవిద్యాలయాలకూ, సెమినార్ హాళ్లకే పరిమితం చేయలేదు. మేధోకృషిని సామాజిక అభ్యుదయానికి అనుసంధించిన విశేష వ్యక్తిత్వం ఆయనది. విశ్వవిద్యాలయాలలో విద్యార్థులకు ఆయన ఎంతో అభిమానపాత్రుడు. తనను 'ప్రొఫెసర్' అని కాకుండా 'బిపన్' అని మాత్రమే పిలవమని వారిని కోరేవారంటే ఆయన ఎంతగా వారితో కలిసిమెలిసి పోయేవారో, ఎంత నిరాడంబరంగా ఉండే వారో అర్థం చేసుకోవచ్చు.

బిపన్ చంద్ర 1928లో ప్రస్తుతం హిమాచల్ ప్రదేశ్‌లో ఉన్న కాంగ్రాలో జన్మించారు. స్వాతంత్ర్యానికి పూర్వం పంజాబులో అందరి మాదిరిగానే ఆయన చిన్ననాటి విద్యాభ్యాసం అంతా ఉర్దూ మాధ్యమంలోనే జరిగింది. బాల్యంలో ఆయన ఉర్దూ నవలలను ఎంతో అభిమానంగా చదువుతుండేవారు కూడ. లాహోర్‌లోని ఫోర్మన్ కాలేజీలో బిపన్ డిగ్రీ పూర్తిచేశారు. స్వాతంత్ర్యానంతరం ఆయన లాహోర్‌ను విడిచిపెట్టాల్సి వచ్చింది. తర్వాత ఎంఏ చదివేందుకు అమెరికా వెళ్లి స్టాన్‌ఫర్డ్ విశ్వవిద్యాలయంలో చేరారు. అక్కడే బిపన్‌కు కమ్యూనిస్టులతో సంబంధాలు ఏర్పడ్డాయి. ఆ రోజుల్లో తీవ్రంగా ఉన్న అమెరికా సెనెటర్ మెక్‌కార్థీ కమ్యూనిస్టు వ్యతిరేక దాడికి ఆయన కూడా గురయి తిరిగి భారతదేశానికి పంపి వేయబడ్డాడు. 1950ల ఆరంభంలో ఢిల్లీ హిందూ కాలేజీలో బిపన్ లెక్చరర్‌గా చేరారు.

లెక్చరర్‌గా ఉండగానే ఆయన తన క్రియాశీల కార్యకలాపాలను ప్రారంభించారు. తన సహచరులు కొందరితో కలిసి 'ఎంక్వైరీ' అనే పత్రికను స్థాపించడానికి పూనుకున్నాడు. ఈ కృషిలోనే ఆయన ఇర్ఫాన్ హబీబ్ లాంటి మార్క్సిస్టు పండితులను కలుసుకున్నాడు. బిపన్‌తో తన తొలిపరిచయాన్ని ఇర్ఫాన్ హబీబ్ ఎంతో అభిమానంగా గుర్తుకు తెచ్చుకున్నారు కూడ. తామిద్దరం ఢిల్లీలో కాకుండా ఆలీఘర్‌లో ఈగలు ముసురుకొని ఉన్న ఒక హొటల్‌లో కలుసుకున్నామని ఆయన చెప్పారు. తమ పత్రికలో మార్క్సిస్టు కోణంలో రాసిన వ్యాసాలకే కాకుండా సామాజిక శాస్త్రాలలో సీరియస్ అధ్యయనాలకు సంబంధించిన రచనలకూ చోటు కల్పించాలని బిపన్ అభిప్రాయపడ్డారు. 1960వ దశకం అంతటా ఎంక్వైరీ పత్రికకు బిపన్ కీలకంగా పనిచేశారు. మార్క్సిస్టుల మధ్య తీవ్రమైన విభేదాలు కొనసాగుతున్న ఆ కాలంలో వారి వారి అభిప్రాయాలకు తన పత్రికలో స్థానం కల్పించారు.

ఈ కాలంలోనే బిపన్ తన పిహెచ్‌డి పరిశోధనాంశంపైన కూడ కృషి చేశారు. 'భారతదేశంలో ఆర్థిక జాతీయవాదం ఆవిర్భావం, అభివృది1880–1905' అన్నది ఆయన పరిశోధనాంశం. పిహెచ్‌డి కోసం ఆయన ఈ అధ్యయనం చేపట్టినప్పటికీ ఇది ఆయన మేధోకృషికి గీటురాయి లాంటిది. తొలితరం జాతీయవాదులు బ్రిటిష్ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా చర్చకు ముందుకు తెచ్చిన ఆర్థిక అంశాలను బిపన్ ఈ అధ్యయనంలో విపులంగా పరిశీలించారు. ఆనాటి పత్రికలనుండీ, వివిధ భాషల్లోని వార్తాపత్రికల నుండీ ఆయన విస్తారంగా సమాచారాన్ని సేకరించారు. ఆయన సేకరించిన సమాచార పరిమాణం, విస్తృతి ఆయన శక్తిసామర్థ్యాలు ఎంతటివో తెలియచెబుతాయి. అంతగా సేకరించిన సమాచారాన్ని విశ్లేషించడంలోనూ, క్రోడీకరించి నిర్ధారణలకు రావడంలోనూ ఆయన తన మేధస్సును అంతే ప్రదర్శించారు. 1966లో పీపుల్స్ పబ్లిషింగ్ హౌస్ దీన్ని మొట్టమొదట ప్రచురించింది. ఎంతగానో విమర్శనాత్మకంగా ఉండే ఇఎంఎస్ నంబూద్రిపాద్ సైతం ఈ రచనపై ఎంతో సానుకూల వ్యాఖ్యలు చేశారని ఇర్ఫాన్ హబీబ్ చెప్పారు. అయితే జాతీయవాదుల వర్గపునాదిని వివరించడానికి బిపన్ పూనుకోలేదన్నది ఇఎంఎస్ చేసిన ఒక విమర్శ. కాని సామ్రాజ్యవాదుల ఆర్థిక విధానాలను ఎదుర్కొనడానికి అవసరమైన సైద్ధాంతిక సరంజామాను కేవలం మధ్యతరగతి వారికి మాత్రమే కాకుండా, అన్ని ప్రాంతాలు, అన్ని మతాలకు చెందిన పేదప్రజానీకానికి సైతం అందించారని చెప్పడమే బిపన్ రచన ఉద్దేశమై ఉంటుందన్నది ఇర్ఫాన్ హబీబ్ అభిప్రాయం. ఈ కాలంలోనే డి మోరిస్ అనే అమెరికాకు చెందిన మేధావి సామ్రాజ్యవాదులు వలస దేశాలలో పారిశ్రామిక క్షయానికి కారకులు కాదని ఒక వ్యాసం రాస్తే, దానికి తీవ్రమైన రీతిలో 'ఇండియన్ ఎకనామిక్ అండ్ సోషల్ హిస్టరీ రివ్యూ' లో రాసిన సమాధానం అందరి దృష్టినీ ఆకర్షించడమే కాకుండా, తర్వాత అధ్యయనాలకు మార్గదర్శకంగా పనిచేసింది.

న్యూఢిల్లీలో జవహర్‌లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయం (జెఎన్‌యు) స్థాపించిన నాటినుండి బిపన్ దానిలో ఉన్నారు. అక్కడ రోమిల్లా థాపర్ తదితరులతో కలిసి చరిత్ర అధ్యయనాల కేంద్రం స్థాపించారు. ఒక ప్రొఫెసర్, ఒక ప్యూన్ ఒకే టేబుల్ వద్ద కూర్చొని భోంచేసేలా జెఎన్‌యులో వాతావరణం ఉండాలని ఆయన కలలు కనే వారు. అయితే ఆచరణలో అంతటి వాతావరణం లేనప్పటికీ దేశంలో ఏ ఇతర విశ్వవిద్యాయంలో లేని స్వేచ్ఛాయుత వాతావరణం అక్కడ ఉంటుంది. అది బిపన్, ఇంకా ఆయన లాంటి ఇతరుల పట్టుదల వల్లనే సాధ్యమయిందన్నది వాస్తవం.

బిపన్‌ను ప్రజల చరిత్రకారుడని చెప్పవచ్చు. ఇది ఆయన కేవలం పాండిత్య ప్రకర్షతో

(మిగతా 35వ పేజీలో)

## ఈ సంచికలో...

**1. ప్రజా చరిత్రకారుడు బిపన్ చంద్ర**
– జి. విజయరావు 2

**2. 50 ఏళ్ల సిపిఐ(ఎం) : సాధించిన విజయాలు, ముందున్న సవాళ్లు**
– సీతారామ్ ఏచూరి 4

**3. ముస్లింలపై ఆర్ఎస్ఎస్ విద్వేష ప్రచారం**
– ఇర్ఫాన్ ఇంజినీర్ 14

**4. కమ్యూనిస్టు పార్టీలో ఆంతరంగిక ప్రజాస్వామ్యం**
-ఎస్. వీరయ్య 18

**5. లెనిన్ పేరిట లెనినిజంపై దాడి!**
– తెలకపల్లి రవి 19

**6. ప్రపంచీకరణ-వాణిజ్య ప్రకటనలు: 'ఆధునిక భారతీయ మహిళలు**
– అర్పితా గుహ ఠాకుర్ధ 22

**7. గుజరాత్‌లో విద్యార్థులపై కాషాయ సేన ప్రయోగాలు**
– అనుపమ కటకం 24

**8. ప్రణాళికా విధానానికి మంగళం పాడిన మోడీ**
– సిపి చంద్రశేఖర్ 26

**సంపాదకుడు:**
**ఎస్. వెంకట్రావు**

**సంపాదక వర్గం:**
**పాటూరు రామయ్య**
**బి.వి. రాఘవులు**
**తమ్మినేని వీరభద్రం**
**ఎస్. వీరయ్య**
**తెలకపల్లి రవి**

**భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు)**
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిటీ తరుపున
ప్రచురణ కర్త, ముద్రాపకుడు: **బి.వి.రాఘవులు**
సంపాదకుడు : **ఎస్. వెంకట్రావు**
**ముద్రణ :** ప్రజాశక్తి డైలీ ప్రింటింగ్ ప్రెస్,
ప్లాట్ నెం 21/1, అజామాబాద్, హైదరాబాద్-20
**ఫోన్:** ఎడిటోరియల్ **0866-2573822**
**మేనేజర్: 040-27673787**
EMail:svenkatarao_1958@yahoo.com
Visit cpi(m) site at : cpim.org

# ఎవరికోసం?

ఈ మధ్య మన పాలక వర్గాలకు 'మేడ్ ఇన్ ఇండియా', 'మేక్ ఇన్ ఇండియా' జ్వరం పట్టుకున్నట్లుంది. ప్రధాని నరేంద్ర మోడీ అమెరికా వెళ్లడానికి ముందు 500 మంది భారత కార్పొరేట్ దిగ్గజాలు 'మేక్ ఇన్ ఇండియా' సదస్సు జరిపి దేశంలో తయారీ రంగానికి ప్రాధాన్యత ఇవ్వాలని పెద్ద నిర్ణయమే తీసుకున్నారు. భారత దేశానికి రండి, వస్తువులు తయారు చేసుకుని ఏ దేశంలోనైనా అమ్ముకోండి అని ప్రధాని నరేంద్ర మోడీ ఆ సమావేశంలో పలుపునిస్తే కార్పొరేట్లంతా సై అన్నారు.

కానీ ఇన్నాళ్లూ తయారీ రంగాన్ని పట్టించుకోవద్దని ఎవరన్నారు? తయారీ రంగంపై దృష్టి పెట్టండి, ప్రజలకు ఉపాధి లభిస్తుంది, ఉపాధి ఆధారంగా దేశాభివృద్ధి జరుగుతుంది అని వామపక్షాలు నెత్తీనోరు బాదుకుంటే ఈ కార్పొరేట్ బేహారులు దాన్ని పాతచింతకాయ పచ్చడి వాదన అని కొట్టి పారేశారు. ఐటీ ఆధారంగా సర్వీసు రంగం శరవేగంగా పురోగమిస్తుంటే భవిష్యత్తంతా అదే అన్నారు. ప్రపంచీకరణ అంటే వస్తువులు ఎక్కడ చవగ్గా దొరికితే అక్కడి నుండి దిగుమతి చేసుకోవడం, పెట్టుబడులకు ఎక్కడ లాభాలు వస్తాయంటే అక్కడకు పోవడమేనని సుద్దులు పలికారు. కానీ వారికి ఇప్పుడుహాహాఒక్కసారిగా జ్ఞానోదయం అయినట్లు అంతా కలిసికట్టుగా తయారీ రంగం మీద పడ్డారు. ఈ విషయంలో చైనాను పదేపదే ఉదహరిస్తున్నారు. చైనా మాదిరిగా భారత్‌ను తయారీ రంగానికి కేరాఫ్ అడ్రస్‌గా మార్చాలని అంటున్నారు.

చైనా గురించి వాళ్లు ఎక్కువగా మాట్లాడుతున్నా తయారీ రంగాన్ని పెంపొందించడానికి చైనా మార్గాన్ని మాత్రం వాళ్లు అనుసరించదలచుకోలేదని వాళ్ల విధానాలను బట్టి అర్థమైపోతోంది. చైనాలో తయారీ రంగాన్ని అక్కడి ప్రభుత్వమే ప్రోత్సహించింది. విప్లవానంతరం జరిగిన సమూల భూ సంస్కరణలవల్ల సంపద్వంతమైన గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు వెన్నుదన్నుగా తయారీ రంగాన్ని ప్రభుత్వం ప్రోత్సహించింది. విదేశీ సాంకేతిక పరిజ్ఞానం, పెట్టుబడుల రాకకోసం దేశ ఆర్థిక వ్యవస్థలో కొన్ని సడలింపులు చేసినా అక్కడి స్థూల ఆర్థిక యాజమాన్యం అంతా ప్రభుత్వం ఆధ్వర్యంలోనే నడుస్తుంది. అందుకే తయారీ రంగంలో అది ఘనవిజయాలు సాధించింది. ప్రపంచాన్ని మేడ్ ఇన్ చైనా ఎగుమతులతో ముంచెత్తింది. తయారీ రంగం అభివృద్ధి వలన చైనా ప్రజల తలసరి ఆదాయం బాగా పెరిగి, మన ప్రజలతో పోలిస్తే మూడింతలయ్యింది. ఇప్పుడు ప్రపంచమంతా మాంద్యం పరిస్థితుల్లో ఎగుమతులకు అవకాశాలు తగ్గటంతో చైనా అంతర్గత మార్కెట్‌ను పెంచుకోడానికీ, ఆధునిక టెక్నాలజీమీద ఆధారపడిన ఉత్పత్తులవైపూ అడుగులేస్తోంది.

కానీ మన నేతలు చైనాను ఉదాహరణగా చూపుతున్నారేగానీ అక్కడి ప్రభుత్వ రంగం చేసిన కృషిని గురించి మాత్రం చెప్పడం లేదు. ఇక్కడ ప్రభుత్వ రంగానికి మంగళం పాడుతూ, స్వదేశీ, విదేశీ కార్పొరేట్ శక్తుల చేతుల్లో మన తయారీ రంగం అభివృద్ధి చెందుతుందని ఆశపడుతున్నారు. వారిని ఆకర్షించడం కోసం ప్రజల జీవన ప్రమాణాలనే ఫణంగా పెడుతున్నారు. కార్మిక చట్టాలను సవరించి కార్మికులకు హక్కులు లేకుండాచేయడం, ఉన్న ప్రభుత్వ రంగాన్ని ప్రయివేటీకరించడం, కార్పొరేట్‌లకు కావలసిన వరాలను పోటీపడి మరీ సమర్పించడం, ఉపాధి ఇవ్వని ఆధునిక టెక్నాటజీపై ఆధారపడడం...మొదలైన చర్యలు ప్రజల జీవన ప్రమాణాలను తగ్గిస్తాయేగానీ పెంచవని ప్రపంచ ఆర్థిక సంస్థలే చెబుతున్నాయి. అయినా ఆ పాతచింతకాయ పచ్చడి సంస్కరణలనే పట్టుకుని పాలకులు వేలాడుతున్నారు.

ఉపాధి తగ్గి, కార్మికలకు వేతనాలు తగ్గితే వారి జీవన ప్రమాణాలు తగ్గుతాయి. అప్పుడు తయారీ రంగం ఎన్ని వస్తువులు తయారుచేసినా కొనేవాళ్లు కరువవుతారు. చైనాలాగా విదేశాలకు ఎగుమతి చేద్దామన్నా నేటి ప్రపంచ పరిస్థితి వాటిని స్వీకరించడానికి సిద్ధంగా లేదు. అందువల్ల ఇప్పుడు సమస్య వస్తువుల తయారీ కాదు వాటిని కొనగలిగేవారిని తయారుచేయడం. మన పాలకుల విధానాలు మాత్రం ఆ దిశలో లేవు.

**చందా వివరాలు**

విడిపత్రిక: **రూ.10,** సంవత్సర చందా:**రూ.100,** పోస్టు ద్వారా **రూ. 120**

పోస్టు ద్వారా లేదా ఏజెంటు ద్వారా తెప్పించుకోవచ్చు.
లేదా మీ స్థానిక పార్టీ కార్యాలయంలో సంప్రదించండి.
ప్రజాశక్తి బుక్‌హౌస్ అన్ని బ్రాంచీలలోనూ లభిస్తాయి.

**చిరునామా**

**మేనేజర్,**
**మార్క్సిస్టు**
**(సైద్ధాంతిక మాసపత్రిక),**
**ఎం.హెచ్ భవన్ (ప్రజాశక్తి కార్యాలయం),**
**అజామాబాద్, హైదరాబాద్- 20**

**ఈ మాసం ముఖ్యాంశం**

# 50 ఏళ్ల సిపిఐ(ఎం)

## సాధించిన విజయాలు, ముందున్న సవాళ్లు



రచయిత భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) పొలిట్‌బ్యూరో సభ్యులు

**సీతారామ్ ఏచూరి**

అక్టోబరు విప్లవ విజయోత్సవ వేళ, 1964, నవంబరు 7న విప్లవ కార్యక్రమం ఆధారంగా భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) ఏర్పాటు అయినట్లు పార్టీ 7వ మహాసభ ముగింపులో ప్రకటించారు. 1920 లో తాష్కెంట్‌లో ఏర్పాటైన భారత కమ్యూనిస్టు పార్టీ మూలాల కొనసాగింపుగానే సిపిఐ(ఎం) తనను తాను భావిస్తోంది. ఆ కొనసాగింపులో భాగంగానే సిపిఐ(ఎం) ఏర్పాటైన 1964 నాటి మహాసభను ఏడవ మహాసభగా గుర్తించింది. ఆ విధంగా చూసుకున్నపుడు 2014, భారత కమ్యూనిస్టు పార్టీకి 96వ వార్షికోత్సవంగా ఉంటుంది. భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు)కు 50వ వార్షికోత్సవ సందర్భం అవుతుంది.

"సరైన రాజకీయ సైద్ధాంతిక వైఖరి కోసం 1955-62 మధ్య కాలంలో పార్టీలో సాగిన అంతర్గత చర్చ చివరకు 1963-64లో సిపిఐ (ఎం) ఆవిర్భావంతో ముగింపుకు వచ్చింది. భారతదేశంలో కమ్యూనిస్టు ఉద్యమంలో వచ్చిన ఈ చీలిక ప్రధానంగా సైద్ధాంతిక, రాజకీయ, జాతీయ అంతర్జాతీయ అంశాల పట్ల వైఖరిలో ఉన్న వ్యత్యాసాల్లోనే ఉంది" అని1982 జనవరిలో జరిగిన పార్టీ 11వ మహాసభ రాజకీయ నిర్మాణ నివేదిక పేర్కొంది.

సదరు నివేదిక ఇంకా ఇలా పేర్కొంది: "భారత ప్రభుత్వం, పాలక వర్గాల స్వభావం పట్ల ఉన్న అవగాహనలోని వైరుధ్యమే తర్వాతి కాలంలో రెండు కమ్యూనిస్టు పార్టీలూ రెండు వేర్వేరు కార్యక్రమాలు రూపొందించుకోవటానికి దారితీసింది. తదనంతర కాలంలో రెండు కమ్యూనిస్టు పార్టీలు అనుసరించిన భిన్నమైన ఎత్తుగడల పంథాకు ఇదే పునాదిగా ఉంది."

సిపిఐ(ఎం) ఏర్పాటుకు దారితీసిన 7వ మహాసభ 20 వవార్షికోత్సవాన్ని పురస్కరించుకుని దివంగత నేత బిటి రణదివె 1984, నవంబరు7న పీపుల్స్ డెమొక్రసీలో ప్రత్యేక వ్యాసం రాస్తూ ఇలా చెప్పారు: " ఇక్కడ మన అంచనాకు సంబంధించిన ముఖ్యమైన ప్రశ్న ఏమిటంటే స్వతంత్ర భారత ప్రభుత్వపు వర్గ స్వభావానికి సంబంధించిన అంచనా. ఈ అంచనా ఆధారంగా ముందుకొచ్చే సమస్య విప్లవ సాధనలో కార్మికవర్గం పాత్ర గురించినది. సిపిఐ(ఎం) తన కార్యక్రమంలో భారత ప్రభుత్వం గురించి అంచనా వేస్తూ, ఈ ప్రభుత్వం బూర్జువా భూస్వామ్య ప్రభుత్వం అనీ, విదేశీ ద్రవ్య పెట్టుబడితో మిలాఖత్ అయిన బడా బూర్జువావర్గం ఈ ప్రభుత్వానికి నాయకత్వం వహిస్తుందనీ నిర్ధారించింది. అంటే జనతా ప్రజాస్వామ్య విప్లవ సాధనలో రాజ్యంతోనూ ప్రభుత్వంతోనూ పోరాటం అనివార్య అంతర్భాగంగా ఉంటుంది. అందువల్లనే సిపిఐ(ఎం) పశ్చిమ బెంగాల్‌లో అర్ధ ఫాసిస్టు అణచివేతనూ, కేరళ, ఆంధ్రప్రదేశ్‌లలో హంతక రాజకీయాలనూ ఎదురొడ్డి నికరంగా పోరాడగలిగింది. ప్రతిఘటనా ప్రవంతిని సజీవంగా ఉంచే ప్రయత్నంలో పాలకవర్గాల దాడులకు, అణచివేతకు, దుష్కృత్యాలకు సిపిఐ(ఎం), ప్రజా ఉద్యమాలు బలయ్యాయి. ఈ ప్రతిఘటనా పోరాటంలో కొన్ని సందర్భాల్లో సోదర వామపక్షాలు తోడు ఉండగా మరికొన్ని సందర్భాల్లో ఒంటరిగానే ఈ అణచివేతను ఎదుర్కోవాల్సి వచ్చింది.

సిపిఐ నాయకత్వం భారత పాలకవర్గాల స్వభావాన్ని ఏ విధంగా అర్థం చేసుకొన్నది? ఆ పార్టీ అవగాహనలో భారత పాలకవర్గం స్థూలంగానే బడా-బడాయేతర బూర్జువాల నాయకత్వంలో ఉందని నిర్ధారించింది. నిజానికి భారత ప్రభుత్వానికి బడాయేతర బూర్జువావర్గం నాయకత్వం వహిస్తుందన్నది వారి నిర్ధారణ."

ఉభయ కమ్యూనిస్టు పార్టీల మధ్య విప్లవ దశకు సంబంధించిన అవగాహనలో తేడా లేకపోయినప్పటికీ రాజ్యపు వర్గ స్వభావం, భారతీయ బూర్జువా వర్గపు ద్వంద్వ స్వభావం, తదనుగుణంగా అనుసరించాల్సిన ఎత్తుగడల పంథాకు సంబంధించి మాత్రం తీవ్రమైన వ్యత్యాసాలు ఉన్నాయి.

పార్టీ ఆవిర్భావ స్వర్ణోత్సవం జరుపుకుంటున్న ఈ సంవత్సర కాలంలో అనేకమంది నాయకులు అనేక పార్శ్వాల్లో ఈ అంశాలపై విలువైన అంచనాలు, అభిప్రాయాలు, వివరణలు, విశ్లేషణలు అందించనున్నారు. గత యాభై ఏళ్లల్లో కూడా అనేక అంశాలపై రాస్తూ వచ్చారు. తాజా సందర్భాన్ని పురస్కరించుకుని సమకాలీన భారతదేశంలో సిపిఐ(ఎం) సైద్ధాంతిక పునాదుల ప్రాధాన్యత గురించి ప్రస్తావిస్తాను. ఈ సైద్ధాంతిక పునాది కారణంగానే దేశ కమ్యూనిస్టు ఉద్యమంలో సిపిఐ(ఎం) అనతికాలంలోనే అగ్రగామి శక్తిగా అవతరించింది. ఈ సందర్భంగా పార్టీ శ్రేయోభిలాషులూ, అభిమానులూ పదే పదే లేవనెత్తుతున్న అంశాలను కూడా ప్రస్తావించటం అవసరం. కమ్యూనిస్టు పార్టీ చీలకపోతే దేశంలో కమ్యూనిస్టు ఉద్యమం తీరుతెన్నులు మరో రకంగా ఉండేవన్న అభిప్రాయం వీరిలో ఉండటమే దీనికి కారణం అయి ఉండవచ్చు.

ఈ సందేహాలకు సమాధానమిస్తూ మూడు దశాబ్దాల క్రితం బిటి రణదివె ఇలా చెప్పారు: "అర్థరహితమైన, అవగాహనా రాహిత్యంతో

"ఈ కాలంలో పార్టీ పార్లమెంటరీ రాజకీయాల్లో ఎదుర్కొన్న వైఫల్యాల నేపథ్యంలో పార్టీపై బూర్జువా పత్రికల్లో, ప్రసార సాధనాల్లో జరుగుతున్న దాడులకు సమాధానం చెప్పాల్సిన అవసరం కూడా ఉంది. యాభై ఏళ్ల నాడు, 1964, ఏప్రిల్ 11న 32 మంది కమ్యూనిస్టు యోధులు పార్టీ జాతీయ కౌన్సిల్ సమావేశాల నుండి వాకౌట్ చేసిన సందర్భాన్ని పురస్కరించుకుని జరుపుకుంటున్న ఉత్సవాల్లో ఈ ప్రశ్నలకు కూడా సమాధానం చెప్పటం ఆ యోధులకు మనం అర్పించే నివాళి."

కూడిన కమ్యూనిస్టు ఉద్యమంలోని ఏ చీలిక అయినా నేరం. సరైన రాజకీయ వైఖరిని విభేదించి ఇటువంటి చర్యలకు పాల్పడే వారెవరైనా ప్రజల నుండి వేరుపడక తప్పదు. వారి తప్పుడు పంథాను సరిచేసుకోకపోతే ఒక రాజకీయ శక్తిగా వారు కాలగర్భంలో కలిసిపోక తప్పదు. అదేసమయంలో పార్టీ నాయకత్వం పొరపాటు పంథాను అనుసరిస్తున్నప్పుడు కూడా పార్టీలో చీలికలు సంభవిస్తాయి. వర్గసంకర రాజకీయాలను అనుసరిస్తున్న నాయకత్వ ధోరణులకు వ్యతిరేకంగా పోరాడేందుకు కంకణబద్ధులవుతాయి. ఇటువంటి ధోరణుల తప్పుడు ప్రభావాలను ఆచరణలో చూడొచ్చు." తర్వాతి కాలంలో సిపిఐ(ఎం) అగ్రగామి వామపక్ష శక్తిగా ఎదగటం ఈ అవగాహనే సరైనదని రుజువు చేసింది.

ఇదేసమయంలో ఈ కాలంలో పార్టీ పార్లమెంటరీ రాజకీయాల్లో ఎదుర్కొన్న వైఫల్యాల నేపథ్యంలో పార్టీపై బూర్జువా పత్రికల్లో, ప్రసార సాధనాల్లో జరుగుతున్న దాడులకు సమాధానం చెప్పాల్సిన అవసరం కూడా ఉంది. యాభై ఏళ్ల నాడు, 1964, ఏప్రిల్ 11న 32 మంది కమ్యూనిస్టు యోధులు పార్టీ జాతీయ కౌన్సిల్ సమావేశాల నుండి వాకౌట్ చేసిన సందర్భాన్ని పురస్కరించుకుని జరుపుకుంటున్న ఉత్సవాల్లో ఈ ప్రశ్నలకు కూడా సమాధానం చెప్పటం ఆ యోధులకు మనం అర్పించే నివాళి. తదనంతర కాలంలో భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) ఏర్పాటు క్రమంలో ఈ వాకౌట్ మైలురాయిగా నిలిచింది.

ప్రముఖ మళయాళ పత్రిక ఏప్రిల్12, 2014 నాటి సంచికలో "విధానాలు – వైఫల్యాలు: అర్థశతాబ్ది వృధా చేసుకున్న సిఐఐ(ఎం)" అన్న శీర్షికన ఒక కథనం ప్రచురించింది. ఈ కథనంలో ముందుకు తెచ్చిన అనేక అంశాలతో పాటు "వర్గాల స్వభావంలో మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా సిపిఐ(ఎం) మారలేక పోవటంలోనే ఆ పార్టీ వైఫల్యం ఇమిడి ఉంది" అని నిర్ధారించింది.

ఆర్థికాంశాలపై వెలువడే ప్రముఖ పత్రిక ఒకటి తన సంపాదకీయంలో "సిపిఐ(ఎం) యాభయ్యవ వార్షికోత్సం సందర్భంగా చరిత్రను ఎదుర్కోవటం పార్టీ ముందున్న అతి పెద్ద సవాలు" అని పేర్కొంది. సవాళ్లు ఎదుర్కోవటానికి సిపిఐ(ఎం) సదా సన్నద్ధంగానే ఉంటుంది. నిజానికి మారుతున్న పరిస్థితుల్లో ముందుకొచ్చే నూతన సవాళ్లను గుర్తించి వాటిని అధిగమించటం కోసమే సిపిఐ(ఎం) ఎల్లవేళలా ప్రయత్నిస్తోంది. అయితే సదరు సంపాదకీయంలో, "సిపిఐ(ఎం) తన చరిత్రలో అతి పెద్ద సవాలును ఎదుర్కొంటోంది. ప్రాసంగికతను కోల్పోవటం ఆ అతి పెద్ద సవాలు" ఎందుకంటే "కార్మికవర్గ స్వభావాన్ని అంచనా వేయటంలో సాంకేతిక పరిణామాల పాత్రను పార్టీ నాయకత్వం పూర్తిగా విస్మరించింది" అని సమాధానం కూడా చెప్పింది.



1964లో కలకత్తాలో జరిగిన సిపిఐ(ఎం) ఆవిర్భావ సభలో ప్రసంగిస్తున్న జ్యోతిబసు. వేదికపై ఎకె గోపాలన్, మాకినేని బసవపున్నయ్య, హరికిషన్ సింగ్ సూర్జిత్, ఇఎంఎస్ నంబూద్రిపాద్ ప్రభృతులు

ఈ విమర్శలకు సమాధానం చెప్పబోయే ముందు ఒక విషయాన్ని స్పష్టం చేయాలి. గతితర్కం మార్క్సిజపు మౌలిక సూత్రం. ఆచరణకు మార్గదర్శిగా ఉన్న సూత్రం. "నిర్దిష్ట పరిస్థితుల నిర్దిష్ట అధ్యయనం" అన్న సూత్రానికి సిపిఐ(ఎం) చైతన్యపూరితమైన అవగాహనతో ఎల్లవేళలా కట్టుబడి ఉంది. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా మార్క్సిస్టు విశ్లేషణ కూడా మారుతూ ఉండాలి. ఈ మార్పు లేకపోతే మార్క్సిజాన్ని తిరస్కరించటమే అవుతుంది తప్ప మరోటి కాదు. అంతేకాదు. మార్క్సిజంలోని సైద్ధాంతిక పటుత్వం, శాస్త్రీయ విశ్లేషణా పద్ధతిని తిరస్కరించినట్లే. ఈ అవగాహనతోనే మార్క్సిజం శాస్త్రీయమైనదనీ, సృజనాత్మక శాస్త్రమనీ, అందువల్ల అంతర్లీనంగానే మౌఢ్యానికి వ్యతిరేకమైన స్వభావం కలిగిన సిద్ధాంతమనీ సిపిఐ(ఎం) విశ్వసిస్తోంది. ప్రభోధిస్తోంది.

సామాజిక నిర్మాణంలో వేర్వేరు వర్గాల్లో చోటు చేసుకుంటున్న నిర్దిష్ట మార్పులను శాస్త్రీయంగా అధ్యయనం చేయాల్సిన అవసరం ఉంది. ప్రత్యేకించి పెట్టుబడిదారీ పూర్వపు విభజిత సామాజిక నిర్మాణం పునాదులపై పెట్టుబడిదారీ వ్యవస్థ నిర్మాణానికి పూనుకున్న తరుణంలో, ముఖ్యంగా సమాజాన్ని నిట్టనిలువునా చీల్చివేసే కుల వ్యవస్థ, తదనుగుణంగా తెరమీదకు వచ్చిన సామాజిక ఆర్థిక అణచివేత రూపాల నేపథ్యంలో ఇటువంటి విశ్లేషణ మరింత అవసరం. కానీ పైన ప్రస్తావించిన విమర్శకులు ముందుకుతెస్తున్న అంశాలు ఇవి కాదు. వాళ్లు వేసే బాణాలకు గురి మరో చోట ఉంది.

సమకాలీన ప్రపంచంలో కార్మికవర్గ స్వభావం మార్క్స్ కాలం నాటి పెట్టుబడిదారీ వ్యవస్థలో ఉన్న కార్మిక వర్గ స్వభావం కంటే భిన్నమైనదని నయా–ఉదారవాద పండితులు

**“ పెట్టుబడిదారీ వ్యవస్థలోని నిరంతర సంక్షోభం, ఇంకా స్పష్టంగా చెప్పాలంటే నేటి పరిస్థితుల్లో పెట్టుబడిదారీ వ్యవస్థలో పెరుగుతున్న అంతర్జాతీయ ద్రవ్యపెట్టుబడి పాత్ర, సమకాలీన ప్రపంచీకరణ దశలో నయా-ఉదారవాద విధానాలను ముందుకు తీసుకెళ్లటంలో ఈ అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడి పోషిస్తున్న పాత్రను అర్థం చేసుకోవాలంటే మార్క్సిస్టు విశ్లేషణా పద్ధతులు, ప్రమాణాలు పాటించటం తప్ప మరో మార్గం లేదు అని చరిత్ర పదే పదే రుజువు చేసింది. ”**

ఊదరగొడుతున్నారు. భౌతిక శ్రమ పాత్ర కుదించుకుపోతోంది, ఉత్పత్తి క్రమంలో శ్రమ పొందిక మారుతోంది. అందువల్ల కమ్యూనిస్టు ప్రణాళికలో మార్క్స్, ఏంగెల్స్‌లు ఇచ్చిన “ప్రపంచ కార్మికులారా ఏకం కండి. పోరాడితే పోయేదేమీ లేదు, బానిస సంకెళ్లు తప్ప” అన్న నినాదం నేటి ప్రపంచంలో సందర్భోచితం కాదు, ప్రాసం గికం కాదు” అని ఈ ఉదారవాద మేధావులు వాదిస్తున్నారు. ఎందుకంటే పెట్టుబడిదారీ వ్యవస్థ దోపిడీ సంకెళ్లల్లో బందీలైన కార్మికవర్గం ఆ వ్యవస్థ నుండి బయటకు రావటం ద్వారా కంటే ఈ వ్యవస్థలో కొనసాగటం ద్వారానే పొందే ప్రయోజనాలు, లబ్ది ఎంతో ఉందని వీరు వాదిస్తున్నారు. ఈ విమర్శకుల వాదనలను క్లుప్తీకరించి చెప్పుకోవాలంటే మార్క్స్ కాలంతో పోల్చి చూసినపుడు నేటి పరిస్థితుల్లో కార్మికవర్గ స్వభావం మారిపోయింది. సమకాలీన ఉదారవాద ప్రపంచీకరణ దశలో మార్క్సిజానికి కాలం చెల్లింది. సిపిఐ(ఎం) ఈ వాస్తవాన్ని గుర్తించనిరాకరిస్తున్నందువల్లనే పార్టీ కూడా ప్రాసంగికతను కోల్పోయే సవాలు ఎదుర్కొంటోంది.

ఈ కాలంలో మార్క్సిజం ప్రాసంగికత కోల్పోవటం కాదు. గత ఆరేడేళ్ల పరిణామాల్లో ఈ ప్రాసంగికత మరింత పెరిగింది. క్రైస్తవ మత పీఠం వాటికన్ నగరంలో పీఠాధిపతి పోప్ సమకాలీన ప్రపంచ పెట్టుబడిదారీ వ్యవస్థ ఎదుర్కొంటున్న సంక్షోభాన్ని అర్థం చేసుకోవటానికి మార్క్స్ రాసిన పెట్టుబడి గ్రంథం చదవాలని నిర్ణయించుకుని ఆ సంపుటాలు కొనుగోలు చేయాలని ఆదేశించినట్లు వచ్చిన వార్తలు పెరుగుతున్న మార్క్సిజం ప్రాసంగికతను గుర్తు చేసే ఒక ఉదాహరణ మాత్రమే.

పెట్టుబడిదారీ వ్యవస్థలోని నిరంతర సంక్షోభం, ఇంకా స్పష్టంగా చెప్పాలంటే నేటి పరిస్థితుల్లో పెట్టుబడిదారీ వ్యవస్థలో పెరుగుతున్న అంతర్జాతీయ ద్రవ్యపెట్టుబడి పాత్ర, సమకాలీన ప్రపంచీకరణ దశలో నయా–ఉదారవాద విధానాలను ముందుకు తీసుకెళ్లటంలో ఈ అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడి పోషిస్తున్న పాత్రను అర్థం చేసుకోవాలంటే మార్క్సిస్టు విశ్లేషణా పద్ధతులు, ప్రమాణాలు పాటించటం తప్ప మరో మార్గం లేదు అని చరిత్ర పదే పదే రుజువు చేసింది. ప్రపంచ వ్యాప్తంగా సంక్షుభిత పెట్టుబడిదారీ విధానపు దోపిడీ పద్ధతులకు వ్యతిరేకంగా ప్రారంభమైన “వాల్‌స్ట్రీట్ ఆక్రమణ” ఉద్యమం సంఘటిత వామపక్ష పార్టీలు, శక్తులు ప్రారంభించిన ాద్యమం కాదు. కానీ ఈ ఉద్యమం కూడా పెట్టుబడిదారీ వ్యవస్థలోని లోపాలను వ్యతిరేకించి ప్రయోజనం లేదని, మొత్తంగా లోపభూయిష్టమైన పెట్టుబడిదారీ వ్యవస్థకు వ్యతిరేకంగా గళం ఎత్తటమే ప్రస్తుత సమస్యలకు పరిష్కారం అని తన అనుభవం నుండి నిర్ధారించుకున్నది. మార్క్సిజం కూడా ఇవే నిర్ధారణలకు వచ్చింది. ఈ లోపభూయిష్టమైన వ్యవస్థను కూలదోసినపుడు మాత్రమే మానవాళి సంపూర్ణ సమగ్ర విముక్తి సాధ్యమవుతుంది. ఉదారవాద మేధావులకు ఇవేవో ప్రవచనాల్లాగా కనిపిస్తాయి కాబట్టి ఈ ప్రవచనాలకు కట్టుబడి ఉన్న సిపిఐ(ఎం) ప్రాసంగికత కోల్పోయి దంటున్నారు.

అంతేకాదు, కార్మికవర్గ పొందికలో ఏ మేరకు మార్పులు వచ్చినా భౌతిక శ్రమ స్థానంలో మేథో శ్రమ పాత్ర పెరిగినా పెట్టుబడిదారీ వ్యవస్థ మౌలిక పునాది – మనుషులే సాటి మనిషిని దోపిడీ చేయటం–లో మాత్రం ఏ రకమైన మార్పూ లేదు. ప్రపంచీకరణ దశలో సైతం పెట్టుబడిదారీ విధానం, వ్యవస్థ జీవనాడులు ఈ దోపిడీ పద్ధతుల్లోనే ఇమిడి ఉన్నాయన్నది తిరుగులేని వాస్తవం. చారిత్రక సత్యం. ఎందుకంటే పెట్టుబడిదారీ ఉత్పత్తి క్రమంలోనే దోపిడీ మూలాలు ఉన్నాయి. చరిత్రలో ఏ సమయంలోనైనా ఏ పరిస్థితుల్లోనైనా కార్మికులు సాధించే ఉత్పత్తి విలువతో పోల్చి చూసినపుడు వారికి ఇచ్చే వేతనాలు నామమాత్రమే. ఈ వ్యత్యాసమే పెట్టుబడిదారీ వ్యవస్థలో అదనపు విలువను పోగు చేస్తుంది. ఈ అదనపు విలువను పెట్టుబడిదారులు లాభం రూపంలో తమ జేబులో వేసుకుంటున్నారు. అందువల్ల సదరు కార్మికులు భౌతిక శ్రమ చేస్తున్నారా, మేథో శ్రమ చేస్తున్నారా అన్నదానితో నిమిత్తం లేదు. పెట్టుబడిదారీ ఉత్పత్తి క్రమంలో దోపిడీ విశ్వవ్యాపితం. సార్వత్రికం. సహజ లక్షణం. అటువంటి సార్వత్రిక సహజ దోపిడీ వ్యవస్థ నుండి విముక్తి పొందాలంటే దాన్ని కూకటి వేళ్లతో సహా కూలదోయటం తప్ప మరో ప్రత్యామ్నాయం లేదు. ఈ శాస్త్రీయ విజ్ఞానాన్ని గుర్తించటానికి నయా–ఉదారవాద పండితులు, మేథావుల ఒళ్లు గగుర్పొడుస్తుంది. అందుకే ఈ ప్రత్యామ్నాయాన్ని ముందుకు తెస్తున్న సిపిఐ(ఎం) నేటి అవసరాలకు తగిన పార్టీ కాదు అని కోడై కూస్తుంటారు.

ఇటువంటి విమర్శల్లో మరో కోణం విముక్తి స్వభావం, లక్ష్యాలతో నిమిత్తం లేని స్వచ్ఛంద సంస్థల ధోరణి. దోపిడీ వ్యవస్థ మూలాలను ప్రశ్నించకుండా ఈ స్వచ్ఛంద సంస్థలు లేవనెత్తే సమస్యలు, సాగించే ఉద్యమాలు నైతికంగా పైచేయి సాధించాలని ప్రతిపాదిస్తాయి. అన్నా హజారే చేపట్టిన అవినీతి వ్యతిరేక ఉద్యమానికి కార్పొరేట్ ప్రసార సాధనాలు అమితోత్సాహంతో ఇచ్చిన మద్దతు, ఆమ్ ఆద్మీ పార్టీకి శక్తికి మించి మీడియాలో వచ్చిన గుర్తింపునే గమనిద్దాం. వామపక్షాల తరహాలో ఈ శక్తులూ, సంస్థలూ, ఉద్యమాలూ దోపిడీ వ్యవస్థ మూలస్తంభాలను కుదిపే లక్ష్యంతో వచ్చినవి కాదు. ఈ పునాదులు కదలనంత వరకు బూర్జువా వర్గంపై చేసే అన్ని రకాల విమర్శలనూ నైతిక విమర్శలుగా భావించి స్వాగతిస్తారు. నిజాయితీతో కూడిన రాజకీయాలు, అవినీతికి స్వస్తి చెప్పటం వంటి నైతిక ప్రశ్నలపై తలెత్తే ఉద్యమాలకు సకల సాధన సంపత్తినీ సమకూర్చటానికి బూర్జువావర్గం వెనకాడదు. ప్రస్తుత వ్యవస్థకు ప్రత్యామ్నాయం లేదని వచ్చే వాదనలన్నింటికీ సోషలిజమే ప్రత్యామ్నాయం అన్న నినాదంతో, లక్ష్యంతో ముందుకెళ్తున్న సిపిఐ(ఎం)ను ఒంటరి పాటు చేయటం, ప్రజాపునాదిని దెబ్బతీయటం ఈ శక్తుల మౌలిక లక్ష్యం. వారి వర్గ ప్రయోజనాలు అందులోనే ఇమిడి ఉన్నాయి. అందుకే మారిన పరిస్తితుల్లో సిపిఐ(ఎం) ప్రాసంగికత కోల్పోయింది అన్న వాదనలకు పుష్కలమైన మీడియా మద్దతు లభిస్తుంది.

వామపక్ష మేధావులూ, సానుభూతిపరులూ ఈ చర్చల సందర్భంగా లేవనెత్తే అంశాల గురించి ఒక్కటే చెప్పదల్చుకున్నాం. పార్టీ అనుసరించే విధానాలూ, తీసుకునే వైఖరులూ, వేసే ఎత్తుగడల విషయంలో నిష్పాక్షిక విమర్శలకు సిపిఐ(ఎం) నిరంతరం స్వాగతం పలుకుతుంది. పురిటి నీళ్లతో పాటు పుట్టిన పాపను కూడా పారవేయాలన్న కుత్సితంతో చేసే విమర్శలను అంగీకరించాల్సిన అగత్యం సిపిఐ(ఎం) పార్టీకి లేదని నిర్మొహమాటంగా స్పష్టం చేస్తున్నాము.

మార్క్సిజం, దాని ఆధారంగా పని చేస్తున్న సిపిఐ(ఎం) ప్రపంచ వ్యాప్తంగా పేదలు ఎదుర్కొంటున్న కష్టాలు, ఇబ్బందులు, దోపిడీని అంతమొదించాలంటే అనివార్యంగా ఈ దోపిడీ, కష్టాలకు పునాదులు వేసిన పెట్టుబడిదారీ వ్యవస్థను అంతమొందించటం ఒక్కటే మార్గమని విశ్వసిస్తున్నాయి. అందువల్ల అటు మార్క్సిజానికి గానీ ఇటు సిపిఐ(ఎం)కు గానీ ఇది నైతిక ప్రశ్న మాత్రమే కాదు. రాజకీయ సైద్ధాంతిక ఆచరణాత్మ ప్రశ్న. ఈ వ్యవస్థను కూలదోయటం మాత్రమే విశ్వమానవాళి సమగ్ర విముక్తికి ఏకైక మార్గం అన్నది శాస్త్రీయ వాస్తవం.

ప్రపంచవ్యాప్తంగా ఇటువంటి పెట్టుబడిదారీ వ్యవస్థను కూలదోయటానికి అవసరమైన విముక్తి ఉద్యమాలను బలోపేతం చేసినపుడు మాత్రమే ఈ లక్ష్య సాధన నెరవేరుతుంది. సిపిఐ(ఎం) 20వ మహాసభలో ఆమోదించిన "కొన్ని సైద్ధాంతిక సమస్యలపై తీర్మానం" లో ఇటువంటి ప్రయత్నాలను బలోపేతం చేయాలంటే నిర్దిష్ట సమస్యలపై ఉద్యమించాలి. ఈ నేపథ్యంలోనే "భారత దేశ పరిస్థితులు : కొన్ని నిర్ది ష్ట సమస్యలు" అన్న భాగంలో పార్టీ మహాసభ ఇలా నిర్ధారించుకున్నది:

భారతదేశ ప్రత్యేక పరిస్థితుల్లో అంతర్జాతీయంగా వర్గశక్తుల బలాబలాలు సామ్రాజ్యవాదానికి అనుకూలంగా ఉన్న ప్రస్తుత పరిణామ దశలో విప్లవోద్యమాన్ని బలోపేతం చేయటం మన లక్ష్యం. ఈ పరిస్థితుల్లో విప్లవోద్యమాన్ని ముందుకు తీసుకెళ్లటానికి భారతదేశంలోని వర్గశక్తుల బలాబలాలు మార్చటం అవసరం. ఇందుకుగాను భారతదేశపు నిర్దిష్ట పరిస్థితుల్లో వర్గపోరాటాలకు పదును పెట్టటానికి శక్తివంతమైన ప్రజా పోరాటాలను సాగించాల్సిన అవసరం ఉంది.

పార్లమెంటరీ మరియు పార్లమెంటరీయేతర పోరాట రూపాలు: ఈ లక్ష్య సాధనకు గాను తాజాపర్చబడిన పార్టీ కార్యక్రమం చెప్పినట్లు, "భారతదేశంలో శాంతియుతమైన పద్ధతుల్లో

" మార్క్సిజం, దాని ఆధారంగా పని చేస్తున్న సిపిఐ(ఎం) ప్రపంచ వ్యాప్తంగా పేదలు ఎదుర్కొంటున్న కష్టాలు, ఇబ్బందులు, దోపిడీని అంతమొదించాలంటే అనివార్యంగా ఈ దోపిడీ, కష్టాలకు పునాదులు వేసిన పెట్టుబడిదారీ వ్యవస్థను అంతమొందించటం ఒక్కటే మార్గమని విశ్వసిస్తున్నాయి. అందువల్ల అటు మార్క్సిజానికి గానీ ఇటు సిపిఐ(ఎం)కు గానీ ఇది నైతిక ప్రశ్న మాత్రమే కాదు. రాజకీయ సైద్ధాంతిక ఆచరణాత్మ ప్రశ్న. "



సిపిఐ(ఎం) ఆవిర్భావ సభలో సంతాపతీర్మానం ప్రవేశపెట్టిన ఎకె గోపాలన్, అమరవీరులకు సంతాపం తెలుపుతున్న నేతలు

జనతా ప్రజాస్వామ్య సాధన ద్వారా సోషలిజం దిశగా దేశాన్ని నడిపించటానికి భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) కట్టుబడి ఉంది. పార్లమెంటరీ, పార్లమెంటరీయేతర పోరాటాలను మేళవించి శక్తివంతమైన ప్రజా విప్లవోద్యమాన్ని నిర్మించి అభివృద్ధి చేయటం ద్వారా, కార్మిక వర్గం, దాని మిత్రులు విప్లవ ప్రతిఘటనాశక్తుల ప్రతిఘటనను అధిగమించటానికి శాంతియుత పద్ధతుల్లో ఈ మార్పులు సాధించటానికి శాయశక్తులా ప్రయత్నిస్తాయి. అయితే ఒక విషయాన్ని ఎల్లవేళలా గుర్తు పెట్టుకోవాలి. పాలకవర్గాలు స్వచ్ఛందంగా ఎప్పుడూ అధికారాన్ని వదులకోవు. పాలకవర్గాలు ప్రజాభిప్రాయాన్ని తిరగదోడటానికి చట్టవిరుద్ధంగా, హింసాత్మక చర్యలద్వారా ప్రయత్నిస్తాయి. అందువల్ల విప్లవాన్ని కోరుకునేశక్తులు అప్రమత్తంగా ఉండాలి. అటువంటి పరిస్థితు లను ఎదుర్కోవటానికి వీలుగా తమను తాము సన్నద్ధం చేసుకోవాలి. జాతీయ రాజకీయ జీవితంలో చోటు చేసుకునే ఏ మార్పులనైనా ఎదుర్కోవటానికి సదా సన్నద్ధంగా ఉండాలి" అని ప్రకటించింది.

ఆ విధంగా ఆచరణలో పార్లమెంటరీ, పార్లమెంటరీయేతర పోరాటాలను సరైన రీతిలో మేళవించటం ప్రస్తుత పరిస్థితుల్లో పార్టీ ముందున్న ముఖ్యమైన కర్తవ్యం. మన పార్టీ కార్యక్రమం ఇంకా ఇలా పేర్కొంది: "బూర్జువావర్గపు పరిపాలనారూపంగా ఉన్నప్పటికీ భారతదేశంలోని ప్రస్తుత పార్లమెంటరీ వ్యవస్థ ప్రజల అభివృద్ధికి కూడా చిహ్నంగా ఉంది. రాజ్యాంగ యంత్రపు దైనందిన జీవితంలో జోక్యం చేసుకోవటం ద్వారా కొన్ని హక్కులు కాపాడుకొనే పోరాటంలో ఈ పార్లమెంట్ ముఖ్యమైన సాధనంగా ఉంది. తద్వారా సామాజిక ప్రజాస్వామిక ప్రగతి సాధనలో ఆయా తరగతుల ప్రజానీకాన్ని సమీకరించటానికి

> **“ప్రజా ఉద్యమాలను బలోపేతం చేసే వేదికలుగా పార్లమెంటరీ వేదికలను ఉపయోగించుకోవాలి. పార్లమెంటరీ రంగంలో జరిగే కృషిని పార్లమెంటరీయేతర రంగంలో జరిగే కృషి, పోరాటాలతో మమేకం చేసి ప్రస్తుత బూర్జువా భూస్వామ్య ప్రభుత్వ పాలకవర్గానికి ప్రత్యామ్నాయాన్ని సాధించటం కోసం జరిగే శక్తివంతమైన ఉద్యమాలను అభివృద్ధి చేయటానికి ఉపయోగించుకోవాలి.”**

వేదికగా ఉంది. (5.22 పేరా) అయితే ప్రజాస్వామిక వ్యవస్థపై పెరుగుతున్న బడా బూర్జువావర్గపు పట్టు, రాజకీయాల్లో ప్రభావం చూపుతున్న ధనబలం, అంతకంతకూ నేరపూరితమవుతున్న రాజకీయాలు మొత్తంగా ఈ ప్రజాస్వామ్య క్రమాన్ని నిర్వీర్యం చేస్తున్నాయి.”

2010 ఆగస్టు 7-10 తేదీల్లో విజయవాడలో జరిగిన పార్టీ విస్తృత కేంద్ర కమిటీ సమావేశాల్లో ఆమోదించిన రాజకీయ తీర్మానం ఇలా స్పష్టం చేసింది: “పార్లమెంటరీ ప్రజాస్వామ్యమే నయా-ఉదారవాదం, అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడి పలుకుబడి కింద నలిగిపోతోంది. నేరపూరిత రాజకీయాలు, ఎన్నికల్లో ధన ప్రభావం పెంచటం ద్వారా ప్రజాస్వామిక ప్రక్రియను దారిమళ్లించే క్రమం, ప్రజాతంత్ర హక్కుల హరణం కూడా పెరుగుతూ వస్తోంది. నిరసన తెలియచేసే హక్కు, బహిరంగ సభలు నిర్వహించుకునే హక్కు, సమ్మెహక్కులను అటు పరిపాలన పరమైన చర్యల ద్వారా ఇటు న్యాయస్థానాల ద్వారా పరిమితం చేస్తున్నారు. కుదించి వేస్తున్నారు. ఈ విధంగా ప్రజల హక్కులపై ఆంక్షలు విధించటాన్ని కార్పొరేట్ మీడియా సమర్థిస్తూ ప్రచారం చేస్తోంది. (తీర్మానంలోని 2.35 పేరా)

ఉన్నతమైన ప్రజాస్వామిక వ్యవస్థ - జనతా ప్రజాతంత్ర వ్యవస్థ స్థాపన క్రమంలో కార్మికవర్గం బూర్జువా భూస్వామ్య రాజ్యాంగ యంత్రంతో సాగించే పోరాటంలో ప్రజాతంత్ర హక్కుల పరిరక్షణ, విస్తరణ కోసం సాగే ఉద్యమం అంతర్భాగంగా ఉంటుంది. “ఇటువంటి ప్రయత్నాలకు వ్యతిరేకంగా ప్రజా ప్రయోజనాల రీత్యా పార్లమెంటరీ వ్యవస్థలు, ప్రజాతంత్ర సంస్థలను పరిరక్షించాల్సిన కర్తవ్యం ప్రాధాన్యత సంతరించుకున్నది. ఈ వ్యవస్థలనూ, సంస్థలనూ పార్లమెంటరీయేతర కార్యక్రమాలతో సమర్థవంతంగా మేళవించి ఉపయోగించుకోవాలి.” అని పార్టీ కార్యక్రమం పేర్కొంది. (పేరా 5.23)

ఈ అవగాహనతోనే ప్రజా ఉద్యమాలను బలోపేతం చేసే వేదికలుగా పార్లమెంటరీ వేదికలను ఉపయోగించుకోవాలి. పార్లమెంటరీ రంగంలో జరిగే కృషిని పార్లమెంటరీయేతర రంగంలో జరిగే కృషి, పోరాటాలతో మమేకం చేసి ప్రస్తుత బూర్జువా భూస్వామ్య ప్రభుత్వ పాలకవర్గానికి ప్రత్యామ్నాయాన్ని సాధించటం కోసం జరిగే శక్తివంతమైన ఉద్యమాలను అభివృద్ధి చేయటానికి ఉపయోగించుకోవాలి.

ఈ ప్రయత్నంలో చోటుచేసుకోవటానికి అవకాశం ఉన్న పొరపాట్లు, ఉల్లంఘనల పట్ల మనం అప్రమత్తంగా ఉండాలి. ఈ పొరపాటు ధోరణులు అనేక రూపాల్లో వ్యక్తం అయ్యే అవకాశం ఉంది. వర్గ, ప్రజా పోరాటాల్లో పాల్గొనాల్సిన అవసరం ప్రాధాన్యతను నీరుగార్చటంలో పార్లమెంటరీ ప్రజాస్వామ్యం ఒక ముఖ్యమైన సాధనంగా ఉంటుంది. ప్రత్యేకించి రాజ్యాంగయంత్రం జోక్యం, మద్దతు ద్వారా చేపట్టే చర్యలు ఇటువంటి పరిస్థితులకు దారితీస్తాయి. అటువంటి పొరపాటు ధోరణులకూ, భ్రమలకూ వ్యతిరేకంగా, ప్రజలను అటువంటి భ్రమల్లో ఉంచి పాలకవర్గాలు తమ ఆధిపత్యాన్ని కొనసాగించే ప్రయత్నాలకు వ్యతిరేకంగా పోరాడాల్సి ఉంది. ఈ పరిస్థితుల్లో దోపిడీకి గురవుతున్న వర్గాలను విప్లవ కార్యాచరణలోకి ప్రోత్సహించే విధంగా సరైన ఎత్తుగడలు అనుసరించాలి.

అంతేకాదు. శాంతియుత పద్ధతులద్వారా అధికారం చేపట్టవచ్చున్న భ్రమలకు కూడా పెద్దఎత్తున అవకాశం కలుగుతుంది. ఈ అంశానికి సంబంధించి పార్టీ కార్యక్రమం స్పష్టీకరించింది. పార్టీలో క్రమం తప్పకుండా చేపట్టిన దిద్దుబాటు ఉద్యమం పార్లమెంటరీ అవకావాదానికి వ్యతిరేకంగా నిరంతరం పోరాడాల్సిన అవసరాన్ని నొక్కి చెప్తోంది. పార్లమెంటరీ రంగంలో కృషిని పార్లమెంటరీయేతర రంగంలో జరిగే కృషితో మేళవించే క్రమంలో పార్లమెంటరీయిజానికి, పార్లమెంటరీ భ్రమలకు వ్యతిరేకంగా మనలను మనం అప్రమత్తులను చేసుకోవాలి.

ప్రస్తుత పరిస్థితుల్లో భారత ప్రజానీకం సాగిస్తున్న విప్లవాత్మక వర్గ పోరాటాన్ని ముందుకు తీసుకెళ్లే క్రమంలో వామపక్ష దుందుడుకువాదంగా మారిన మావోయిజం కొన్ని సైద్ధాంతిక సవాళ్లను ముందుకు తెస్తోంది. వారి అవగాహన తప్పు అని రుజువు అయ్యాక కూడా ఈ శక్తులు భారత పాలక వర్గాన్ని దళారీ బూర్జువావర్గం అన్న తమ అవగాహనను కొనసాగిస్తూనే ఉన్నాయి. అంతేకాదు. రాజ్యాంగ యంత్రానికి వ్యతిరేకంగా తక్షణ సాయుధ పోరాట కర్తవ్యానికి కట్టుబడి ఉన్నాయి. మరీ ప్రత్యేకించి ఈ శక్తులు సిపిఐ(ఎం)ను లక్ష్యంగా పెట్టుకుని పని చేస్తున్నాయి. ప్రతీఘాత బూర్జువా పార్టీలతో సైతం ఈ శక్తులు కుమ్మక్కై సిపిఐ(ఎం) శ్రేణులు, శ్రేయోభిలాషులపై మారణ కాండకు దిగుతున్నాయి. ఇటువంటి వామపక్ష దుందుడుకువాదానికి వ్యతిరేకంగా సైద్ధాంతిక పోరాటానికి పదును పెట్టాల్సిన అవసరం ఉంది. ఇటువంటి దుందుడుకువాదానికి వ్యతిరేకంగా రాజకీయంగానూ, నిర్మాణాత్మకంగానూ పోరాటం సాగించాల్సిన అవసరం ఉంది. శాస్త్రీయ విప్లవ పునాదులపై ఆధారపడి సోషలిస్టు వ్యవస్థ సాధన దిశగా భారత ప్రజానీకం సాగించే పోరాటాన్ని ముందుకు తీసుకెళ్లటానికి ఇది అనివార్యం.

ఈ రెండు ధోరణుల్లో మొదటి ధోరణికి గురైతే... కేవలం పార్లమెంటరీ రంగంపై ఆధారపడే రివిజనిస్టు పొరపాటు ధోరణికి గురై ప్రజా సమీకరణల ద్వారా ప్రజా పోరాటాలను నిర్లక్ష్యం చేయటానికి దారితీస్తుంది. మరోవైపున సాహసోపేత వామపక్ష దుందుడుకువాదానికి లోనైతే... పార్లమెంటరీ రంగం ప్రాధాన్యతను గుర్తించ నిరాకరించే స్థితికి విప్లవోద్యమం చేరుతుంది. దాంతో విప్లవోద్యమంలో ఇది బాలారిష్టంగా మారే ప్రమాదం ఉంది. వ్యూహం లేకుండా ఎత్తుగడలకే పరిమితం అయితే మితవాదం అవుతుంది. ఎత్తుగడలు లేకుండా వ్యూహానికే పరిమితం అయితే దుందుడుకువాదానికి దారితీస్తుంది. ఈ రెండు పొరపాటు ధోరణుల విషయంలో మనం అప్రమత్తంగా ఉండాలి.

సిపిఐ(ఎం) ఆవిర్భావం నుండీ భారత విప్లవ పంథాను సరైన దారిలో నడిపే క్రమంలో ఈ రెండు పొరపాటు ధోరణులకూ, ఇటువంటి అనేక ఇతర పొరపాటుధోరణులకూ వ్యతిరేకంగా నికరంగా పోరాడుతూ వచ్చింది. ఈ పోరాటం సిపిఐ(ఎం) ఏర్పాటుతో ముగియ

లేదు. అంతేకాదు, భారతదేశం విప్లవం సాధించిన తర్వాత కూడా ఈ పొరపాటు ధోరణులకు వ్యతిరేకంగా సాగే పోరాటం ముగింపుకు రాదు. మాజీ సోవియట్ యూనియన్, తూర్పు యూరప్ దేశాల పరిణామాలు మార్క్సిజం–లెనినిజం మౌలిక విప్లవాత్మక సూత్రాలకు వ్యతిరేకంగా ముందుకొచ్చే అన్ని రకాల పొరపాటు ధోరణుల పట్ల విప్లవ శక్తులు అప్రమత్తతతో వ్యవహరించాల్సిన అవసరాన్ని గుర్తు చేస్తున్నాయి. ఈ పొరపాటు ధోరణులకు వ్యతిరేకంగా పోరాడటంలో రష్యాలో జరిగిన వైఫల్యం సోషలిస్టు వ్యవస్థ పతనానికే కాదు, ఈ సోషలిస్టు నమూనాను 21వ శతాబ్దంలో అమలు చేయలేని స్థితికి తీసుకెళ్లింది.

> **“కార్మిక- కర్షక మైత్రి” : భారతదేశంలో విప్లవం సాధనలో మౌలిక అంశం. ఈ వ్యూహాత్మక లక్ష్యాన్ని ముందుకు తీసుకెళ్లే క్రమంలో కార్మిక కర్షక మైత్రిని బలోపేతం చేయటంలో ఉంది. ప్రస్తుత పరిస్థితుల్లో వర్గ పోరాటాలను బలోపేతం చేయాలంటే కార్మిక కర్షక మైత్రి సాధనలో ఉన్న బలహీన తలను అధిగమించాల్సి ఉంది. ఈ కర్తవ్యాన్ని నెరవేర్చటానికి భారత దేశంలో భౌతిక పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయి.**

**“కార్మిక– కర్షక మైత్రి”** : భారతదేశంలో విప్లవం సాధనలో మౌలిక అంశం. ఈ వ్యూహాత్మక లక్ష్యాన్ని ముందుకు తీసుకెళ్లే క్రమంలో కార్మిక కర్షక మైత్రిని బలోపేతం చేయటంలో ఉంది. ప్రస్తుత పరిస్థితుల్లో వర్గ పోరాటాలను బలోపేతం చేయాలంటే కార్మిక కర్షక మైత్రి సాధనలో ఉన్న బలహీనతలను అధిగమించాల్సి ఉంది. ఈ కర్తవ్యాన్ని నెరవేర్చటానికి భారత దేశంలో భౌతిక పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయి. పార్టీలో నిర్మాణ పరంగా ఉన్న బలహీనతలను మనం అధిగమించాల్సి ఉంది. ఈ క్రమంలో వ్యవసాయ కార్మికులు–పేద రైతుల మధ్య ఐక్యత సాధించటం కీలకమైన అంశంగా ఉంది. ఈ రెండు వర్గాలు అత్యంత దోపిడీకి గురవుతున్న వర్గాలు. రైతాంగంలోని అత్యంత విప్లవ స్వభావం కలిగిన తరగతులు ఇవి.

**“కార్మికవర్గ ఐక్యత”**: కార్మికవర్గ నాయకత్వంలో భారత ప్రజల విముక్తి సాధన కోసం కృషి చేయటానికి పార్టీ కంకణబద్ధురాలై ఉన్నందున, వర్గపోరాటంలో – భారతదేశంపై పెట్టుబడి ఆధిపత్యానికి వ్యతిరేకంగా సాగే పోరాటంలో – దేశంలో దోపిడీకి గురవుతున్న అన్ని తరగతులు, వర్గాలకు నాయకత్వం వహించే స్థాయికి ఎదిగేలా కార్మికవర్గ ఐక్యత, చైతన్యం పెంపొందించటం అనివార్యమైన కర్తవ్యం.

“సామ్రాజ్యవాద ప్రపంచీకరణ నేపథ్యంలో ఈ కర్తవ్యం మరింత సంక్లిష్టమైనది. నయా–ఉదారవాద విధానాల తర్కమే అంతకం తకూ అత్యధిక కార్మికవర్గాన్ని వేగంగా అసంఘ టిత వర్గంగా మార్చేస్తుంది. శాశ్వత ఉపాధిని కాంట్రాక్టు, కాజువల్ ఉపాధిగా మార్చటం అనేది... అమిత లాభాలు సంపాదించటానికి ఉపయోగపడడమే కాక రెండో వైపున కార్మికవర్గ



భారత కమ్యూనిస్టు ఉద్యమాన్ని రివిజనిజం నుండి కాపాడ్డంలో కీలక పాత్ర నిర్వహించిన నవరత్నాలు. తొలి పొలిట్‌బ్యూరో సభ్యులు

ఐక్యతను విచ్ఛిన్నం చేయటంలో పాలకవర్గాలు అనుసరిస్తున్న వ్యూహం కూడా. క్రమేపీ అత్యధిక సంఖ్యలో కార్మికులు కాజువల్ కార్మికులుగానూ, కాంట్రాక్టు కార్మికులుగానూ, స్వయం ఉపాధిపై ఆధారపడే కార్మికులుగానూ మారిపోతున్నారు. ఈ సవాళ్లను అధిగమించటానికీ, కార్మికవర్గ ఐక్యత సాధిచంటానికీ తగిన ఎత్తుగడలు అనుసరించాల్సిన అవసరం ఉంది. తద్వారా నానాటికీ పెరుగుతున్న అసంఘటిత రంగ కార్మికులను విప్లవ కార్యాచరణలో అంతర్భాగం చేయాలి. “కార్మిక సంఘాలు ఆర్థిక డిమాండ్లకే పరిమితం అవటానికి (ఎకనమిజం) వ్యతిరేకంగా సాగేపోరాటం అన్ని విప్లవ పోరాటాల్లోనూ అంతర్భాగంగా ఉంటూ వచ్చింది. 20వ శతాబ్దంలో సోషలిజం సాధన కోసం జరుగుతున్న పోరాటాల నుండి దీనికి సంబంధించి మరింత అవగాహన పెంచుకుని ప్రస్తుత పరిస్థితులకు వర్తింపచేయాల్సి ఉంది.

**“అస్థిత్వ రాజకీయాలు”**: పెట్టుబడిదారీ వ్యవస్థ ఆవిర్భావానికి ముందు నుండే పాలక వర్గాలు అస్థిత్వాలను తమ రాజకీయ ప్రయోజనాలకు వాడుకుంటూ వచ్చాయి. తమ వర్గ ప్రయోజనాలను పరిరక్షించుకునే క్రమంలో పాలక వర్గాలు జాతీయత వంటి అస్థిత్వాల ఆధారంగా నూతన జాతీయవాదాన్ని కూడా తెరమీదకు తెచ్చాయి. ఉదాహరణకు 19వ శతాబ్దంలో ప్రారంభమైన యూదుదురహంకారం కాలక్రమంలో ఇజ్రాయిల్ దేశం ఏర్పాటుకు దారితీయటం అటువంటి పరిణామాలకు ఒక ఉదాహరణ. విప్లవ ప్రతీఘాత శక్తులు మాజీ సోవియట్ రిపబ్లిక్కులలో తమ ఆధిపత్యాన్ని సుస్థిరం చేసుకోవటానికి అస్థిత్వాలను సాధనంగా ఉపయోగించుకున్నాయి. పూర్వపు యుగోస్లావియాను కూడా ఇటువంటి అస్థిత్వాల ప్రాతిపదికనే ముక్కలు చేశారు. భారతదేశంలో మతపరమైన అస్థిత్వాలను నాడు బ్రిటిష్ సామ్రాజ్యవాదం, నేడు పాలకవర్గాలు సమర్థంగా ఉపయోగించుకుంటున్నాయి. అణగారిన వర్గాల మధ్య ఉండాల్సిన వర్గ సంఘీభావానికి నేటికీ కులం, మతపరమైన సమీకరణాలు విఘాతం కలిగిస్తున్నాయి. నేటి పరిస్థితుల్లో బూర్జువావర్గం ఒకవైపున పీడిత ప్రజల వర్గ ఐక్యతను విచ్ఛిన్నం చేయటానికి అస్థిత్వాలను ఉపయోగించుకుంటుంటే మరో వైపున ప్రభుత్వేతర సంస్థలు ఇటువంటి అస్థిత్వం ఆధారిత సమీకరణాలకు పాల్పడటం ద్వారా ప్రజలను రాజకీయాలకు దూరం చేస్తున్నాయి.

“మార్క్సిస్టు వ్యతిరేక సైద్ధాంతిక భావజాలం

> **“లింగవివక్షకు సంబంధించిన సమస్యలు”: కులవ్యవస్థ రూపంలో కొనసాగుతున్న సామాజిక అణచివేత ద్వారా సమాజంలో శక్తివంతమైన పురుషాధిక్య భావజాలం వేళ్లూనుకునిపోయింది. నయా-ఉదారవాద చట్రం ఈ విలువలను మరింత పెంచి పోషిస్తోంది. లైంగిక వివక్ష కేవలం భూస్వామ్య వ్యవస్థకు చెందిన అణచివేత రూపమే కాదు, వర్గ సమాజాల్లో సైతం వ్యవస్థీకృతం చేయబడింది.”**

-ఆధునికోత్తరవాదం- రాజకీయాలు సూక్ష్మ స్థాయిలోనే, స్థానిక స్థాయిలోనే ఉండాలనీ, అస్థిత్వం, వృత్యాసం ప్రాతిపదికనే సాగాలనీ ప్రతిపాదిస్తోంది. తాజా పరిస్థితుల్లో అస్థిత్వ రాజకీయాలకు ఆధునికోత్తరవాదం నూతన అవకాశాలు కల్పిస్తోంది.

“ఆధునికోత్తరవాదులు ప్రతిపాదిస్తున్న అస్థిత్వ రాజకీయాల్లో ప్రస్తుత పరిస్థితుల్లో జాతీయత, మతం, కులం, తెగ, లింగం వంటి అస్థిత్వాలు క్రమంగా రాజకీయాలకూ, రాజకీయ సమీకరణాలకూ నూతన వేదికలుగా మారుతున్నాయి. వర్గం కూడా ఒకానొక అస్థిత్వమే అన్న వాదన ముందుకొస్తోంది. తద్వారా అస్థిత్వ రాజకీయాలు కార్మికవర్గం అన్న భావనకే విరుద్ధమైనవి. స్వభావం రీత్యానే అస్థిత్వ రాజకీయాలు ఒక అస్థిత్వానికి చెందిన ప్రజలను మరో అస్థిత్వానికి చెందిన ప్రజల నుండి వేరు చేస్తున్నాయి. అస్థిత్వరాజకీయాలు వేళ్లూనుకున్న ప్రాంతాల్లో ప్రజలు పరస్పరం కలహించుకునే ముఠాలుగా తయారు చేస్తున్నాయి.

“ఈ అస్థిత్వ రాజకీయాలు బూర్జువా పాలకవర్గాల ప్రయోజనాలకు సరిపోతాయి. ఈ అస్థిత్వాలను మార్కెట్ మరింతగా విభజిస్తోంది. నిజానికి ఆధునిక పెట్టుబడిదారీ సమాజాల్లో వివిధ రకాల జీవన విధానాలను ప్రోత్సహించి, ఆయా జీవన విధానాలు, సందర్భాలకు తగ్గట్లుగా ఆధునిక రీతులు, వినిమయ వస్తువులు రూపొందించటం ద్వారా ఆయా తరగతులు, వర్గాల ప్రజలను వినియోగదారులుగా మారుస్తున్నాయి. అంతగా అభివృద్ధి చెందని పెట్టుబడిదారీ దేశాల్లో అస్థిత్వ రాజకీయాలు అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడి ప్రభావం, పలుకుబడి విస్తరించటానికీ, మార్కెట్ విస్తరణకూసాధనాలుగా మారుతున్నాయి. వివిధ అస్థిత్వ సమూహాల మధ్య ఉన్న వ్యత్యాసం మార్కెట్, దాని విధానాల్లో ఉన్న ఏకీకృత స్వభావానికి ఆటంకం కలిగించటం లేదు. వర్గ ఐక్యతను నిర్వీర్యం చేయటానికి మాత్రమే అస్థిత్వ రాజకీయాలు పని చేస్తున్నాయి. ఐక్య ప్రజా ఉద్యమాల నిర్మాణానికి అవరోధంగా మారుతున్నాయి. పౌరసమాజం అని పిలువబడుతున్న ప్రభుత్వేతర సంస్థలు, స్వచ్ఛంద సంఘాల మాధ్యమంగా అస్థిత్వ రాజకీయాల కొనసాగింపు జరుగుతోంది. ఎవరికి వారే యమునా తీరేలా వ్యవహరించే ఇటువంటి స్వచ్ఛంధ సంఘాలు, ప్రభుత్వేతర సంస్థలు అస్థిత్వ రాజకీయాలను ప్రోత్సహించటానికి ముఖ్యమైన సాధనాలుగా పని చేస్తున్నాయి.

“సామాజిక అణచివేతపై పోరాటం, కులం ప్రాతిపదికన సమీకరణాలు”: కులం, తెగల ఆధారంగా సాగే రాజకీయ సమీకరణాల ద్వారా ముందుకెళుతున్న అస్థిత్వ రాజకీయాలు పీడిత ప్రజలను ఐక్యం చేసే ఉద్యమాలకూ, రాజకీయాలకూ పెనుసవాలు విసురుతున్నాయి. కార్మికవర్గ పార్టీ దళితులు, వెనకబడిన తరగతులకు చెందిన ప్రజానీకపు సమస్యలు భూమి, వేతనాలు, జీవనోపాధి వంటి సమస్యలపై పని చేస్తూనే సామాజిక అణచివేత, వివక్షకు వ్యతిరేకంగా విస్తృత ప్రజాపోరాటాలు చేపట్టాలి. వర్గ, సామాజిక సమస్యలపై ఉమ్మడిగా ఉద్యమాలు సాగించటం ద్వారా అస్థిత్వ రాజకీయాల ప్రతికూల ప్రభావాన్ని నియంత్రించటం సాధ్యమవుతుంది. సామాజిక అణచివేతకూ, వర్గదోపిడీకీ మధ్య ఉన్న అంతఃస్సం బంధం గురించి మార్క్సిస్టు దృక్పథం నుండి ఈ కృషి జరగాలి.

“సమాజంలో వర్గదోపిడీ, సామాజిక అణచివేత ఉన్నాయన్నది సిపిఐ(ఎం) వైఖరి. దేశంలో ఉన్న సామాజిక ఆర్థిక వ్యవస్థల నిర్మాణం నేపథ్యంలో పెట్టుబడిదారీ, అర్ధ భూస్వామ్య వర్గ దోపిడీ కులం, లింగం, తెగ వంటి రూపాల్లో సామాజిక అణచివేతతో సమ్మిళితమై ఉంటుంది. పాలకవర్గాలు వర్గ దోపిడీ ద్వారా అదనపు విలువను స్వంతం చేసుకుంటాయి. వారి ఆధిపత్యాన్ని కొనసాగించటానికి గాను అనేక రూపాల్లో సామాజిక అణచివేతకు పాల్పడతాయి. అందువల్ల రెండు రకాలైన దోపిడీకీ, అణచివేతకూ వ్యతిరేకంగా సమాంతర పోరాటాలు చేపట్టాలి.

**“లింగవివక్షకు సంబంధించిన సమస్యలు”:** కులవ్యవస్థ రూపంలో కొనసాగు తున్న సామాజిక అణచివేత ద్వారా సమాజంలో శక్తివంతమైన పురుషాధిక్య భావజాలం వేళ్లూనుకునిపోయింది. నయా-ఉదారవాద చట్రం ఈ విలువలను మరింత పెంచి పోషిస్తోంది. లైంగిక వివక్ష కేవలం భూస్వామ్య వ్యవస్థకు చెందిన అణచివేత రూపమే కాదు, వర్గ సమాజాల్లో సైతం వ్యవస్థీకృతం చేయబడింది. అసమాన శ్రమ విభజన, కుటుంబ ఆర్థిక వ్యవస్థలో మహిళలపై ఎక్కువ భారాలు

---

## ‘మార్క్సిస్టు’ పై
## మీ అభిప్రాయాలు తెలపండి!

‘మార్క్సిస్టు’ సైద్ధాంతిక మాసపత్రిక పైనా, పత్రికలోని నిర్దిష్ట వ్యాసాలపైనా మీ అభిప్రాయాలనూ, సూచనలనూ ఆహ్వానిస్తు న్నాం. ఆయా వ్యాసాలపై మీరు చర్చించా ల్సిన అంశాలున్నా, అదనపు సమాచార మున్నా క్లుప్తంగా రాసి పంపండి

మీ లేఖలు అందాల్సిన చిరునామా!

**ఎడిటర్,**

‘మార్క్సిస్టు’ సైద్ధాంతిక మాసపత్రిక

ప్రజాశక్తి ప్రెస్, గవర్నరుపేట, విజయవాడ-2

పడటం వంటి పరిణామాలు నయా–ఉదారవాద విధానాల అమలు వల్లా, నానాటికీ ప్రభుత్వం తన బాధ్యతలను విస్మరించటం వల్లా మరింత తీవ్రమైంది. అన్ని రూపాల్లో కొన సాగుతున్న లైంగిక వివక్ష, లైంగిక అసమానతలు, అణచివేతలకు వ్యతిరేకంగా పోరాటం సాగించాల్సిన అవసరం ఉంది. కార్మికవర్గ పార్టీగా సిపిఐ(ఎం) భారత ప్రజల్లో లైంగిక అణచివేతకు వ్యతిరేకంగా తగిన రీతిలో సామాజిక చైతన్యాన్ని పెంపొందించేందుకు కృషి చేయటం వర్గపోరాటాన్ని బలోపేతం చేసే కర్తవ్యంలో అంతర్భాగంగా పరిగణించాలి.

**"ఌ ఈ** 

**"మతోన్మాదం":** ఈ నేపథ్యంలో మెజారిటీ మతోన్మాదం, దాని ఇతర రూపాలూ, మైనారిటీ ఛాందసవాదాలను పరిగణనలోకి తీసుకోవాలి. ఆధునిక భారతదేశ లౌకిక పునాదులను బలహీనపర్చి, ఆటంకపరుస్తాయి. (ఆరెస్సెస్ ప్రతిపాదిస్తున్న అసహనంతో నిండిన హిందూరాష్ట్ర వంటి ప్రతిపాదనలు) వర్గ సమస్యల ప్రాతిపదికన ప్రజా సమీకరణలను ముందుకు తీసుకెళ్లటానికి ముఖ్యమైన సాధనంగా వాన్న ప్రజాతంత్ర హక్కులకు లౌకికపునాదులు అవసరం. ఈ పునాదులను బలహీనపర్చటం ద్వారా కార్మికవర్గ ఐక్యతకు మతతత్వ శక్తులు విఘాతం కలిగిస్తున్నాయి. మతోన్మాద భావాలు ప్రేరేపించటం, మతపరమైన భావోద్రేకాలు రెచ్చగొట్టడం ద్వారా పీడితుల ఐక్యతను చీల్చటానికి ఈ శక్తులు పూనుకుంటున్నాయి. అందువల్ల మతోన్మాదాన్ని ఓడించటానికి నికరమైన పోరాటం చేయకుండా ఈ దేశంలో విప్లవ పురోగమనం సాధ్యం కాదు.

**"జాతీయవాదం":** బూర్జువావర్గం ఆవిర్భావంతో భూస్వామ్య వ్యవస్థకు వ్యతిరేకంగా పెట్టుబడిదారీ విధానం జాతీయ చైతన్యాన్ని పెంపొందించటం ద్వారా ఆధునిక జాతీయ వాదం తెరమీదకు వచ్చింది. 20వ శతాబ్దంలో వలస, అర్థ వలస దేశాల్లో సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా సాగిన పోరాటాల్లో జాతీయ వాదం నిర్దిష్టరూపం తీసుకొన్నది. ఆ మాజీ వలస దేశాల్లో పాలకవర్గాలు ఆధిపత్య వర్గాలుగా ఎదగటంతో ఆయా దేశాల్లోని జాతీయవాద భావాల్లో అంతర్లీనంగా ఉన్న సామ్రాజ్యవాద వ్యతిరేకత నిర్వీర్యమైంది. సామ్రాజ్యవాద ప్రపంచీకరణ నేపథ్యంలో జాతీయ సార్వభౌమత్వం మీద నిరంతర దాడి జరుగుతోంది. అన్ని జాతీయ దేశాలు తమ జాతీయ సార్వభౌమత్వాన్ని తమకు ఫణంగా పెట్టాలని అంతర్జాతీయ సామ్రాజ్య వాద ద్రవ్య పెట్టుబడి ఆదేశిస్తోంది.

"అనేక ప్రాంతీయ, జాతి ఆధారిత అస్థిత్వాల ఆధారంగా సాగుతున్న సమీకరణలతో జాతీయవాదానికి నూతన సవాళ్లు ఎదురవుతున్నాయి. ప్రత్యేక తెలంగాణ, డార్జిలింగ్ రాష్ట్రాలు కోసం సాగుతున్న ఉద్యమాలు, అవేతరహా డిమాండ్లతో దేశవ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో సాగుతున్న ఉద్యమాలు భాషా ప్రయుక్త రాష్ట్రాల ఆవిర్భావం వెనక ఉన్న మౌలిక సూత్రాలకు విఘాతం కలిగించటమే కాక పీడిత వర్గాల ఐక్యతను విఘాతం కలిగిస్తున్నాయి.

"అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడి వివిధ దేశాల్లో జాతి ఆధారిత జాతీయవాదం, వేర్పాటు వాదాలను ప్రోత్సహించటం ద్వారా ఆయా దేశాల జాతీయ సార్వభౌమత్వాన్ని, సమైక్యతా సమగ్రతలను బలహీనపరుస్తుంది. అటుంటి ప్రతీఘాత స్వభావం కలిగిన సంకుచిత భావాల ప్రాతిపదికన ముందుకొచ్చే జాతీయ వేర్పాటువాదాలను మనం ప్రజాతంత్ర హక్కుల కోసం పోరాడే క్రమంలో నిర్ద్వంద్వంగా వ్యతిరేకించాలి. న్యాయబద్ధమైన వివక్ష, అణచివేతలకు వ్యతిరేకంగా తలెత్తే ఉద్యమాలను మనం బలపర్చాలి. శక్తివంతం చేయాలి. అదేసమయంలో సామ్రాజ్యవాద వ్యతిరేక జాతీయవాదం, జాతీయ సార్వభౌమత్వ లక్ష్యాల కోసం పీడిత వర్గాల నడుమ సంఘీభావం కల్గించే ఉద్యమాలు నిర్మించి సామ్రాజ్యవాద ప్రపంచీకరణకు వ్యతిరేకంగా సాగే పోరాటాల మధ్య వర్గ ఐక్యతను సాధించాలి.

"భారతదేశం వంటి బహుళజాతుల దేశం, ప్రపంచ స్థాయిలో ఏ దేశమూ పోటీ పడలేనంత స్థాయిలో ఉన్న సామాజిక సాంస్కృతిక వైవిధ్యం కలిగిన దేశంలో పైన పేర్కొన్న ధోరణులన్నీ ఏ సమయంలోనైనా ముందుకొచ్చే అవకాశం వాంది. ఈ ధోరణులు పీడిత వర్గాల ఐక్యతను విచ్ఛిన్నం చేసి వ్యూహాత్మక లక్ష్యం దిశగా సాగుతున్న పోరాటాన్ని బలహీనపరుస్తాయి. వివిధ పీడిత వర్గాల వర్గ సమస్యలపై శక్తివంతమైన ఉద్యమాలూ, పోరాటాలూ నిర్మించే క్రమంలో ఆయా వర్గాల మధ్య ఐక్యత సాధించటం ద్వారా మాత్రమే ఇటువంటి ధోరణులకు అడ్డు కట్ట వేయగలం. భాషా ప్రయుక్త రాష్ట్రాల పునాదులను ధ్వంసం చేయటానికీ, పునర్నిర్మించటానికీ పాలకవర్గాలు పూనుకున్నప్పుడు పార్టీ అనుసరించిన ఎత్తుగడలవెనక ఉన్న అవగాహన ఇదే."

ప్రస్తుత పరిస్థితుల్లో సిపిఐ(ఎం) ఆవిర్భావ స్వర్ణోత్సవం సందర్భంగా భారత దేశంలో విప్లవ సాధన క్రమంలో అన్ని రకాల పీడిత వర్గాలనూ కార్మికవర్గ నాయకత్వం కింద ఏకం చేసే స్వీయమానసిక అంశం ద్వారా అంటే..... కార్మికవర్గపు విప్లవాత్మక సైద్ధాంతిక పోరాటాన్ని బలోపేతం చేయటం, మార్క్సిజం, లెనినిజం ప్రాతిపదికగా కొనసాగుతున్న పార్టీ నాయకత్వం కింద కార్మికవర్గపు నిర్ణయాత్మక జోక్యం పెంచుకోవటం – ద్వారా ప్రస్తుతం దేశంలో ఉన్న వర్గ శక్తుల బలాబలాలను మార్చటానికీ, జనతా ప్రజాస్వామ్యం సాధన దిశగా పోరాటం ఎక్కుపెట్టటానికీ, దాని పునాదులపై సోషలిజం దిశగా జరిగే పోరాటాలను బలోపేతం చేయటానికీ కంకణబద్ధులం కావాలి.

సోషలిజం భవిష్యత్తు ఏమిటి అన్న ప్రశ్నకు సోషలిజం ఒక్కటే భవిష్యత్తు అన్నదే సమాధానం. అలా కాని పక్షంలో మానవాళి భవిష్యత్తు మధ్యయుగాల నాటి అరాచక చీకటి కాలం దశకు తిరోగమిస్తుంది.

ఈ మాసం ప్రత్యేకం

# ముస్లింలపై ఆర్ఎస్ఎస్ విద్వేష ప్రచారం



రచయిత 'సెంటర్ ఫర్ స్టడీ ఆఫ్ సొసైటీ అండ్ సెక్యులరిజం' సంస్థ డైరెక్టర్. లౌకికతత్వం మీదా, సామాజికాంశాలమీదా అనేక పుస్తకాలు, వ్యాసాలు రాశారు.

**ఇర్ఫాన్ ఇంజినీర్**

ఆర్ఎస్ఎస్–హిందూత్వ సంస్థలు అసలు చర్చనీయాంశమే కాని అంశాలను తీసుకొని, కొన్ని మతాలను విదేశీయులని ముద్రవేసి, వారిని అపఖ్యాతిపాలు చేసేలా వ్యవహరిస్తున్నాయి. హిందూత్వ గురించి వి.డి. సావార్కర్ రాసిన కరపత్రంలో ఈ విధంగా పేర్కొన్నారు: 'ఉమ్మడి శత్రువుపై ద్వేషం ప్రజలను జాతులుగానూ, జాతులను రాజ్యాలుగానూ ఐక్యం చేస్తుంది. ద్వేషం ప్రజలను విడదీస్తుంది... ఐక్యం చేస్తుంది". సావార్కర్ దృష్టిలో ఉమ్మడి శత్రువులంటే తమ పవిత్ర భూమి అయిన హిందుస్తాన్‌లో అంటే సింధునది, అరేబియన్ సముద్రం మధ్యభాగంలో లేనటువంటి ముస్లింలు, క్రిస్టియన్‌లన్నమాట. ఆనాటి నుండి హిందూత్వ సంస్థలు వాస్తవిక శత్రువునుకాక ఊహాజనిత శత్రువునూ, చారిత్రక శత్రువును కాక కట్టుకథల ద్వారా ఉమ్మడి శతృవునూ రూపొందించటానికి తమ శక్తియుక్తులను వెచ్చిస్తున్నారు. మొదటగా వాళ్ళు ప్రత్యేకంగా ముస్లింలపైనే కేంద్రీకరించారు. 1998లో బిజెపీ నాయకత్వంలోని ఎన్డీఏ అధికారంలోకి వచ్చిన తర్వాత తమ బహిరంగసభలలో హిందువులను క్రైస్తవ మతంలోకి మార్చటానికి ప్రయత్నిస్తున్నారంటూ క్రైస్తవులను కూడా ఉమ్మడి శత్రువుగా చూపటం ప్రారంభించారు.

తాము విదేశీయులని చెబుతున్న వారిపై విదేశీ ముద్ర వేయడానికి హిందూత్వ సంస్థలు ప్రత్యేకమైన పద్ధతిలో విషయాలను ఎంచుకుంటాయి. మొదటగా తమ ఉన్నత నేతలకు శిక్షణా కార్యక్రమాలలో సిద్ధాంతపరంగా ఈ విషయాన్ని బోధిస్తారు. ఆ విధంగా శిక్షణ పొందిన నాయకులు స్థానికంగా జరుగుతున్న చిన్నచిన్న విషయాలనూ, వాటిద్వారా వచ్చే నష్టాలనూ, ప్రమాదాలనూ పెద్దవి చేసి చూపుతూ, కొత్త విషయాలనూ కూడా సృష్టిస్తుంటారు. కొందరు వ్యక్తులు ఈ ప్రమాదాలు వాస్తవమనీ, ప్రమాదకరమనీ నమ్మే వరకు ఈ అంశం గురించి రోజూ చర్చ చేస్తుంటారు. ఆవిధంగా ఎదుటి మతంవారిపట్ల వ్యతిరేకతను పెంచుతారు. అలా వ్యతిరేకత పెంచుకున్నవారి సంఖ్య గణనీయంగా పెరిగాక, ఊహాజనిత శత్రు మతస్తులను లక్ష్యంగా పెట్టుకొని, హింసాపూరిత కార్యకలాపాలను రెచ్చగొడతారు. ఈ హింస, సంఘటన గురించి మీడియాలో విస్తృతంగా ప్రచారం కావటానికి, ప్రజలలో ఆ సంఘటన పట్ల ఆసక్తి పెరగటానికి కారణమౌతుంది. ఈ అంశాలలో శిక్షణ పొందిన హిందూత్వ సంస్థల నాయకులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకొని, పుకార్లను వ్యాపింపజేస్తూ మతాల వారీగా ప్రజలు సంఘటితం అయ్యేలా చేస్తారు.

చిన్న విషయాలను తీసుకొని శత్రు మతంగా ముద్రవేయటానికి ప్రయత్నిస్తూ ప్రజల ఆలోచనలను ప్రభావితం చేసే పద్ధతిని మొదట పరిశీలిద్దాం. పబ్‌లలో మహిళలపై దాడులు చేసినప్పుడూ, వాలంటైన్స్‌డే వేడుకలపై దాడుల సందర్భాలలోనూ వచ్చినట్లు ప్రజలనుండి ప్రతికూలత వస్తే ఆ విషయాన్ని ఆ స్థాయిలో వదిలేస్తారు. హింసాత్మక దాడులకు ప్రజల నుండి తగినంత వ్యతిరేకత రాకపోతే అప్పుడు ఉన్నతస్థాయి హిందూత్వ సంస్థలు ఆ విషయంపై విస్తృతంగా సాహిత్యం విద్వేషభావాలూ వ్యాపింపజేస్తూ, ద్వేషం రెచ్చగొట్టేలా కట్టుకథలు సృష్టిస్తారు. ఊహాజనిత శత్రు మతానికి వ్యతిరేకంగా అపనమ్మకం, అనుమానాలు పెంచే విధంగా ప్రచారం చేస్తారు. ఇంకా నీచంగా, అసహ్యాన్ని, కోపాన్ని పెంచే విధంగా ప్రచారం చేస్తారు. చివరగా ఈ అంశంలో బి.జె.పి. అధికార, ప్రభుత్వస్థాయిలో జోక్యం చేసుకొంటుంది. ఫుట్‌బాల్, బాస్కెట్‌బాల్ క్రీడలలోని క్రీడాకారులు బంతిని గోల్ చేయటానికి ముందున్న ఆటగాడికి అందించిన విధంగా  హిందూత్వ సంస్థలు కూడా ప్రజల్ని విభజించే అంశాన్ని తమకు ముందున్న తమ సంస్థలకు అందజేస్తూ ఉంటాయి. మీడియాలో విస్తృతంగా ప్రచారం చేయటానికీ, ప్రజల్లో తీవ్రమైన చర్చనీయాంశం చేయటానికీ ప్రతి దశలోనూ హింసను రెచ్చగొడతారు. ప్రజల్లో ఆసక్తిని రేకెత్తించే విధంగా నిరంతరం తప్పుడు ప్రచారం చేస్తుంటారు. బాబ్రీ మసీదు కూల్చివేతలో కూడా ఈ అన్ని దశల కార్యక్రమం నడిచింది. 1949లో రాముడి విగ్రహాలను లోపల పెట్టి, ముస్లింలు రాకుండా మసీదు ద్వారాలను మూసి తాళం వేశారు. లోపల పెట్టిన విగ్రహాలకు పూజ చేయటానికి ఒక పూజారి వెళ్ళటానికి అనుమతించారు. 1980లో ప్రజల దర్శనానికి రామ జన్మభూమి తలుపులు తెరిపించాలని విశ్వ హిందూ పరిషత్ ప్రచారం ప్రారంభించింది. 1986లో తలుపులు తెరిపించింది. ఆ ప్రచారాన్ని ఎంత జయప్రదంగా నడిపారంటే శ్రీరాముడు ఏ శతాబ్దంలో పుట్టాడో కూడా తెలియనప్పటికీ ఎక్కువమంది ప్రజలు రాముడు పుట్టిన స్థలం అదేనని నమ్మేలా చేశారు. ఈ ప్రచారం రామాలయం విషయమేకాక, మసీదులు కట్టటానికి ముస్లింలు దేవాలయాలను కూల్చివేశారనీ, ఆ విధంగా 3000ల దేవాలయాలను కూల్చి మసీదులు కట్టారనీ విస్తృత ప్రచారం చేశారు. దేవాలయాలు కూల్చి కట్టారని చెబుతున్న

3000ల మసీదుల జాబితా విడుదల చేయకుండా, ఎప్పుడు ఏ మసీదునైనా ఈ జాబితాలో చేర్చే విధంగా ఉంచారు.

2002లో గుజరాత్‌లో ముస్లిం వ్యతిరేక ఘర్షణలు, రైలు బోగీల దగ్ధానికి ప్రతిగా అప్పటికప్పుడు జరిగినవి కావు. హిందువుల్ని ఒక జాతిగా వుంచాలంటే ఉమ్మడి శత్రువును చూపించాలనేది సావార్కర్ సిద్ధాంతం. ఈ సిద్ధాంతం ప్రకారం ప్రజలలో మతపరమైన చీలికలు తీసుకురావడానికి హిందూత్వ సంస్థలు చేసిన కుట్ర ఫలితం అది. ముస్లింలు, క్రైస్టవులు హిందువులకు ఉమ్మడి శత్రువులని బిజెపీ గుజరాత్‌లో అనేక ఏళ్లపాటు ప్రచారం చేసింది. మొదట చిమన్ భాయ్ పటేల్ నాయకకత్వంలోని జనతాదళ్‌తో కలిసి అధికారంలో ఉన్నప్పుడూ, తర్వాత బిజెపీ ఒంటరిగా అధికారంలోకి వచ్చినప్పుడూ వివిధ అంశాలను తీసుకొని ప్రచారం చేసింది. వర్ష–హనీఫ్‌ల వివాహాన్ని అవకాశంగా తీసుకొని రోజుల తరబడి బార్డోలి బంద్ నిర్వహించింది. సంఘవిద్రోహ శక్తుల నివారణ చట్టం (ప్రివెన్షన్ ఆఫ్ యాంటిసోషల్ యాక్ట్) తీసుకొచ్చి హనీఫ్‌ను జైల్లో పెట్టించారు. మీసా, టాడా లాంటి చట్టాలద్వారా ఇటువంటి నిరంకుశాధికారాలను పోలీసుల చేతికిచ్చారు. 'లవ్ జిహాద్' అనే మాటను అప్పటికి సృష్టించ లేదు. హనీఫ్ (వర్ష) చేసిన నేరానికి హింస, సామాజిక బహిష్కరణ, షాపులు, ఇళ్ళను దగ్ధం చేయటం ద్వారా బార్డోలీలో ఉన్న మొత్తం ముస్లింలను శిక్షించారు. ఈ హింసాకాండకు బాధ్యతనంతా తనపైనే రుద్ది, భరించలేనంత తీవ్రమైన ఒత్తిడి తెచ్చేవరకు వర్ష హనీఫ్‌తోనే గట్టిగా నిలబడింది. ఈ హింసను మషాళాలు దట్టించిన కథనాలతో ఇచ్చి మీడియా టిఆర్‌పి రేటింగ్‌నూ, సర్క్యులేషన్‌నూ పెంచుకుంది.

ముస్లింలు ఆవులను చంపుతున్నారని హిందూత్వ సంస్థలు ప్రచారం ప్రారంభించి, ఆవులను ఒక ప్రాంతంనుండి మరో ప్రాంతానికి తరలించే ట్రక్కు ఓనరుగానీ, డ్రైవర్‌గానీ ముస్లిం అయితే ఆ వాహనాన్నీ, ఆవులనూ స్వాధీనం చేసుకొని, సంబంధిత ముస్లింలను కొట్టి, ముస్లింలు ఆవులను చంపటానికి వధ్యశాలలకు చట్టవిరుద్ధంగా తరలిస్తున్నారని మీడియాద్వారా వార్తలు వ్యాపింపజేస్తున్నారు. కొన్ని సమయాల్లో రవాణా చేస్తున్నవి ఆవులు కావు, కొన్ని సమయాలలో వాటిని వధ్యశాలలకు తీసుకొని పోవటం కూడా లేదు. తగిన రసీదులతో కొనుగోలు చేసిన కొనుగోలుదారుడు తీసుకెళ్లడం జరుగుతోంది. హిందూత్వ సంస్థలకు తగినంత పలుకుబడి ఉన్నచోట కనీసం వారికనుకూలమైన పోలీస్ అధికారులైనా ఉన్నచోట్ల ఇవి జరుగుతున్నాయి. ఆ పశువులను వారు తమకు ప్రచారం కోసం లభించిన అయాచిత వరంగా భావిస్తున్నారు.

**"ముస్లింలు, క్రైస్టవులు హిందువులకు ఉమ్మడి శత్రువులని బిజెపీ గుజరాత్‌లో అనేక ఏళ్లపాటు ప్రచారం చేసింది. మొదట చిమన్ భాయ్ పటేల్ నాయకకత్వంలోని జనతాదళ్‌తో కలిసి అధికారంలో ఉన్నప్పుడూ, తర్వాత బిజెపీ ఒంటరిగా అధికారంలోకి వచ్చినప్పుడూ వివిధ అంశాలను తీసుకొని ప్రచారం చేసింది. వర్ష-హనీఫ్‌ల వివాహాన్ని అవకాశంగా తీసుకొని రోజుల తరబడి బార్డోలి బంద్ నిర్వహించింది. సంఘవిద్రోహ శక్తుల నివారణ చట్టం తీసుకొచ్చి హనీఫ్‌ను జైల్లో పెట్టించారు."**



ఆర్ఎస్ఎస్ విద్వేష ప్రచారానికి బలయ్యేది పేదప్రజలే

ముస్లింలలో బహు భార్యత్వం ఉందనీ, వారి సంఖ్య త్వరగా పెరుగుతున్నదనీ, అది త్వరలోనే హిందువులను మించిపోతుందనీ ప్రచారం చేస్తున్నారు. వారు మన దేశానికి విధేయంగా ఉండరనీ, పాకిస్తాన్‌లోని వారి నాయకులకు విధేయులుగా వుంటారనీ, వారు దౌర్జన్యంగా, హింసాత్మకంగా వ్యవహరిస్తారనీ, సంఘ వ్యతిరేక శక్తులుగా, లైంగిక నేరాలకు పాల్పడేవారిగా వుంటారనీ, వారి స్త్రీల పట్లనే లైంగికంగా నేరపూరితంగా వ్యవహరిస్తారనీ, సామాజిక, నైతిక విషయాల్లో రెటమతంగా వుంటారని ప్రచారం చేస్తారు. ఆ విధంగా శత్రు మతాలు రెటమతాలని ప్రచారం చేస్తారు.

క్రైస్తవ మతస్తులకు కూడా వారి పవిత్ర భూమి జెరుసలేంలో ఉందనీ, కొందరు మత మార్పిడిల ద్వారా బలహీనులైన హిందువులను క్రైస్తవ మతంలోకి మారుస్తున్నారనీ ప్రచారం చేస్తున్నారు. వ్యక్తులు స్వచ్ఛందంగా క్రైస్తవంలోకి మారటాన్ని వందలాది జిల్లాల్లో సమస్యగా సృష్టించారు. క్రైస్తవ మతంలోకి మారటంపై అతి ప్రచారం, హింసాకాండ చోటు చేసుకున్నాయి. బిజెపి రాష్ట్రాలలోనూ, కేంద్రంలో ఎన్‌డిఎ అధికారంలో కొచ్చిన తర్వాత గుజరాత్‌లోని డాంగ్ జిల్లా, మధ్యప్రదేశ్‌లోని ఝుబువా జిల్లాల్లో క్రైస్తవులపై దాడులు పెరిగాయి. మత మార్పిడులపై జాతీయస్థాయిలో చర్చ జరగాలని నాటి ప్రధాని వాజ్‌పేయి చెప్పారు. ఒరిస్సాలోని కాంధమాల్ జిల్లాలో క్రైస్తవ వ్యతిరేక ఘర్షణల క్రమంలో మయూర్ భంజ్ జిల్లాలో గ్రాహం స్టెయిన్స్‌ను, ఆయన ఇద్దరు పిల్లలను హత్య చేయటం (అప్పుడు బి.జె.పి. రాష్ట్ర ప్రభుత్వంలో భాగస్వామిగా ఉంది) హిందూత్వ సంస్థల పనితీరుకు నిదర్శనం.

### హిందూత్వ శక్తులు ప్రేమను ఎందుకు సమస్యగా చేస్తున్నాయి?

వివిధ మతాల ప్రజల మధ్య సన్నిహిత సంబంధాలు ఏర్పడటాన్ని హిందూత్వ శక్తులు సహించలేవు. దైవపూజ, సంస్కృతి, నాగరికతలు ఉమ్మడిగా ఉండటం, కలిసి నివసించే ప్రాంతాలు, వివాహ సంబంధాలు మతాలమధ్య చిచ్చు

**"హిందూత్వ శక్తులు అగ్రకులాధి క్యతను ఒకవైపు కొనసాగిస్తూనే, అన్ని కులాలనూ కలిపేసి ఒకేజాతిగా రూపుదిద్దాలని ప్రయత్నిస్తున్నాయి. సావార్కర్ మాటల్లో 'భారతదేశం తన ఆత్మకు అనుగుణంగా రాజకీయంగా, భౌతికంగా జీవించాలంటే జాతికీ, జాతీయత దృఢత్వానికీ సంబంధించిన బలం కోల్పోకూడదు'. దీన్ని కొనసాగిస్తూనే అగ్రవర్ణ ఆధిపత్యంతో కూడిన నిచ్చెన మెట్ల కులవ్యవస్థను కొనసాగించడం హిందుత్వ లక్ష్యం."**

పెట్టేవారికి శాపాలుగా పరిణమిస్తాయి. సావార్కర్ తన రచనలలో హిందూత్వ గురించి ఈ విధంగా చెబుతారు: "మనలోనూ మన శత్రువులలోనూ ఉమ్మడిగా వున్న అంశాలు వారిని వ్యతిరేకించటంలో మనల్ని బలహీనులుగా చేస్తాయి. మనతో ఒక్క అంశంలో కూడా సారూప్యత లేని శత్రువును దృఢంగా ఎదుర్కోగలం". అందువల్లనే హిందూత్వ శక్తులు ఇతర మతాలవారిని వేరుగా ముద్రవేస్తారు. హింసాకాండద్వారా సాధారణాంశాలను వ్యతిరేకిస్తారు. చాలా సాధారణమైన వ్యత్యాసాల్ని, చివరికి వంటలోనూ, తిండిలోనూ ఉండే వ్యత్యాసాలను కూడా పెద్దవిచేసి ముఖ్యమైనవాటిగా చూపి, హింసాకాండ ద్వారా ప్రచారం కల్పిస్తారు. హింస, అబద్ధ ప్రచారం, వ్యత్యాసాల్ని అతి ముఖ్యమైన వాటిగా చూసిస్తారు. అనుమానితులుగా ముద్రవేయటం తదితరాలు కొద్ది సంవత్సరాల క్రితం కన్నా ఇప్పుడు పెరిగింది. ముస్లింలు, క్రైస్తవులు మనకు భిన్నంగా ఉన్నారనే ప్రచారానికి విస్తృత ప్రచారం లభిస్తుంది. ఈ అభిప్రాయం మిగతా ప్రాంతాలకన్నా మత ఘర్షణలు జరిగిన ప్రాంతాల్లో ఎక్కువగా ఉంది. ముజఫర్‌నగర్ ఇందుకు తాజా ఉదాహరణ. 2013 సెప్టెంబర్‌లో మత ఘర్షణలు జరిగే వరకు జాట్‌లు, ముస్లింలు సామాజికాంశాల్లో ఒకే విధమైన మాటతీరు, పెళ్ళిళ్లు నీతి నియమాలకు, గోత్రాలకు సంబంధించి ఒకేవిధంగా వ్యవహరించేవారు. ఒకే తేడా ఏమిటంటే వేర్వేరు ప్రార్థనా స్థలాలకు వెళ్ళేవారు. మత ఘర్షణల తర్వాత మేము ముజఫర్‌నగర్ వెళ్ళినప్పుడు 'వారు', 'మేము' అనే పదాలను సాధారణంగానే వాడుతున్నారు. ప్రతి మత ఘర్షణ నివాసప్రాంతాలు మతపరంగా విడివడటానికి దారితీస్తున్నది. 1993 మత ఘర్షణల తర్వాత బొంబాయిలో ఈ విభజన తీవ్రమైన తర్వాత ముస్లింలు కొన్ని ప్రాంతాల్లో కేంద్రీకృతం చేయబడ్డారు. 1992-93 మత ఘర్షణ తర్వాత ముంబ్రాలోని మీరా రోడ్డులో



హిందూత్వ సంస్థలు ముస్లిం వ్యతిరేక ప్రచారాన్ని ఒక వ్యూహం ప్రకారం చేస్తాయి.

విస్తృత ముస్లిం కేంద్రీకృత నివాస ప్రాంతాలు ఉనికిలోకొచ్చాయి. తాజాగా హిందూ నివాస ప్రాంతాలకు పక్కనే స్థలం కొన్న ముస్లిం ఆ స్థలాన్ని వదులుకొని అక్కడనుండి వెళ్ళిపోవాలనీ, లేదా బలవంతంగా లాక్కోవాలనీ ప్రవీణ్ తొగాడియా ఒక గుంపును రెచ్చగొట్టాడు.

వివిధ భాషలు మాట్లాడుతూ 33 కోట్ల మంది దేవతలనూ, దేవుళ్ళనూ కొలిచేవారిని ç|YdYT¡Ôá+eTq+V¾+<ŠÖeTÔá+>±స్తున్నా. ఏ దేవుని నమ్మనివారినీ, వివిధ రకాలైన తత్వశాస్త్ర గ్రంథాలకు కట్టుబడేవారినీ ఏమందాం? కఠిన నిబంధనలతో కూడిన నిచ్చెన మెట్లు వంటి కులవ్యవస్థలో వీరు ఏ విధమైన వివరణకు అందరు. హిందూత్వ శక్తులు అంతర్గత వైరుధ్యాన్ని తగ్గించటానికి, అవసరమైతే వాటిని కొనసాగిస్తూనే– ముఖ్యంగా అగ్రకులాధిక్యతను ఒకవైపు కొనసాగిస్తూనే, అన్ని కులాలనూ కలిపేసి ఒకేజాతిగా రూపుదిద్దాలని ప్రయత్నిస్తున్నాయి. సావార్కర్ మాటల్లో 'భారతదేశం తన ఆత్మకు అనుగుణంగా రాజకీయంగా, భౌతికంగా జీవించాలంటే జాతికీ, జాతీయత దృఢత్వానికీ సంబంధించిన బలం కోల్పోకూడదు'. దీన్ని కొనసాగిస్తూనే అగ్రవర్ణ ఆధిపత్యంతో కూడిన నిచ్చెన మెట్ల కులవ్యవస్థను కొనసాగించడం హిందుత్వ లక్ష్యం. వివిధ మతాల మధ్య వున్న ఉమ్మడి సంస్కృతి గురించి తెలిసిన సావార్కర్ 1923లో రాసిన గ్రంథంలో హిందుత్వ గురించి చెబుతూ: సింధూనది–అరేబియన్ సముద్రాల మధ్యగల పవిత్ర భూమి అయిన సింధూస్తాన్‌లో ఉన్న వారందరిలో ఒకే రక్తం ప్రవహిస్తున్నది అన్నారు. ఈ ఒకేరక్తం అనే అంశంలో కుల నిచ్చెనలో క్రిందిస్థాయిలో పశువుల కన్నా హీనంగా చూడబడుతున్న, అవమానాలెదుర్కొంటున్న, దోపిడీకి, అణచివేతకు గురౌతున్న వారి గురించి అంతగా పట్టించుకోలేదు. కాబట్టి విభేదాన్ని సృష్టించటం, వాటిని అతి ముఖ్యమైన వాటిగా మార్చటం, హింస ద్వారా ఉమ్మడి శత్రువును సృష్టించటం, ఇది వివిధ రకాల భిన్నత్వాల కలవారిని హిందూ జాతిగా రూపొందించటంలో రెండవ భాగం. సావార్కర్ మాట్లాడుతూ "ఈ అలగాజనం యొక్క దేశవ్యాపిత మైత్రి... బ్రాహ్మణులను వధించి, మతపరమైన కర్మకాండల్నీ, బలుల్నీ నాశనం చేసి, మునుల కుమార్తెలను ఎత్తుకుపోయి, అనేక పాపాలు చేసి, విష్ణువుచే వధించబడ్డ అసురులు, మ్లేచ్ఛులుగా పునర్జన్మ పొందటానికి దారితీస్తుంది" అని చెప్పాడు.

కాబట్టి మతాంతర వివాహాలనేవి హిందూత్వ సంస్థలకు ముఖ్యమైన అంశం. అవి భిన్నత్వాలున్న మతాన్ని ఒక దృఢమైన జాతి, జాతీయతగా రూపొందించటానికి ప్రయత్నిస్తాయి. శత్రువుకూ, మనకూ ఒక విషయంలో ఐక్యత ఉంటే మనం బలహీనపడతామని సావార్కర్ చెప్పారు. 1923లో ఆయన రాసిన గ్రంథంలో మ్లేచ్ఛులు మునుల కుమార్తెలను ఎత్తుకెళ్ళడాన్ని సమస్యగా సృష్టించాడు. దేశ విభజన సందర్భంలో జరిగిన రక్తపాతం తర్వాత ప్రధాన మత ఘర్షణ 1961లో జబల్‌పూర్‌లో జరిగింది. బీడీరంగంలో క్రమంగా తన వాటా పెంచుకొంటున్న ముస్లిం యజమాని కుమారునితో కలిసి ఉషాభార్గవ్ వెళ్ళిపోవడం, ఆ ముస్లిం యువకుడు ఉషాభార్గవ్‌ని మానభంగం చేశాడని రెచ్చగొట్టే విధంగా రాయటం ఉషాభార్గవ్ ఆత్మహత్య చేసుకోవటానికి దారితీసింది.

1998లో పంచ మహల్ జిల్లాలోని రాధికాపూర్‌లో, బార్డోలీలో జరిగిన మతాంతర వివాహాలు బి.జె.పి. పాలిత రాష్ట్రంలో మత ఘర్షణలు రెచ్చగొట్టడానికి కారణమైనాయి. రాధికాపూర్‌లో ముస్లిం యువకులు హిందూ బాలికలను ఎత్తుకెళ్ళి మానభంగాలు చేస్తున్నారని ఎటువంటి ఆధారాలు లేకుండానే ప్రచారం చేశారు. ప్రశాంతంగా ఉండే ఆ కుటుంబాలు తమ రక్షణకోసం మూడు నెలలు ఊరొదిలి వెళ్ళాల్సి వచ్చింది. బార్డోలిలో వర్షాషా, హనీఫ్

మెమన్‌లు 1998 జూన్‌లో వివాహం చేసుకున్నారు. ఈ సంఘటన మైనారిటీలపై దాడులకూ, వారి సామాజిక బహిష్కరణకూ దారితీసింది. హనీఫ్‌ను పిఎఎస్ఎ చట్టం క్రింద అరెస్టు చేయటమే కాదు రాష్ట్రంలో అధికారంలో వున్న బి.జె.పి. ప్రభుత్వం మతాంతర వివాహాల రిజిస్ట్రేషన్‌కు ముందుగా రెవెన్యూ అధికారుల అనుమతి పొందాలని జీవో చేసింది. అంటే ప్రభుత్వమే ఇటువంటి వివాహాలకు వ్యతిరేకంగా వ్యవహరించడం ప్రారంభించిందన్న మాట. నాటి నుండి అటువంటి వివాహాలు చేసుకున్న జంటలను గురించి హిందూత్వ సంస్థలకు తెలిస్తే వాటికి వ్యతిరేకంగా దర్యాప్తు నిర్వహించి, ఆ జంట అంగీకరించినా, వారి తల్లిదండ్రులు కూడా బలపరిచినా కూడా అటువంటి వివాహాలు చట్టబద్ధం కావటాన్ని అసాధ్యం చేస్తున్నారు. ఈ మధ్య అహ్మదాబాద్‌లో జరిగిన ముస్లిం మహిళల వర్క్‌షాప్‌లో పాల్గొన్నవారు గుజరాత్‌లో మతాంతర వివాహాలు అసంభవం అని చెప్పినప్పుడు మేము ఆందోళన చెందాం. అలా పెళ్ళి చేసుకోవాలనుకున్న వారికున్న ఒకే మార్గం వారి కుటుంబాల భద్రతనూ, జీవనాధారాన్నీ వదిలేసి వేరే రాష్ట్రాలకు పారిపోయి పెళ్ళి చేసుకోవటమే. వేరే రాష్ట్రంలో జీవనాధారం చూసుకోవటం కష్టమే కాక, ప్రతి జంట తమ కుటుంబాలతో సంబంధాలను రద్దు చేసుకోవటం, సంక్షోభం ఎదురైనప్పుడు తమ కుటుంబాల మద్దతు లేకుండా వుండటం సాధ్యం కాదు. పారిపోయిన జంటలను విడదీయటంలో కూడా బాబూ భజరంగీ నైపుణ్యం సంపాదించాడు. అందుకనుసరించే పద్ధతి యువకుడు బాలికను ఎత్తుకెళ్ళి మానభగం చేసినట్లు కేసు పెట్టి, గుజరాత్ పోలీసులు ఆ యువకుని కోసం వెదికేలా చేస్తారు. ఆ యువకుని పోలీస్ కస్టడీలోకి తీసుకున్న తర్వాత తగిన 'ట్రీట్‌మెంట్' ఇచ్చి ఆ జంట విడిపోయేలా చేస్తారు.

**బి.జె.పి. 'లవ్ జిహాద్' ప్రచారం**

'లవ్ జిహాద్' అనే మాటను ఈ మధ్య కాలంలో వాడుకలోకి తెచ్చారు. 1961లో జబల్‌పూర్‌లో వుషా భార్గవ్ కేసులో తీవ్ర దాడి, ప్రచారం జరిగినా, 1998లో బార్డోలీలో వర్ష–హనీఫ్ కేసులోగాని, ఇంకా ఇతర అనేక కేసుల్లోగాని 'లవ్ జిహాద్' అనే మాట రాలేదు. మతాంతర వివాహాలపై సాధారణంగా చేసే దాడి బాలికలను అపహరించుకొని వెళ్ళి మానభగం చేశారని ఆరోపణలు చేయడం. బాలిక జీవిత భాగస్వామిని ఎంపిక చేయాల్సిన ఆమె తల్లిదండ్రుల నుండి కూడా ఒత్తిడి వుండేది.

> **"'లవ్ జిహాద్' అనే మాటను ఈ మధ్యకాలంలో వాడుకలోకి తెచ్చారు. 1961లో జబల్‌పూర్‌లో వుషా భార్గవ్ కేసులో తీవ్రదాడి, ప్రచారం జరిగినా, 1998లో బార్డోలీలో వర్ష-హనీఫ్ కేసులోగాని, ఇంకా ఇతర అనేక కేసుల్లోగాని 'లవ్ జిహాద్' అనే మాట రాలేదు."**



ముజఫర్‌పూర్ అల్లర్లకు నిర్వాసితులైన పేద ముస్లిం కుటుంబం

సిమి, ఇండియన్ ముజాహిద్దీన్ లాంటి సంస్థలు చేస్తున్న టెర్రరిస్టు దాడులను 'జిహాద్' పేరుతో మీడియా విస్తృతంగా ప్రచారంలోకి తెచ్చింది. మతాంతర వివాహాలపై దాడులు చేస్తున్న హిందూత్వ మేధావులు ఈ పదాన్ని తీసుకొని మతాంతర వివాహాలకు, ముఖ్యంగా ముస్లిం యువకుడు, హిందూ యువతి వున్న వివాహాలకు ఈ ముద్ర వేస్తున్నారు. చాలామంది ఇస్లాం పండితులు జిహాద్ అంటే ఒకని అధికృతా భావాలనూ, కోరికలనూ, దురాశ, అసూయ, భయం తదితరాలనూ, భగవంతుని మార్గానికి దూరంగా తీసుకెళ్ళే వాటినీ అదుపులో పెట్టుకోవటానికి చేసే ప్రయత్నంగా, పోరాటంగా చెబుతున్నారు. కాని మధ్యయుగాల ముస్లిం పాలకులూ, ఇస్లాంను దుర్వినియోగం చేస్తున్న ముస్లిం సంస్థలూ ఒకవైపు, మరొకవైపున మీడియా జిహాద్ అంటే ఇస్లాంపై నమ్మకం లేనివారిపై దాడులు చేయటం, టెర్రరిస్టు దాడులు చేయటంగా చిత్రీకరిస్తున్నారు. మతాంతర వివాహాలకు జిహాద్‌ను ముడిపెట్టడం మొదటగా రెండు సంవత్సరాల క్రితం కేరళలో ప్రారంభమై తర్వాత వుత్తర కర్ణాటకకు చేరింది. అక్కడి హిందూత్వ సంస్థలు ముస్లిం యువకులు, హిందూ బాలికల సంబంధాలకు ఈ పదాన్ని విస్తృతంగా వాడుకలోకి తెచ్చాయి.

ముస్లిం యువకులకు దురాలోచనలతోనే మతాంతర వివాహాలు చేసుకుంటున్నారని కర్ణాటకలో హిందూత్వ సంస్థలు తీవ్ర ప్రచారం చేశాయి. ఆ ప్రచారం వెనుక లక్ష్యం వ్యక్తిగత స్వేచ్ఛనూ, ఎంపిక చేసుకొనే హక్కును, ముఖ్యంగా మహిళలు తమ జీవిత భాగస్వామిని ఎంపిక చేసుకొనే హక్కును హరించటమే. వాస్తవానికి వారు యువతీ యువకుల మధ్య స్నేహ, సన్నిహిత సంబంధాల్ని వ్యతిరేకిస్తున్నారు. కుమారులు, కుమార్తెలు జీవిత భాగస్వామి ఎంపిక తోపాటు అన్ని అంశాలలోనూ తల్లిదండ్రుల మాట జవదాటకుండేలా ఆంక్షలు విధిస్తున్నారు. పిల్లలు ఎంపికద్వారా చేసుకొనే పెళ్ళిళ్ళకు ఆ మతంలోని పెద్దల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమౌతున్నది. "లవ్ జిహాద్"ను వుపయోగించి సాగించిన ప్రచారం సాధించినదేమిటంటే, సాధారణంగా మతాంతర వివాహాలను సమర్థించే యూనివర్శిటీ విద్యార్థులు కూడా తప్పుదారి పట్టి మతాంతర వివాహాలను వ్యతిరేకించేట్లు

> **“ముస్లిం యువకులకు దురాలోచనలతోనే మతాంతర వివాహాలు చేసుకుంటున్నారని కర్ణాటకలో హిందూత్వ సంస్థలు తీవ్ర ప్రచారం చేశాయి. ఆ ప్రచారం వెనుక లక్ష్యం వ్యక్తిగత స్వేచ్ఛనూ, ఎంపిక చేసుకొనే హక్కును, ముఖ్యంగా మహిళలు తమ జీవిత భాగస్వామిని ఎంపిక చేసుకొనే హక్కును హరించటమే. వాస్తవానికి వారు యువతీ యువకుల మధ్య స్నేహ, సన్నిహిత సంబంధాల్ని వ్యతిరేకిస్తున్నారు. జీవిత భాగస్వామి ఎంపికలో తల్లిదండ్రుల మాట జవదాటకుండేలా ఆంక్షలు విధిస్తున్నారు.”**

చేసింది. మా సంస్థ సి.ఎస్.ఎస్.ఎస్. యూనివర్శిటీ విద్యార్థులకు వర్క్‌షాప్ నిర్వహించినప్పుడు మతాంతర వివాహాలకు ఎదురైన వ్యతిరేకతను చూసి ఈ రచయిత ఆశ్చర్యపోయాడు.

**యు.పి. ఎన్నికలు**

యు.పి. అసెంబ్లీలో బి.జె.పి. పరిమిత స్థానాలే పొందింది. తాను 16వ లోక్‌సభ ఎన్నికలలో కేంద్రంలో అధికారంలోకి రావాలంటే యు.పి. కీలకం అని బి.జె.పి. గుర్తించింది. బాబ్రీ మసీదు అంశం ఓటర్లను ప్రభావితం చేయటం లేదు. కాబట్టి హిందూత్వ సంస్థలు వివిధ మతాలకు చెందిన యువతీ యువకుల మధ్య సంబంధాలను సమస్యాత్మకంగా చేసి తీవ్రంగా ప్రచారం చేశాయి. పశ్చిమ ఉత్తర ప్రదేశ్‌లో జాట్‌లు అధికంగా వున్న ప్రాంతంలో,మహిళ గౌరవాన్ని సున్నితంగా భావించే ఖాప్ పంచాయతీలు బలంగా ఉన్నచోట ఈ ప్రచారాన్ని తీవ్రం చేశారు. అక్కడ అంతకు ముందు జాట్‌లు, ముస్లింల మధ్య సత్సంబంధాలుండేవి. 1857 తిరుగుబాటు కాలం నుండి ఉభయులూ స్వాతంత్ర్యం కోసం భుజం భుజం కలిపి పోరాడారు. వాస్తవంగా ముజఫర్ నగర్‌లో నివసించే మూలే జాట్‌లు హిందూ మతంలోకి కొత్తగా మారారు. మహేంద్రసింగ్ తికాయత్‌కు చెందిన భారతీయ కిసాన్ యూనియన్‌కు జాట్‌లు, ముస్లింలు వెన్నుముకగా ఉన్నారు. రాజకీయంగా మొదట చరణ్‌సింగ్‌నూ, తర్వాత అజిత్‌సింగ్‌నూ బలపర్చారు. స్థిరంగా రెండు సంవత్సరాలపాటు నిరంతరంగా కొనసాగించిన ‘లవ్ జిహాద్’ ప్రచారం ప్రజలను మతపరంగా చీల్చింది. 16వ లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో యు.పి.లో బి.జె.పి. గెలుపు సార్వత్రిక ఎన్నికలలో బి.జె.పి. విజయానికి కీలకంగా మారింది. ఓటర్లను సమీకరించటానికి తీవ్రంగా ప్రచారం ప్రారంభించారు. అన్ని అంశాల్నీ ప్రయోగించారు. హోఅన్నిటికన్నా ముస్లిం వ్యతిరేక భావాలు, ముస్లిం యువకులు, హిందూ యువతులు కలిసి తిరగటం, వారి మతంతో నిమిత్తం లేకుండా అన్ని మతాల కులాల యువకులు, అన్ని మతాల కులాల యువతుల్ని వేధిస్తున్నప్పటికీ ముస్లిం యువకులు హిందూ యువతుల్ని వేధిస్తున్నారని చేసిన ప్రచారం వారికి ఎక్కువ ఫలితాన్నిచ్చింది.

ముజఫర్ నగర్ జిల్లా ఉత్తరప్రదేశ్‌లో బాగా అభివృద్ధి చెందిన జిల్లాల్లో ఒకటి. అనేక జిల్లాలు, పట్టణాలతో పోల్చుకుంటే పంచదార, ఉక్కు పేపరులాంటి ప్రధాన పరిశ్రమల్లో పారిశ్రామికాభివృద్ధిరేటు ఎక్కువగా వుంది. అభివృద్ధితోపాటు విద్యారంగం కూడా అభివృద్ధి చెందింది. యువతీ యువకుల్లో విద్య విస్తృతం కావటంతో లింగం, మతం, కులంతో సంబంధం లేకుండా కలిసిపోతున్నారు. పాత సంస్కృతి, సాంప్రదాయాలు, ముఖ్యంగా కులం లోపల పెద్దలు కుదిర్చే పెళ్ళిళ్ళనూ, నూతన సామాజికీకరణతో పాత కుల, మత కట్టుబాట్లనూ తెగతెంపులు చేసుకునే పరిస్థితుల్లో సాంప్రదాయక పద్ధతి అమలు జరపటం కష్టమైపోయింది. వివిధ కులాలకు చెందిన ఖాప్ పంచాయతీలు ఆంక్షలు విధించటానికీ, ముఖ్యంగా యువతులపై ఆంక్షలు విధించటానికి ఘర్షణ పడుతున్నాయి. ఇలాంటి స్థితిలో లవ్ జిహాద్ ప్రచారం జాట్ పెద్దలకు వరంలా లభించింది. భూస్వామ్య పద్ధతుల్నీ, మహిళల గౌరవాన్ని రాజకీయంగా ఉపయోగించుకున్నారు. నిరంతర ప్రచారం ముస్లిం వ్యతిరేక భావాలు పెరగటానికీ, అంతిమంగా 2013 సెప్టెంబర్‌లో జాట్–ముస్లిం ఘర్షణలు జరగటానికీ దారితీసి మతపరమైన సమీకరణలను మరింత పెంచింది. ముజఫర్‌నగర్ ఘర్షణల ఫలితంగా ప్రజలు మతపరంగా విడిపోయారు. దీన్నుండి బి.జె.పి. అత్యధికంగా ఎన్నికల ప్రయోజనం పొందింది.

**హిందూ జాతీయవాద సంస్థల కులం, లింగం, లవ్ జిహాద్ ప్రచారం...**

హిందూత్వ సంస్థలు ప్రచారం చేస్తున్న ‘లవ్ జిహాద్’, ముస్లిం యువకులు హిందూ యువతులను బలవంతంగా తీసుకెళుతున్నారనీ, మానభగంగాలు చేస్తున్నారనీ ముస్లిం పురుషులు హిందూ మహిళలతో శారీరక సంబంధాలు పెట్టుకొంటున్నారనీ ప్రచారం చేస్తున్న వీరు వీటిని నిరోధించటానికి మాత్రమే పరిమితం కాలేదు. ఇది రెండు మతాల మధ్య, వివిధ కులాల మధ్య రక్తసంబంధం ఏర్పడకుండా నివారించటానికి కూడా ఉద్దేశించినది. కుల వ్యవస్థ అనేది జన్మతః వచ్చిన కులాధిక్యతను కొనసాగించటానికిగాను కులాల మధ్య వివాహాలను నిషేధించింది. బాబా సాహెబ్ అంబేద్కర్ **‘క్యాస్ట్ ఇన్ ఇండియా’** అనే వ్యాసంలో కులాల మధ్య వివాహాల్ని నిషేధించటం, కులంలోనే వివాహాలు జరగటం కులం యొక్క సారాంశం అని రాశాడు. ఇంకా ఇలా రాశాడు: “భారతదేశంలో కులం అంటే అర్థం ప్రజల్ని నిర్దిష్ట విభాగాలుగా విభజించి, ప్రతి ఒక్కరూ బయటి విభాగంలో పెళ్ళి ద్వారా కలపటాన్ని నిషేధించింది. కాట్టి కులానికి పునాది అన్నది కులం లోపలనే వివాహం చేసుకొనే పద్ధతిలో ఉంది అనే నిర్ణయానికి రావటం అనివార్యమౌతున్నది”. మహిళలను అణచివేయకుండా కులం ప్రాతిపదికనున్న ఆధిపత్య వ్యవస్థ నిలబడజాలదు.

లవ్ జిహాద్ వ్యతిరేక ప్రచారం శత్రుమతంలోని వారి దుష్ట ఆలోచనలకు వ్యతిరేకంగా అని చెబుతున్నప్పటికీ, అదే సమయంలో కుటుంబంలోనూ, మతపరంగానూ హిందూ మహిళలపై పురుషుల ఆధిపత్యం పెరగటానికి దారితీస్తోంది. కులంలో వివాహపద్ధతి, గోత్రేతరులతో వివాహం చేసుకొనే పద్ధతిలో వారు ఎవరిని వివాహం చేసుకోవాలి, కుటుంబాల ఆర్థిక పరిస్థితులేమిటి, వరకట్నం ఎంత ఇస్తారు అన్న విషయాలను కుటుంబం, కులం నిర్ణయిస్తుంది. ఈ సూత్రాన్ని ఖాప్ పంచాయతీలు అమలు చేస్తూ, ఆంక్షల్ని అతిక్రమించినవారికి తీవ్ర శిక్షలు విధిస్తాయి. వీటిలో మహిళలపై లైంగికంగా అత్యాచారాలు చేస్తున్నారు. హత్యలు చేసి వాటిని పరువు హత్యలుగా ప్రచారం చేస్తున్నారు. ప్రక్కన మగ బంధువులు లేకుంటే యువతులు పొద్దుగుంకిన తర్వాత ప్రయాణాలు చేయకూడదనీ, సెల్‌ఫోన్లు తీసుకెళ్ళరాదనీ, ఇంటర్‌నెట్ వినియోగించకూడదనీ ఆంక్షలు విధిస్తున్నారు. ఏవిధమైన బట్టలు ధరించాలో, ఏ ప్రదేశాలకు వెళ్ళాలో ఖాప్ పంచాయతీలు నిర్ణయిస్తున్నాయి. ముస్లిం మతం, ఖాప్ పంచాయతీలు మహిళలపై ఒకే విధమైన ఆంక్షలు విధిస్తున్నాయి. ‘లవ్ జిహాద్’ వ్యతిరేక ప్రచారం కుమార్తెలున్న కుటుంబంలో పురుషపెద్దల

మద్దతు వెంటనే పొందుతున్నది. ఇది విద్య, జీవనావసరాల సంపాదన, కుటుంబ ఆస్తులు పొందటం, స్వేచ్ఛ, ఇతర అంశాలలో మహిళలను అదుపు చేయటానికి పరోక్షంగా పురుషులకు ఉపయోగపడుతున్నది.

హిందూత్వ సంస్థల లవ్ జిహాద్ ప్రచారం శత్రు మతంలో వారిని మాత్రమేకాక, అతిశయోక్తులు, ఊహాజనిత సంఘటనల ప్రచారంతో హిందూ మతంలోని స్త్రీలను కూడా లక్ష్యంగా పెట్టుకొంటున్నాయి. 2006 నుండి కేరళలో 25,000 మంది ముస్లిం యువకులు హిందూ యువతుల్ని పెళ్ళి చేసుకున్నారనిఏమాత్రం ఆధారాలు లేకుండానే ప్రచారం చేస్తున్నారు. సోషల్ మీడియా, వార్తా పత్రికల్లో ఈ అతిశయోక్తులు, హింసను గురించి ప్రసారం చేస్తూ వాటిని నిజమని నమ్మిస్తున్నారు. ఇది హిందూ మహిళలు తమ మతంలోని పురుషులను రక్షకులుగా భావించటానికీ, వారి ఆదేశాలను పాటించటానికీ దారితీస్తున్నది. ముస్లిం మహిళలను ఏవిధంగా అయితే వారి పురుషుల అణచివేత, పీడన నుండి రక్షించాలో అదేవిధంగా హిందూ మహిళలను కూడా వారి పురుషుల అణచివేత, పీడననుండి రక్షించాల్సి వుంది. బాలికలను గర్భంలోనే హత్య చేయటం, వరకట్న మరణాలు, కుటుంబంలోనూ, దగ్గరి బంధువుల వలన లైంగిక అత్యాచారాలు, వేధింపులు, ఒత్తిడిగా ఉండే ప్రాంతాల్లో వారిని తాకటం, ఇబ్బంది పెట్టటం వారసత్వాన్ని తిరస్కరించటం, అన్నిరంగాలలో వివక్ష, గృహహింస మొదలైనవి మహిళలపై పీడనకు కొన్ని ఉదాహరణలు మాత్రమే. హిందూత్వ సంస్థలు ఆ మతంలోని పురుషుల నుండి మహిళలకు న్యాయం చేయటానికీ, రక్షణ కల్పించటానికీ పూనుకున్న పరిస్థితి లేదు.

> **❝ హిందూత్వ సంస్థల లవ్ జిహాద్ ప్రచారం హిందూ మతంలోని స్త్రీలను కూడా లక్ష్యంగా పెట్టుకొంటున్నాయి. 2006 నుండి కేరళలో 25,000 మంది ముస్లిం యువకులు హిందూ యువతుల్ని పెళ్ళి చేసుకున్నారని ఏమాత్రం ఆధారాలు లేకుండానే సోషల్ మీడియా ద్వారా ప్రచారం చేస్తున్నారు. నిజమని నమ్మిస్తున్నారు. ఇది హిందూ మహిళలు తమ మతంలోని పురుషులను రక్షకులుగా భావించటానికీ, వారి ఆదేశాలను పాటించటానికీ దారితీస్తున్నది. ❞**

### మతాంతర వివాహాలు భారత ప్రజాస్వామ్యం

యువతీ యువకులు ఒకరిపట్ల ఒకరు ఆకర్షితులు కావటం, స్నేహం చెయ్యటం, వారి జీవిత భాగస్వాముల్ని ఎంపిక చేసుకోవటం సరైంది కాదనీ, ఇందులో పైశాచికత్వం ఉందనీ హిందూత్వ సంస్థలు ప్రచారం చేస్తున్నాయి. మోడీ నిర్మిస్తానని చెబుతున్న 100 స్మార్ట్ సిటీలలో కూడా హిందూత్వ శక్తులు ఇలాంటి విధినిషేధాలే పెడతాయా? వివిధ మతాలు కలిసి నివసిస్తుంటే, పరస్పర సంబంధాలలోకి రావటం, యువతీ యువకులు ఒకరిపట్ల ఒకరు ఆకర్షితులు కావటం సహజం. వివిధ మతాల అనుయాయులూ, సాంస్కృతిక సాంప్రదాయాలను అనుసరించేవారూ కలిసినప్పుడు ఒకరికొకరు బాగా అర్థం చేసుకుంటారు. ఒకరినుండి మరొకరు మంచి విషయాలు నేర్చుకుంటారు. పరస్పరం కలవటం సంస్కృతులను సంపద్వంతం చేయటమేకాక, ఆసక్తికరమైన సాంస్కృతిక వైవిధ్యాన్ని సృష్టిస్తుంది. ఇరుగుపొరుగు ప్రాంతాలయినా, మార్కెట్లు, విద్యాసంస్థలు, విశ్రాంతి కేంద్రాలు, పని ప్రదేశాలు, ప్రజా రవాణా సాధనాలు, ఉమ్మడి పోరాటాలయినా, జీవనస్థాయిని పెంచటానికీ, మంచి పరిసరాలు అభివృద్ధి కావటానికీ అవకాశం కల్పిస్తాయి. అటువంటి ప్రాంతాల్లో మతపరంగా, లింగపరంగా, ప్రజల్ని వేరు చేయటాన్ని పూర్తిగా అసాధ్యం కాకపోయినా కష్టం అవుతుంది. యువతరం పాతతరాల దురభిమానాల్నీ, పరిమితుల్నీ పక్కనపెట్టి తమ సొంత దృక్పథంతో ప్రపంచాన్ని కొత్తగా అన్వేషిస్తారు.

భారత రాజ్యాంగం నిర్దేశిత చట్టపరిధిలో పౌరులకు బోధించడానికీ, తమకిష్టమైన మతాన్ని అనుసరించటానికీ, ప్రచారం చేయటానికీ హక్కులిచ్చింది. మతపెద్దలు ఈ హక్కులన్నీ ఆయా మతాల ఉన్నతవర్గాల చేతిలో ఉండాలని కోరుకుంటున్నారు. ఆ మతాలను అనుసరించే ప్రజల వ్యక్తిగత స్వేచ్ఛను కుదించేందుకు ఆదేశాలిస్తున్నారు. ఒకేవిధమైన సంస్కృతిని రుద్దే ప్రయత్నం చేస్తున్నారు. ప్రజాస్వామ్యంలో వ్యక్తులకున్న హక్కులను హరించే విధంగా ఖాప్ పంచాయతీలు, మతశక్తులు వ్యవహరిస్తున్నాయి.

భారత ప్రజలు వలసపాలన నుండి బయటపడుతూ తమకు సామాజిక న్యాయం, వైవిధ్యం, భిన్నత్వం ఉన్న ప్రజాస్వామిక రాజ్యాంగాన్ని ఏర్పాటు చేసుకున్నారు. ఖాప్ పంచాయతీలు, మతశక్తుల దృక్పధానికి భిన్నంగా రాజ్యాంగం వ్యక్తులు తమ జీవితాల్ని తమ కిష్టమైన విధంగా తీర్చి దిద్దుకోవటానికీ, తమ జీవిత భాగస్వాముల్ని ఎంపిక చేసుకోవటానికీ అవకాశం కల్పించింది. దానికోసమే 1954లో ప్రత్యేక వివాహ చట్టాన్ని (స్పెషల్ మ్యారేజ్ యాక్ట్) ఆమోదించారు. వేర్వేరు మతాలు, కులాలు, భాషకు, ప్రాంతాలకు చెందిన ఇద్దరు వ్యక్తులు ఏ మత ప్రాతిపదికనగానీ, లేదా సాంప్రదాయక పద్ధతిలోగానీ పెళ్ళి చేసుకోకుండానే పరస్పరం జీవిత భాగస్వాములుగా అంగీకరించటం ద్వారా భార్యాభర్తలు కావొచ్చు. ఇతర కుల, మత పెద్దల మాదిరిగానే హిందూత్వ శక్తులు కూడా వ్యక్తుల హక్కులపై దాడి చేయటం, హరించటం కోసం, సంస్థల్ని, కొన్ని సంఘాలను, కొన్ని నిర్మాణాలను ఏర్పరచి, తల్లిదండ్రుల కోరికల్ని పిల్లలపై రుద్దే విధంగా విధానాల్ని రూపొందిస్తున్నారు. జీవిత భాగస్వాముల్ని ఎంచుకునే హక్కుపై రెవెన్యూ అధికారులు దాడిచేసే విధంగా గుజరాత్ మోడల్‌ను రూపొందించారు. ఉదారంగా అవకాశాలు కల్పిస్తే భారతదేశం భిన్నత్వంతో కూడిన బలమైన ప్రజాస్వామిక దేశంగా రూపుదిద్దుకుంటుంది.

ఈ లక్ష్యాన్ని సాధించటానికి విద్యార్థులు ప్రపంచాన్ని విమర్శనాత్మకంగా పరిశీలించటానికి ప్రోత్సహించే బలమైన విద్యాసంస్థలను నిర్మించాలి. విద్యా కార్యక్రమాలు స్కూళ్ళు, కాలేజీలకే పరిమితం కాకుండా, ఫ్యూడల్ ఆధిపత్య తరగతులు కుల, మత ఆధిక్యతని ప్రదర్శించే చోట్లకు తీసుకెళ్ళాలి. విద్య, విజ్ఞానాలు ప్రపంచాన్ని మార్చటానికి పోరాటాలు జరిగే చోట నుండి వస్తాయి. అణచబడిన వారిని శక్తివంతుల్ని చేస్తాయి. ప్రజాస్వామ్యం వైపు నడిచే, అణచబడ్డ వారిని శక్తివంతుల్ని చేసే భారతదేశం కావాలా? లేక ఫ్యూడల్ ఆధిపత్య వర్గాలు నిరంతరం తమ ఆధిపత్యం కోసం ప్రయత్నాలు చేస్తూ, విభేదాలు సృష్టిస్తూ, ఇతరులను శత్రువులుగా ముద్రవేస్తూ పోయే భారతదేశం కావాలా? అని మనం యువతరాన్ని ప్రశ్నించాలి. ఆశలతో ఉన్నతరం నిస్సందేహంగా మొదటి మార్గాన్నే ఎంచుకుంటారని భావిస్తున్నాను.

**(అనువాదం: ఎ. కోటిరెడ్డి)**

**పార్టీ నిర్మాణం**

# కమ్యూనిస్టు పార్టీలో ఆంతరంగిక ప్రజాస్వామ్యం



రచయిత భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) కేంద్ర కమిటీ సభ్యులు

**ఎస్. వీరయ్య**

కమ్యూనిస్టు పార్టీలో నిర్ణయాలన్నీ కేంద్ర నాయకులే చేస్తారన్న ప్రచారం ఉన్నది. నిజమా? పార్టీ పునాది ఎందుకు బలహీనపడిందని సభ్యులు, కొందరు కార్యకర్తలు కూడా ప్రశ్నిస్తారు. కారణమేమిటి? మహాసభల సందర్భంగా ఇలాంటి ప్రశ్నలు అనేకం వస్తుంటాయి.

దేశంలో పార్టీ మహాసభల ప్రక్రియ ప్రారంభమైంది. శాఖస్థాయి నుండి అఖిలభారత స్థాయి వరకు జరిగే మహాసభల్లో అనేక విషయాలు చర్చిస్తాం. ముఖ్యంగా గత మహాసభ అనంతర కాలంలో రాజకీయ విధానాన్ని అమలు జరిపేందుకు చేసిన కృషిని, ఫలితాలను సమీక్షిస్తాం. అంతర్గత ప్రజాస్వామ్యానికి ప్రతిరూపం కమ్యూనిస్టు పార్టీ. బూర్జువా పార్టీలు రోజూ ప్రజాస్వామ్యం గురించి మాట్లాడుతుంటాయి. కానీ ఆ పార్టీలలో ప్రజాస్వామ్యం కనిపించదు. పార్టీ అధ్యక్షులు చేసిందే నిర్ణయం. కాంగ్రెస్ పార్టీ నుండి మొదలుకుంటే ప్రాంతీయ పార్టీల వరకు ఇదే తంతు. బిజెపి భిన్నమైన పార్టీ అని చెప్పుకుంటుంది. కానీ అక్కడ ఆర్ఎస్ఎస్ చెప్పిందే వేదం. పార్టీలో ఆంతరంగిక ప్రజాస్వామ్యం మాత్రం శూన్యం. బూర్జువా పార్టీలలో అంతర్గత ప్రజాస్వామ్యం ఉండదు కాబట్టే వ్యక్తిగత ప్రయోజనాల కోసం ముఠాతగాదాలు, బహిరంగ చర్చలు, వాదోపవాదాలు సర్వసాధారణం. ఈ అరాచకాన్ని ప్రజాస్వామ్యంగా వారు సమర్థించుకుంటారు. కమ్యూనిస్టు పార్టీ ఇందుకు భిన్నమైంది. పార్టీ విధానాన్ని రూపొందించే ముందు పార్టీ శ్రేణులలో విస్తృతంగా చర్చకు పెడతారు. క్రింది నుండి వచ్చిన సూచనలను పరిగణనలోకి తీసుకుంటారు. అంతిమ నిర్ణయం అఖిలభారత మహాసభ చేస్తుంది. రోజువారీ నిర్ణయాలు కూడా ఆయా స్థాయిలలో శాఖలూ, కమిటీలూ చర్చించి తీసుకుంటాయి. ఆయాసమావేశాల్లో అందరికీ స్వేచ్ఛగా అభిప్రాయాలు చెప్పే హక్కు ఉంటుంది. ఏకాభిప్రాయం రానప్పుడు మెజారిటీ నిర్ణయానికి కట్టుబడతారు. అవసరమైతే పై కమిటీ సహాయం తీసుకుంటారు. ఇదీ కమ్యూనిస్టు పార్టీలో అంతర్గత ప్రజాస్వామ్యం.

పై నుండి కింది వరకు కమ్యూనిస్టు పార్టీలో అందరిదీ ఒకేమాట ఒకేబాట. ఈ క్రమశిక్షణ పాలకవర్గాలకు గిట్టదు. అందుకే ప్రజాస్వామ్యం లేదని బురదజల్లుతారు. కమ్యూనిస్టులు ప్రత్యామ్నాయంగా ప్రజలకు కనిపించకూడదన్నది వారి ఉద్దేశం. కమ్యూనిస్టు పార్టీ బలపడకూడదని కోరుకుంటారు. అందుకే పార్టీ క్రమశిక్షణకు నియంతృత్వమనే ముద్రవేసి గందరగోళ పరుస్తారు. కమ్యూనిస్టు పార్టీలో క్రమశిక్షణా సూత్రాలు కూడా మార్పుకు అవకాశం లేని శాశ్వత సూత్రాలు కాదు. కమిటీ ఎన్నిక ప్రక్రియ, కార్యదర్శి ఎన్నిక తీరు, కంట్రోల్ కమీషన్‌పాత్ర, ఆరోపణలపై విచారణ తీరు తదితర అనేక విషయాలలో అనుభవాల ఆధారంగా అనేక మార్పులు ఇప్పటికే చేసుకున్నాం. భవిష్యత్తులో కూడా ఈ సూత్రాలను అంతర్గత ప్రజాస్వామ్యాన్ని మరింత పరిపుష్టం చేసుకోవచ్చు. మౌలికంగా కమ్యూనిస్టు పార్టీకి ఇతర పార్టీలకు మధ్య ఉన్న ఈ స్పష్టమైన తేడా గమనించాలి.

పార్టీలో విస్తృత చర్చ అనంతరం విధాన నిర్ణయం జరుగుతుంది. ఆ విధానం వెలుగులోనే కేంద్ర, రాష్ట్రస్థాయిల్లో కమిటీలు సందర్భానుసారం ఎన్నికల ఎత్తుగడలు నిర్ణయిస్తాయి. ఈ నిర్ణయాలు పార్టీ యావత్తుకు శిరోధార్యం. వ్యక్తిగత యిష్టాయిష్టాలతో నిమిత్తం లేకుండా ఈ నిర్ణయాలను అమలు జరపాలి. ఆయా నిర్ణయాలలో తప్పొప్పులు తేలాలంటే కూడా అమలు జరపడం ద్వారానే సాధ్యం.

శాఖాస్థాయి మహాసభల నుండే పార్టీ రాజకీయ విధానాన్ని సమీక్షించే ప్రక్రియ ప్రారంభమవుతుంది. శాఖ పరిధిలో పార్టీ విధానాన్ని ఊగిసలాటలు లేకుండా అమలు జరిపామా? లేక అరకొరగా అమలు జరిపామా? పరిశీలించాలి. ఫలితాలు బేరీజు వేయాలి. ఫలితాలంటే ఏమిటన్న విషయంలో కూడా స్పష్టత ఉండాలి. ప్రతిష్ట పెరగడమా? లేక పునాది బలపడటమా? అనేక సందర్భాలలో ప్రతిష్ట పెరగడాన్నే ఫలితంగా చూస్తున్నాం. అంతటితో సంతృప్తి చెందుతున్నాం. కానీ కమ్యూనిస్టు పార్టీ సాధించవలసిన ఫలితాల్లో ప్రతిష్ట తొలిమెట్టు మాత్రమే. అసలు ఫలితం పునాది బలపడటమే. పార్టీ పునాది అంటే కూడా స్పష్టత అవసరం. పార్టీ విధానానికి మద్దతుగా ప్రజా సమీకరణ శక్తి, ఎన్నికలలో సంపాదించే ఓట్లు, ప్రజా సంఘాల సభ్యత్వం, పార్టీ సభ్యత్వం, పత్రికల సర్క్యులేషన్ పెంపుదల, శ్రామిక ప్రజల నుండి నిధి వసూళ్ళ పెరుగుదల తదితర అంశాలన్నీ కలిపితేనే పార్టీపునాది అవుతుంది. పార్టీ ప్రతిష్ట మాత్రమే పెరిగితే సరిపోదు. పార్టీ సొంత బలం పెరగాలి. మహాసభల సమీక్ష దీని ప్రాతిపదిక మీదనే జరగాలి. ఈ సమీక్ష ఆధారంగా అనుభవాలు, గుణపాఠాలు తీయాలి. అన్ని స్థాయిల్లోనూ ఈ ప్రక్రియ జరిగినప్పుడే గతంలో నిర్ణయించుకున్న పార్టీ విధానం సరైందా కాదా తేలుతుంది. ఈ ప్రక్రియ మొత్తం కమ్యూనిస్టు పార్టీకే సొంతం. బూర్జువా పార్టీలలో ఇది భూతద్దం పెట్టి వెతికినా కనిపించదు. అయితే ఈ ప్రక్రియను అన్నిశాఖల్లోనూ, అన్ని స్థాయిల్లోనూ

(మిగతా 34వ పేజీలో)

గ్రంథ పరిచయం

# లెనిన్‌పేరిట లెనినిజంపై దాడి!

## అంతిమ పోరాటం అసలు స్వరూపం


పరిచయకర్త భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) రాష్ట్ర కమిటీ సభ్యులు

**తెలకపల్లి రవి**

కొత్తసీసాలో పాతసారా అన్నట్టు అరిగిపోయిన రికార్డులాంటి పాత కథలనే మళ్లీ మళ్లీ వినిపించడం రాజకీయ సైద్ధాంతిక రంగాల్లో పరిపాటి. తద్వారా ప్రత్యర్థులను ఇరకాటంలో పెట్టడమే గాక ప్రజలను గందరగోళ పరచవచ్చునన్నది వ్యూహం. అందులోనూ వ్యవస్థాపకులకూ, మూల విరాట్టులకూ ఒక నమస్కార బాణం పడేస్తే ఆ తర్వాత వారి అనుయాయులపైన ఎంతయినా దాడి చేయొచ్చునీ, అమాయకులకు ఎన్ని కథలైనా చెప్పొచ్చునీ ఇలాటి వ్యూహాలను అమలు చేసేవారు అనుకుంటారు. మోషే లెవిన్ రాసిన దాదాపు అరవై ఏళ్లనాటి పుస్తకాన్ని 'లెనిన్ అంతిమ పోరాటం' పేరిట పునర్ముద్రించిన వారి వైఖరి ఇంతకంటే భిన్నమేమీ కాదు. ఆ ప్రచురించడంతో ఆగక అందుకు తమ పైత్యం కూడా జోడించేందుకు ముప్పై అయిదు పేజీల పైన ఉపోద్ఘాతం బనాయించారు.

**పుస్తకం నేపథ్యం..విషయం..**

1968లో రాసిన ఈ పుస్తకంలో విషయాలేవీ కొత్తవి కావు. ఇన్నేళ్ల తర్వాత పునర్ముద్రించాల్సినంత ప్రాధాన్యత గలిగినవీ కాదు. తెలుగులో వామపక్ష అభిమానులు లెనిన్ పేరు చూసి ఆకర్షితులు కావడం వల్ల కొంతవరకూ అమ్మకాలు కూడా జరిగాయి. ఇటీవలనే దీనిపై చర్చా గోష్టులు కూడా నిర్వహిస్తున్నారు.

ఈ పుస్తకం విషయం క్లుప్తంగా చెప్పాలంటే – స్టాలిన్ ఏకపక్ష పోకడలూ, ఏకవ్యక్తి ఆధిపత్యం లెనిన్‌కు నచ్చలేదు. అయితే అప్పటికే అనారోగ్యం కారణంగా ఆయన నిస్సహాయుడైపోయాడు. అయినా స్టాలిన్‌ను తొలగించాలనీ, కనీసం ఆయన చర్యలను అడ్డుకోవాలని ఆఖరు రోజుల్లో విపరీతంగా పెనుగులాడాడు. ఇందుకోసం ఒకప్పుడు తనను వ్యతిరేకించిన ట్రాట్స్కీతో కూడా చేతులు కలిపాడు. తన అనారోగ్య సమయంలో భార్య కృపస్కయాను స్టాలిన్ కటువుగా మందలించడం లెనిన్‌ను ఎంతగానో కలచి వేసింది. స్టాలిన్‌ను ప్రధాన కార్యదర్శి పదవి నుంచి తొలగించాలనీ, ఆయన ప్రవేశ పెట్టిన విధానాలను మార్చాలనీ లేఖలేగాక ఒక వీలునామా కూడా రాసి పంపించాడు. ఇదీ లెవిన్ రచన సారాంశం.

**మూలానికే ఎసరు!**

ముందు ఉపోద్ఘాతం పరిశీలిస్తే ప్రచురణ కర్తల భావాలేమిటో తెలుస్తాయి.

"19వ శతాబ్దిలోని విభిన్న కార్మికవర్గ సోషలిస్టు సిద్ధాంతాల భావ ఘర్షణలో మార్క్స్ ఆలోచనా విధానం అగ్రశ్రేణిలో నిలిచింది. సిండికలిజం, అనార్కిజం కొనసాగినప్పటికీ సోషలిజం దిశగా ప్రపంచాన్ని అత్యధికంగా ప్రభావితం చేసింది మార్క్సిజమే. అదే విధంగా ఈ సైద్ధాంతిక ప్రాతిపదికన సాగిన కార్మిక వర్గ విప్లవోద్యమాలలో 1917 రష్యన్ అక్టోబరు విప్లవం తక్షణ లక్ష్యమైన రాజ్యాధికారాన్ని సాధించింది..ఈ విప్లవానికి నాయకత్వం వహించిన లెనిన్ బొల్షివిక్ పార్టీ సిద్ధాంతాన్నీ, ఆచరణనూ విప్లవాత్మక మార్క్సిజంగా పరిగణించారు...లెనిన్ ఆలోచనల సారమే బొల్షివిజం కాబట్టి లెనిన్ విప్లవ సిద్ధాంత వేత్తగా ప్రపంచంలో గణుతికెక్కాడు. లెనిన్‌ను పరిపూర్ణ విప్లవ నాయకుడుగా పరిగణించే ధోరణి బలపడింది..

"లెనిన్‌ను ఒక ప్రశ్నించరాని ప్రతీకగా పరిగణించడం లెనిన్ మరణానంతరం జరిగింది. అందులో భాగంగానే లెనినిజానికి రూపకల్పన జరిగింది.... స్టాలిన్ విధానాలకు మద్దతుగా అది అవసరమైంది.. ఇప్పటికైనా దీనిని నిర్ద్వంద్వంగా తిరస్కరించవలసిన అవసరాన్ని అందరూ గుర్తించాలని మేము అభిప్రాయపడుతున్నాము.. లెనినిజాన్ని మార్క్సిజానికి జోడించి మార్క్సిజం– లెనినిజాన్ని కమ్యూనిస్టు పార్టీల సిద్ధాంతంగా ప్రతిపాదించబడింది. ఈ మేరకు సామ్రాజ్యవాద యుగపు మార్క్సిజంగా లెనినిజాన్ని నిర్వచించారు. బహుశా లెనిన్ దీన్ని ఖచ్చితంగా వ్యతిరేకించి వుండేవాడు...

**మార్క్సిజం జీవ రహితం**

" ....లెనిన్ ద్వారా మాత్రమే మార్క్స్‌ను చూడటం దీని సారాంశం..

"దీంతో కమ్యూనిస్టు పార్టీలలో మార్క్స్ పట్ల స్వతంత్ర అధ్యయనం దెబ్బతింది.

"మార్క్సిజానికి మిగతా మార్క్సిస్టు మేధావుల అనుదానాల్ని విస్మరించారు.

"ఇతర ఆలోచనా రీతులలోని శాస్త్రీయ భౌతిక వాద అంశాలను కలుపుకునే పద్ధతి కూడా లేకుండా పోయింది.

"మార్క్సిజం జీవ రహితంగా మారింది.

"మార్క్స్ మూల స్ఫూర్తి మరుగున పడింది.

"కాబట్టి 20 వ శతాబ్దపు సోషలిజం వైఫల్యం మార్క్సిజానికి చెందదు. లెనినిజానికి చెందుతుంది.

మార్క్సిజం–లెనినిజం గానీ, మార్క్సిజం–లెనినిజం–మావో ఆలోచనా విధానం గానీ హేతుబద్ధమైన ఆలోచనా రూపాలు కావు. (ఉపోద్ఘాతంలో 12,13 పేజీలలో భాగాలు, వాక్యాలు ఇవి. స్థలాభావం కొద్ది కుదింపు అవసరమైంది. అతికించడం జరగలేదు. దేనికదే సంపూర్ణమైన అర్థం ఇస్తాయి)

అనేక సిద్ధాంతాలలో మార్క్సిజం ఒకటనడం ద్వారా మూలానికే ఎసరు పెట్టారు.

> **"ఈ పుస్తక ప్రచురణకర్తలు మార్క్స్‌తో మొదలుపెట్టి లెనిన్‌ను బోల్షివిక్‌పార్టీనీ అసలు రష్యన్ విప్లవాన్ని కూడా పొర బాటుగా తేల్చేశారనేది స్పష్టం. కమ్యూనిస్టు పార్టీలో ముఠాలను రద్దు చేయడం పొరబాటట. సోవియట్ యూనియన్ 1930-60 మధ్య కాలంలో అద్భుతమైన ఫలితాలు సాధించి నప్పటికీ విప్లవంనాటి ఉత్పాదక స్థాయికంటే అనేక రెట్లు అభివృద్ధి సాధించినప్పటికీ పెట్టుబడిదారీ దేశాల ఉత్పాదక స్థాయిని అధిగ మించడం మొత్తం మీద సాధించలేకపోయిందన్నారు."**

లెనినిజం అన్నది స్టాలిన్ సృష్టి అని తర్కం కోసం చెప్పినా నిజానికి వారి దాడి లెనిన్‌పైనా, లెని నిజంపైనా. ఆ పైన మరింత స్పష్టంగా లెనినిజాన్ని తోసిపుచ్చిన ఈ ప్రచురణ కర్తలు లెనిన్ తరపున స్టాలిన్‌పై దాడి చేస్తున్నట్టు చిత్రించుకోవడానికి ప్రయత్నించారు. ప్రపంచపు రూపు రేఖలు మార్చిన 20 వ శతాబ్ది సోషలిజం ఘనతను గుర్తించకుండా అది విఫలమైందని తీర్పు నిచ్చేసి దాన్ని లెనిన్ ఖాతాలో వేశారు.

**లెనినిజంపై దండకం**

తర్వాతి భాగంలో లెనినిజం లోపాలను తమ ధోరణిలో ఏకరువు పెట్టారు:

– విప్లవ గతితర్కమే మార్క్సిజం సారాంశం అని పేర్కొనడం ద్వారా విప్లవాత్మక మార్క్సిజాన్ని తన కార్యాచరణకు ఆలంబనగా లెనిన్ చేసుకున్నాడు. ఈ అవగాహనలో మార్క్స్ ప్రతిపాదించిన సమాజ సూత్రాలకు భిన్నమైన ఇచ్ఛావాద ధోరణి కొంత వరకూ ఇమిడి వుంది... ఈ విప్లవానికి సోషలిస్టు విప్లవ లక్ష్యాలు నెరవేర్చగల భౌతిక పునాది ఏర్పడలేదు'

– పెట్టుబడిదారీ వ్యవస్థలో రాజకీయ స్వేచ్ఛలను అనుభవించడానికి కార్మిక వర్గానికి గల అవకాశాలు బహుపరిమితమని విమర్శ చేసిన శక్తులు చట్టబద్ధ హక్కుల చారిత్రిక ప్రగతిశీలతను చూడలేకపోయాయి. లెనిన్‌లో కూడా ఈ పరిమితి వుంది. ఈ అంశాలన్నిటి ఫలితంగా బొల్షివిక్ పార్టీ పాలన నిరంకుశ వ్యవస్థగా పరిణమించింది... సోవియట్ సోషలిజం అంతిమంగా సోషలిజం ఎలా వుండాలి అనే దానికి గాక ఎలా వుండకూడదు అనే దానికి ప్రతీకగా మారింది' (15,16 పేజీలు)

వీటితో పాటే ఇంకా కింది అంశాల్లో లెనినిజం పొరబడిందని వారి భావన.

– కార్మికవర్గానికి చైతన్యాన్ని బయిటనుంచి అందించాలనే భావన.

– అగ్రగామి పార్టీ, పార్టీకి కేంద్ర బిందువుగా వృత్తి విప్లవకారుల బృందం, పార్టీ నిర్వహణలో కేంద్రీకృత ప్రజాస్వామ్యం... ఈ మూడు భావనల సంశ్లేషణ.

–శ్రామికవర్గ నియంతృత్వాన్ని సోషలిస్టు రాజ్యరూపంగా నిర్ద్వంద్వంగా పరిగణించడం.

**కనిపించని విజయాలు**

ఇవన్నీ చెప్పడం ద్వారా ఈ పుస్తక ప్రచురణకర్తలు మార్క్స్‌తో మొదలుపెట్టి లెనిన్‌ను బొల్షివిక్‌పార్టీనీ అసలు రష్యన్ విప్లవాన్ని కూడా పొరబాటుగా తేల్చేశారనేది స్పష్టం. కమ్యూనిస్టు పార్టీలో ముఠాలను రద్దు చేయడం పొరబాటట. సోవియట్ యూనియన్ 1930–60 మధ్య కాలంలో అద్భుతమైన ఫలితాలు సాధించి నప్పటికీ విప్లవంనాటి ఉత్పాదక స్థాయికంటే అనేక రెట్లు అభివృద్ధి సాధించినప్పటికీ పెట్టుబడిదారీ దేశాల ఉత్పాదక స్థాయిని అధిగ మించడం మొత్తం మీద సాధించలేక పోయిం దన్నారు. (వందల ఏళ్ల వర్గ వ్యవస్థను నలభై ఏళ్ల వయసుకూడా లేని సోషలిజం అధిగమించ కపోవడం పెద్ద తప్పు. అది కూడా వారు రగిలించిన యుద్ధాలు దాడుల మధ్య!)

**వామపక్షాలు మృగ్యమట!**

గతాన్ని అలా వుంచితే ఈనాటి ప్రపంచంలో దేశంలో వామపక్ష శక్తులపట్ల వారెంత నిరాశావాదాన్ని చెబుతున్నారో చూడండి:

'వామపక్ష ప్రగతిశీల శక్తులు దాదాపు మృగ్యంగా కనిపిస్తున్న ప్రపంచంలో మనం వున్నాము" (పేజీ36)

కాబట్టి ఏం చేయాలంటున్నారు?

'అదే సమయంలో మార్క్సిస్టు మౌలిక వాదం ఈ సమాజపు ప్రాపంచిక దృక్పథం కావడం కమ్యూనిజానికి నియమంగా చేసే అవాస్తవిక ధోరణి విడనాడాలి'

'ప్రస్తుతం వునికిలో వున్న పార్టీల వైపు చూడకుండా సోషలిజాన్ని పునరాలోచించి, పునర్నిర్వచించే కొత్త వామపక్ష శక్తులు ముందుకు రావలసి వుంటుంది.

"21వ శతాబ్దపు సోషలిస్టు శక్తులు పరస్పరం సహకరించుకోవాలి. పెట్టుబడిదారీ దేశాలు కూడా ఈ క్రమంలో భాగమైతేనే సోషలిజం సాధ్యమౌతుంది."

ఆనాటి మార్క్సిస్టు–లెనినిస్టు మౌలిక భావాలను విడనాడాలి. ఇప్పుడున్న వామపక్షాలను వదలిపెట్టాలి. కానీ పెట్టుబడిదారీ దేశాలను కూడా కలుపుకొని 21 వ శతాబ్ది సోషలిజాన్ని నిర్మించాలి! ఇంతకన్నా అయోమయ పూరితమైన, అర్థరహితమైన సిద్ధాంతం వుంటుందా?

ఇంత గొప్ప ఉపోద్ఘాతం రాసిన ఈ ప్రచురణకర్తలు తీసుకొచ్చిన పుస్తకంలో విషయాలు ఎలా వుంటాయో తేలిగ్గానే వూహించవచ్చు. అయినా వాటిని కూడా రేఖా మాత్రంగా పరిశీలిద్దాం.

**లెనిన్– స్టాలిన్– ట్రాట్స్కీ: సోవియట్ చరిత్ర**

మోషే లెవిన్ పుస్తకాన్ని శూన్యంలో ఒక నియంతృత్వం అనే అధ్యాయంతో ప్రారంభిస్తాడు. ఇందులో ఆయన లెనిన్‌పై చేసిన వర్ణనలోనే ఆయనకు రష్యన్ విప్లవం పట్ల ఎంత గౌరవం వుందీ తెలుస్తుంది. రష్యాలో విప్లవం తీసుకురావడం పొరబాటన్న లియాన్ ట్రాట్స్కీ వాదనలను ఏదో రూపంలో పునరుద్ఘాటిస్తూ మొదలు పెట్టారు. 'అక్టోబరు విప్లవ ప్రారంభకులు తగు పరిస్థితులు లేకపోయినా అంతర్జాతీయంగా ఒక ఉత్ప్రేరకంగా విస్ఫోటనంగా పనిచేస్తుందనే భావంతో దాన్ని తీసుకొచ్చారట. ఇది దీర్ఘకాలం మనలేకపోవచ్చు అని లెనిన్ 1921లో ప్రకటించాడని తెలిపారు. తమ దేశం ఏకాకి అయిందనే విషయం వారు గ్రహించలేదట. దాన్ని నిలబెట్టుకోవడం కోసం నియంతృత్వం, ఉద్యోగ సామ్యం అమలు చేశారని ఆరోపించారు. తర్వాత లెనిన్ ఏవో మార్పులు తీసుకురావాలనుకున్నా స్టాలిన్ వాటిని సాగనివ్వలేదని విశ్లేషించారు. అన్ని అధ్యాయాలలోనూ ఏ భాషలో రాసినా, ఎన్ని ఉటంకింపులు చేసినా సారాంశం ఇదే. అందువల్ల కొటేషన్స్‌తో ఇబ్బంది పడేబదులు ట్రాట్స్కీ వాదం పూర్వా పరాలు, వాటి పట్ల లెనిన్, స్టాలిన్, బొల్షివిక్ పార్టీ వివిధ సందర్భాల్లో ఎలాటి వైఖరి తీసుకున్నారు, లెనిన్ స్టాలిన్‌ల మధ్య తేడాల స్వభావం ఏమిటి అన్న వాటిని సూటిగా పరిశీలిస్తే సరిపోతుంది. ప్రస్తుతం ప్రపంచ వ్యాపితంగా అందుబాటులో వున్న సోషలిస్టు సాహిత్యం, అంతర్జాతీయ వాదోపవాదాలు ప్రధానంగా ట్రాట్స్కీ అనుయాయులు చేస్తున్నవే. వాటిలోని సంఖ్యా వివరాలు వంటివి చాలా ఉపయోగమైనా సిద్ధాంత సారం మాత్రం సోవియట్‌పైనా, లెనిన్‌పైనా దాడిగా ముగుస్తుంటుంది. వారి మూల విరాట్టు భావాలే అందుకు కారణం.

ప్రతిభావంతుడైన లియాన్ ట్రాట్స్కీ సోవియట్ విప్లవ నాయకత్వంలో ముఖ్యుడైనప్పటికీ – విప్లవ కాలంలో మాత్రమే చేరాడని గుర్తుంచు

కోవాలి. ఆయన ఎక్కువ కాలం మెన్షివిక్కులతోనే వున్నాడు. ప్రతి విషయంలో లెనిన్‌నూ, ఆయన బోధనలనూ వ్యతిరేకించేవాడు. మెన్షివిక్‌లకూ, బొల్షివిక్‌లకూ మధ్యవర్తిగా వున్నట్టు వ్యవహరించేవాడు. కానీ వాస్తవానికి ఆయన ఆలోచనలూ, ఆచరణా కూడా విప్లవానికి చాలా హానికరమైన రీతిలో వుండేవి. పార్టీలో ముఠాలను అనుమతించాలని వాదించడమే గాక వాటిని ప్రోత్సహిస్తుండేవాడు. ఎప్పుడైనా అరుదుగా ట్రాట్‌స్కీ ప్రతిభావంతమైన ప్రతిపాదనలు చేస్తే మెచ్చుకున్నా లెనిన్ ఆయన తప్పులను ఎప్పటికప్పుడు విమర్శిస్తూ వచ్చాడు. 1910–11లో ఆగస్టు బ్లాక్ పేరిట పార్టీ వ్యతిరేక ముఠా కట్టినప్పుడు లెనిన్ ఇలా రాశాడు: ట్రాట్‌స్కీ పార్టీ వ్యతిరేక పంథాను అనుసరిస్తున్నాడనీ మొత్తం పార్టీ తరపున మేము ప్రకటిస్తున్నాము. ఆయన పార్టీ చట్టబద్ధతపైన దాడి చేస్తున్నాడు. దుస్సాహసిక పంథానూ, విచ్ఛిన్నకర పోకడనూ చేపడుతున్నాడు. అతని విధానం అసలైన లక్ష్యాలకు హాని చేసేదిగా వుంది..”

**సంకలిత రచనలు, 17 వ సంపుటి**

ట్రాట్‌స్కీ విప్లవంలో కార్మికులు, రైతుల పాత్ర పట్ల కూడా ఎంత గందరగోళంలో వున్నదీ లెనిన్ సోదాహరణంగా వివరించాడు. ప్రజాతంత్ర విప్లవం, సోషలిస్టు విప్లవం, బూర్జువా జాతీయ వాద విప్లవం వంటి వాటి లక్షణాలను కూడా ఆయన కలగాపులగంచేసి మాట్లాడుతున్నాడని విమర్శించాడు. రైతాంగం పాత్రను నిరాకరించడం ద్వారా ఆయన లిబరల్ బూర్జువాల వలె వ్యవహరిస్తున్నాడని లెనిన్ స్పష్టం చేశాడు. నిజానికి రైతులకూ, కార్మికులకూ మధ్య ఘర్షణ అన్నట్టే మాట్లాడుతూ ప్రమాదకరమైన విప్లవ ప్రతీఘాత సిద్ధాంతాన్ని ప్రతిపాదించాడు. శాశ్వత విప్లవం అన్న అందమైన పదంతో ట్రాట్‌స్కీ వాస్తవానికి కార్మికవర్గం ఒక్కటే అధికారం చలాయిస్తే సరిపోతుందన్న తప్పు వాదన చేస్తూ వచ్చాడు. పైగా ఆలా చేయలేదు గనక సోషలిజం నిర్మాణం సాధ్యం కాదనీ, ఇంకా చెప్పాలంటే చేసిన విప్లవం కూడా తప్పేనన్నట్టు వాదిస్తూ వచ్చాడు. మితవాద ఐరోపా ముందు విప్లవ రష్యా నిలవలేదన్నాడు. శాంతి కార్యక్రమం అనే రచనలో ఇదే విధమైన ఒక సిద్ధాంతంగా తీసుకొచ్చాడు. ఈ వాదనను లెనిన్, స్టాలిన్‌లు తీవ్రంగా ఖండించవలసి వచ్చింది. రెండవ ప్రపంచ యుద్ధం వంటిదాన్ని కూడా తట్టుకుని మరో యాభై ఏళ్లు మహత్తర శక్తిగా సోవియట్ కొనసాగడం ఆయనకు సమాధానమైంది. అయినా సరే ఇప్పటికీ ట్రాట్‌స్కీ వాదులు అదే భజన చేస్తుంటారు!

> **“ ప్రతిభావంతుడైన లియాన్ ట్రాట్‌స్కీ సోవియట్ విప్లవ నాయకత్వంలో ముఖ్యుడైనప్పటికీ - విప్లవ కాలంలో మాత్రమే చేరాడని గుర్తుంచుకోవాలి. ఆయన ఎక్కువ కాలం మెన్షివిక్కులతోనే వున్నాడు. ప్రతి విషయంలో లెనిన్‌నూ, ఆయన బోధనలనూ వ్యతిరేకించేవాడు. మెన్షివిక్‌లకూ, బొల్షివిక్‌లకూ మధ్యవర్తిగా వున్నట్టు వ్యవహరించేవాడు. కానీ వాస్తవానికి ఆయన ఆలోచనలూ, ఆచరణా కూడా విప్లవానికి చాలా హానికరమైన రీతిలో వుండేవి. ”**

పెట్టుబడిదారీ విధానం అసమానాభివృద్ధి, సామ్రాజ్యవాద వ్యవస్థలో ప్రవేశం అన్న కారణాల వల్ల ఏర్పడే వైరుధ్యాల ప్రాధాన్యతను ట్రాట్స్కీ ఏనాడూ గుర్తించలేదు. లెనిన్ అధ్యయనం ఆచరణలతో ఒక దేశంలో సోషలిజం నిర్మాణం సాధ్యమని గుర్తించడమే గాక సామ్రాజ్యవాద యుగ స్వభావాన్ని కూడా సిద్ధాంతీకరించాడు. దాంతో ఏకీభవించలేని ట్రాట్‌స్కీ ఎప్పటికప్పుడే ఏదో వాగాడంబరంతో (ఆయన గొప్ప వక్త) విప్లవ పదజాలంతో గందరగోళపరుస్తూ వచ్చాడు. లెనిన్ వుండగానే బొల్షివిక్ పార్టీ ప్రధాన కార్యదర్శిగా స్టాలిన్ నియమితుడు కావడం, శక్తివంతమైన నేతగా ద్వితీయ స్థానంలో స్థిరపడటం ట్రాట్‌స్కీ ఏనాడూ జీర్ణించుకోలేకపోయాడు. లెనినిజంపై వ్యతిరేకత విప్లవ వ్యతిరేకతగా మారి పార్టీ కేంద్రకమిటీ పైనే దాడికి దిగాడు. అనేక కుట్రలూ, కుహకాలకూ, హీనమైన పనులకూ దిగజారాడు. దురదృష్టవశాత్తూ ఈ సమయంలోనే లెనిన్ ఆరోగ్యం బాగా దెబ్బతినడం పరిస్థితిని సంక్లిష్టం చేసింది. 1922 నవంబరు 30న ఆయన మాస్కో సోవియట్‌లో చివరి ప్రసంగం చేశారు. నిజానికి అంతకు ముందు ఒకసారి అనారోగ్యం పాలై విరామం తీసుకుని అక్టోబరులో తిరిగి వచ్చాడు. పోలిట్‌బ్యూరో సమావేశాలు వారానికి ఒకరోజు రెండు గంటలు మాత్రం జరిగేలా ఏర్పాట్లు చేసి పాలుపంచుకుంటున్నాడు. కాని డిసెంబరు16న ఆయనకు రెండవసారి గుండె పోటు వచ్చింది. అగ్రనాయకులుగా స్టాలిన్, బుఖారిన్, కామనీవ్‌లు డాక్టర్లతో చర్చించారు. ఆయనను అధికార రాజకీయ కార్యకలాపాలకు పూర్తి దూరంగా వుంచాలనీ, సందర్శకులను అస్సలు అనుమతించరాదనీ వైద్యులు సలహా ఇచ్చారు. దీన్ని అమలు చేసే బాధ్యత స్టాలిన్‌కే అప్పగించారు.

అనారోగ్య దశలోనూ లెనిన్ వంటి నాయకుడు దేశంలో అమలు జరుగుతున్న విధానాలను గురించి ఆలోచించకుండా వుండలేడన్నది నిజం. అయితే ఆయనపై ఏమాత్రం ఒత్తిడి పడినా ఆరోగ్యానికి మంచిది కాదన్నది వైద్యుల సలహా. ఈ ఘర్షణలో ఆయన కోరిన మేరకు కొన్ని అంశాలు అంగీకరిస్తూ కొన్నిటిని కుదిస్తూ స్టాలిన్ నాయకత్వం ఆయనను కాపాడుకోవడానికి ప్రయత్నించింది. అయినా లెనిన్‌కు సమాచార లోపంతో పాటు చుట్టూ వున్నవారూ, అసంతృప్త జీవులూ చేరవేసే విషయాలు కొంత ఇబ్బందికరమైన పరిస్థితిని సృష్టించాయి. ఆయన సతీమణి, పార్టీలో ముఖ్య నాయకురాలైన కృపస్కయా స్పందనలు కూడా వీటిలో పాత్ర వహించాయి. లెనిన్ ఆమెద్వారా రాజకీయ పత్రాలు రాయించినట్టు తెలిసి స్టాలిన్ కొంత మందలింపుగా మాట్లాడాడు. దానిపై లెనిన్ చాలా ఆగ్రహం చెందాడు. ఎంత గొప్ప నేతలైనా మనుషులే గనక నా భార్యను అంటే నన్ను అన్నట్టే అంటూ లేఖ రాసి క్షమాపణలు చెప్పాలని షరతు పెట్టాడు. స్టాలిన్ నిస్సంకోచంగా క్షమాపణలు చెబుతూనే పరిస్థితిని వివరించే ప్రయత్నం చేశాడు. పెద్ద వయస్సులో అనారోగ్య పరిస్థితిలో ఎక్కడైనా సహజంగా జరిగే ఈ సంఘర్షణను కొంతమంది స్టాలిన్ నేరంగా చిత్రించే ప్రయత్నం చేస్తుంటారు. (వాస్తవానికి స్టాలిన్ జబ్బుపడినప్పుడు లెనిన్ ఇంతకు రెండింతలు జాగ్రత్తలు తీసుకున్న విషయం చరిత్రలో నమోదైంది) జార్జియన్ సమస్యలో స్టాలిన్ తీసుకున్న చర్యలు లెనిన్‌కు నచ్చలేదు. ఆ సమయంలో ట్రాట్‌స్కీతో కలసి వాటిని వ్యతిరేకించే ప్రయత్నం చేయాలనుకున్నాడు. ఒకప్పుడు తాను ఎంతగానో ఖండించిన అతన్ని పిలిపించి తన భావాలను సమర్థించే బాధ్యత నిర్వహించాలని అభ్యర్థించాడు. అయితే స్టాలిన్‌ను వ్యతిరేకించడం వరకూ గొంతు కలిపినా లెనిన్ భావలను వినిపించే పాత్ర తీసుకోవడానికి ట్రాట్‌స్కీ సిద్ధం కాలేదు. అప్పట్లో ఏమీచెప్పలేదు కూడా.

ఈ నేపథ్యంలోనే లెనిన్, స్టాలిన్ నాయకత్వ పద్ధతులపై తన విభేదాలు వెల్లడిస్తూ లేఖ రాసి

(మిగతా 34వ పేజీలో)

సంస్కృతి

# ప్రపంచీకరణ-వాణిజ్య ప్రకటనలు

## 'ఆధునిక' భారతీయ మహిళలు

అర్పితా గుహ రాకుర్త

**టీ**వి ప్రసార మాధ్యమానికి ప్రజాదరణ పెరుగుతున్న కొద్దీ ఈ మాధ్యమంలో అడ్వర్‌టైజ్ మెంట్లు (ప్రకటనలు) నానాటికీ పై చెయ్యి సాధిస్తూ సరికొత్త మీడియా సంస్కృతిని అభివృద్ధి చేస్తున్నాయి. ప్రపంచీకరణ విధానాల నేపథ్యంలో ప్రకటనల రంగమే దానంతటదే ఒక సాంస్కృతిక రూపాన్ని సంతరించుకుంటున్నది.

పెట్టుబడిదారీ సూత్రాలయిన పోటీ, కేంద్రీ కరణ, లాభాల చట్రంలో ప్రకటనల రంగం మార్కెట్‌లో నిలదొక్కుకోవడమే కాకుండా కొత్త మార్కెట్లను సృష్టించుకుంటున్నది. ఈ క్రమంలో మహిళలు వినియోగదారులుగా అగ్ర భాగాన ఉన్నారు. ప్రకటనల రంగం మహిళలనే లక్ష్యం గా ఎంచుకుని పనిచేస్తుంది. అలాగే ఈ ప్రకట నలు ప్రసారం చేసే భావపరంపరలు, సందే శాల్లో స్త్రీ రూపమే ప్రాధాన్యత సంతరించుకుంది. కొద్ది సెకన్లు లేదా ఒకట్రెండు నిమిషాల పాటు ప్రసారమయ్యే ఈ ప్రకటనలల్లో మహిళలు సామాజిక విలువలను పునఃప్రతిష్ఠించే లలనా మణులుగా మనకు దర్శనమిస్తారు. అఫ్‌కోర్స్, ఈ సామాజిక విలువలు అంతిమంగా పితృస్వా మిక భావజాలానికి, బహుళజాతి కంపెనీల వ్యాపార ప్రయోజనాలకు లోబడే ఉంటాయను కోండి.

ఈ క్రమంలోనే గత ముప్ఫైఏళ్ళుగా టీవీ ల్లో, పుస్తకాల్లో, వార్తాపత్రికలలో వచ్చిన ప్రకటనలో మహిళలను మాతృమూర్తిగానో, స్త్రీ మూర్తిగానో మాత్రమే చూపించే ఫక్తు స్టీరియో టైపు ధోరణులలో ఇవాళ చాలా మార్పులు చోటు చేసుకున్నాయి. ఇదంతా ప్రపంచీకరణ విధానాల పుణ్యమే అని వేరుగా చెప్పనక్కరలేదు. భారతీయ స్త్రీ 'ఇమేజి' రీత్యా ఇవాళ గ్లోబలీ కరించబడింది.

భారతీయ అడ్వర్‌టైజ్‌మెంట్లలో చూపించే మహిళలు స్థూలంగా రెండు తరగతులకు ప్రతినిధులుగా మనకు కనబడతారు. ప్రేమ పాత్రమైన తల్లి, అనుకూలవతి అయిన భార్య ఒక తరగతి ప్రతినిధి ఐతే, కవ్వించి, తుళ్ళించే సెక్స్ సింబల్‌గా చూపించడం ఇంకో తరహాది. మహిళలను సెక్స్ సింబల్‌గా చూపించడంలో పెద్ద మార్పేమీ లేదుగానీ అణుకువైన భార్య, ఆప్యాయత పంచే అమ్మ పాత్రలు క్రమేపీ మార్పులకు లోనయ్యాయి. 70వ దశకం నుండి ఈ మార్పులు మొదలయ్యాయి. పాపులర్ మీడియా, సినిమా, టీవి, దిన, మాస వార్తా పత్రికలు కాలానుగుణమైన మార్పులను అందిపు చ్చుకునే క్రమంలోనే ఈ మార్పులు చోటుచేసు కున్నాయి.

సరళీకృత ఆర్థిక విధానాల్లో భాగంగా పరి శ్రమలు, మౌలిక రంగాల్లో ప్రైవేటు పెట్టు బడులకు పెద్ద ఎత్తున్న ప్రోత్సాహం కలిగించడం దరిమిలా సర్వీసు రంగంలో విస్తృతమైన వృద్ధి ఏర్పడడం భారతీయ మహిళ 'ఇమేజ్' మరింత మార్పులకు లోనయ్యేందుకు దోహదం చేసింది. భారతదేశ ఆర్థికమంత్రిత్వశాఖ లెక్కల ప్రకారమే 1971-72, 1998-99 మధ్యకాలంలో ప్రభుత్వరంగ ఉద్యోగాల సంఖ్య 7.01 లక్షల నుండి 19 లక్షలకు పెరిగింది. ఈ కాలంలోనే తలసరి జీతాలు 5920 రూ॥ల నుండి 14922 రూ॥లకు పెరిగినట్లు ప్రభుత్వ అంచనా. 25 ఏళ్ళ మధ్యకాలంలో 192 పాయింట్ల నుండి 2069 పాయింట్లకు పెరిగిన వినియోగదారుల ధరల సూచికే దేశంలో పెరిగిన వినియోగదారీ తత్వానికి అద్దం పడుతుంది. దేశంలో కొత్త మధ్యతరగతి వర్గం వేగంగా అభివృద్ధి చెందింది. వీరితో పాటే వీరి కోర్కెలు, ఆకాంక్షలూ, ఆశ లూ, వినియోగదారీతత్వం విస్తృతం అయ్యాయి

ఏటా ప్రభుత్వం వెలువరించే 'ఆర్థిక సర్వే'లతో దేశంలో గత ఐదేళ్ళలో గృహ సంబంధమైన వినియోగదారీ వ్యయాలకు సంబంధించిన వివరాలు పొందుపరుస్తారు. ఈ వివరాల ఆధారంగానే దేశంలో ఉన్న పేదరికం ఎంతో ప్రభుత్వం అంచనా వేస్తుంది. సర్కారు లెక్కల ప్రకారం 70వ దశకం వరకూ పెద్ద ఎత్తున ఉన్న పేదరికం 80వ దశకం నుండి తగ్గుముఖం పట్టిందని - సాధించిన ఆర్థిక ప్రగతి మూలంగానే ఇది సాధ్యమయిందని ప్రభుత్వ ఉవాచ.

జాతీయ మానవాభివృద్ధి నివేదిక - 2001 ప్రకారం సంఘటిత పబ్లిక్ - ప్రైవేటు రంగ ఉపాధిలో మహిళల భాగస్వామ్యం పెరిగింది. 1990-99 మధ్య పదేళ్ళ కాలంలో ప్రభుత్వ రంగంలో పనిచేసే మహిళల సంఖ్య 22.50 లక్షల నుండి 28.11 లక్షలకు




పెరిగితే, ప్రైవేటు రంగంలో 13.94 లక్షల నుండి 20.18 లక్షలకు పెరిగిందని ఈ నివేదిక వివరిస్తుంది.

మహిళలు కేవలం ఇంటికే పరిమితం కాకుండా రాన్రానూ ఉపాధి, ఉద్యోగవకాశాలు అందుకునే క్రమం పెరిగిన కొద్దీ పెట్టుబడిదారీ వినియోగదారీతత్వం ఈ తరగతి మహిళలను లక్ష్యంగా చేసుకుని మరీ కొత్త పోకడలు పోసాగింది. అసలుకే పెట్టుబడిదారీ వినియోగ దారీ తత్వం వికృతమయినది. కొత్త మార్కెట్ల సృష్టికోసం ఇంకెన్ని వికృతమైన పోకడలు పోవడానికయినా ఏ మాత్రం వెరపు చెయ్యదు. ఈ క్రమంలోనే అప్పటిదాకా ఫ్యూడల్ కుటుంబ బంధనాల్లో చిక్కుకుని సతీ అనసూయ, సతీ సావిత్రి వంటి పురాణ పతివ్రతల ప్రతీకలలోకి ఒదిగి ఉండాల్సిన హైందవ స్త్రీలు ఇంకెంత మాత్రమూ ఆ 'ఇమేజి' చట్టంలోనే కొనసాగడానికి వీలులేని పరిస్థితులు సామ్రాజ్యవాద ప్రపంచీ కరణ విధానాలు సృష్టించాయి. అట్లా అని మహిళలకు సాంప్రదాయ బంధనాల నుండి విముక్తి కలిగించాయా అంటే అదీలేదు. పితృస్వామిక సమాజాల అలిఖిత శాసనాల సారం మాత్రం యధావిధిగా కొనసాగుతుంది. భారతీయ గ్లోబల్ నారీ రూపాన్ని తీర్చిదిద్దడంలో ప్రపంచీకరణ ప్రాజెక్టు తగు జాగ్రత్తలు తీసు కుంది. మా కాలంలో ఉంది చూసారా అని

గొప్పగా చెప్పుకునే సంప్రదాయాల కాలానికి, ఆధునిక–సమకాలీన తరానికి మధ్య దోబూచులాడే ప్రతీకలను ముందుగా ముందుకు తెచ్చింది ఈ ప్రాజెక్టు. అందుకే ఇప్పటికీ పిల్లల్ని సాకడం, ఇల్లు చక్కదిద్దడం వంటి పనుల ద్వారా ఆడవాళ్ళు ఎంత గొప్ప సంతృప్తి సాధిస్తారో చెప్పడానికి అదే తల్లి, కూతురూ, భార్య పాత్రలకే ప్రాధాన్యం ఇస్తాయి ప్రకటనల కంపెనీలు. పక్కాగృహస్థులుగా ఉండే స్త్రీ పాత్రలకు ఆధునికత సంతరించి ఆయా కంపెనీల బ్రాండ్‌లను అంది పుచ్చుకోవడం ద్వారా తాము ఎలాంటి ఆధునిక, 'సంతృప్తికర జీవితం' అనుభవిస్తున్నామో తెలియ చెప్పడమే ఈ ప్రకటనల లక్ష్యం. ఉదాహరణకు 'విర్ల్‌పూల్' కంపెనీ ప్రకటననే తీసుకోండి. బట్టలుతకడం దగ్గర్నించి అన్ని పనులూ నవ్వుతూ, ఎలాంటి అలసటకు తావు లేకుండా చిటికెలో చేసేసిన అమ్మ, 'అమ్మా ఇవాళ ఏం మ్యాజిక్ చేస్తావూ' అని కూతురు అడగంగానే అదే కంపెనీ 'ఫ్రిజ్'లోంచి మ్యాజిక్‌గా ఐస్ క్యూబ్‌లు తీసి పిల్లకి, భర్తకు రసమయ పానీయాలు తయారు చేసి ఇస్తుంది. ఈ ప్రకటనలో మనకు కనిపించే స్త్రీ అటు తల్లిగా, ఇటు భర్తకు భార్యగా రెండు పాత్రలు ఏక కాలంలో పోషిస్తుంది. ఐనా ఈ పాత్రల గుర్తింపుకోసం నుదుట బొట్టు, ఒంటికి చీరకట్టుతో మాత్రం ఉండదు. జీన్స్‌పాంటు, టాప్, బాబ్డ్ హెయిర్ తో కుశాలగా కనిపిస్తుంది. భారతదేశపు నవీన 'స్త్రీ'కి ప్రతీక ఈమె. వినియోగదారీ 'పెట్టుబడి' సంప్రదాయ హైందవ స్త్రీకి ఈ మేరకు 'స్వేచ్ఛ' కల్పించింది. ఈ స్వేచ్ఛ కూడా ఎలా దక్కుతుందీ – ఇంట్లో చాకిరీనంతా నిభాయించుకోవడానికి ఫ్రిజ్, వాషింగ్ మిషన్ లాంటి రకరకాల కంపెనీల ఉత్పత్తులన్నీ ఇంట్లో అమరి ఉంటేనే. ఇవన్నీ కావాలంటే మళ్ళీ చేతిలో పైసలుండాలి.

'విర్ల్‌పూల్' 'యాడ్'కి విరుద్ధంగా ఉండే ఇంకో వాణిజ్య ప్రకటన చూద్దాం. స్మిత్‌క్లెయిన్ & బీచమ్ అనే అమెరికా కంపెనీ వారి 'హార్లిక్స్' ఉత్పాదన గురించిన వాణిజ్య ప్రకటనలో ఇంటిపన్లు చేసుకోలేక నిస్త్రాణ పడిపోయి ఉన్న భార్యకి భర్త ఓ కప్పు హార్లిక్స్ ఇస్తాడు. దాంతో ఆవిడ ఎక్కడ లేని హుషారు తెచ్చుకుని క్షణాల్లో ఇంటిపన్లు చక్క పెట్టేస్తుంది. పని ఒత్తిడి మూలంగానో, ఒంట్లో నీరసం మూలానో ఆడవాళ్ళు పని చేసుకోలేకపోతే ఒక చెయ్యి సాయం పడితే మంచిదని చెప్పడం పోయి ఒక కప్పు హార్లిక్స్ ఇచ్చి వాళ్లతో సుబ్బరంగా అరవ చాకిరీ అంతా చేయించుకోవచ్చని చెప్పడమేనా ఈ వాణిజ్య ప్రకటన సారాంశం. "మూవ్" ఆయింట్‌మెంట్ ప్రకటన సారాంశం కూడా అంతే – ఇంటావిడ వెన్ను నొప్పి 'సెట్' అయితే ఇల్లాంతా 'సెట్' అయిపోయినట్టే అని క్యాప్షన్ కూడా పైగా.

> **"ఇంటిపన్లు చేసుకోలేక నిస్త్రాణ పడిపోయి ఉన్న భార్యకి భర్త ఓ కప్పు హార్లిక్స్ ఇస్తాడు. దాంతో ఆవిడ ఎక్కడ లేని హుషారు తెచ్చుకుని క్షణాల్లో ఇంటిపన్లు చక్క పెట్టేస్తుంది. పని ఒత్తిడి మూలంగానో, ఒంట్లో నీరసం మూలానో ఆడవాళ్ళు పని చేసుకోలేకపోతే ఒక చెయ్యి సాయం పడితే మంచిదని చెప్పడం పోయి ఒక కప్పు హార్లిక్స్ ఇచ్చి వాళ్లతో సుబ్బరంగా అరవ చాకిరీ అంతా చేయించుకోవచ్చని చెప్పడమేనా ఈ వాణిజ్య ప్రకటన సారాంశం."**

వాణిజ్య ప్రకటనలు కూడా 'జెండర్' రాజకీయాలకు అతీతంగా ఉండవు మరి.

ఆడవాళ్ళ అలంకరణ, సౌందర్య సాధనాల వాణిజ్య ప్రకటనలలో కూడా గతంతో పోలిస్తే ఇవాళ చాలా తేడాలు వచ్చేసాయి. 'పారాచూట్' కొబ్బరినూనె, బెంగాల్‌లో దొరికే 'షాలిమార్' కొబ్బరినూనె కంపెనీలు ఇచ్చే వాణిజ్య ప్రకటనలు, సంప్రదాయం ఆధునికతలు ఒకదానికొకటి ఇచ్చి పుచ్చుకునేవిగా చిత్రీకరిస్తాయి. పోలీస్ యూనిఫారంలో ఉన్న మహిళ – ఒక ఆధునిక మహిళ సంప్రదాయ బద్ధంగా గుడికి వెళ్ళడం, కాలిబూట్లు విప్పి లోపలికి వెళ్తూ తలమీద టోపీని తియ్యడంతో జుత్తు జలజలా జాలువారడం ఈ జుత్తుకు కారణం ఆవిడ పారాచూట్ కొబ్బరినూనె వాడడమే అని మనకు చూపిస్తారు. మహిళలు ఎంత ఆధునికంగా ఉన్నా పొడవైన శిరోజాలను సంరక్షించుకుంటూ సంప్రదాయ మహిళగా కూడా ఉండొచ్చు అని చెప్పడం ఈ వాణిజ్య ప్రకటన ఉద్దేశం. అలాగే ఇంకో వాణిజ్య ప్రకటనలో పాతకాలపు అత్తాకోడళ్ళు మనకు సాక్షాత్కరిస్తారు. కొత్త కోడలు అత్తగారికి స్కూటరు నడపడం నేర్పిస్తుంది. "కాలంతో పాటు తరాలు మారుతాయి, కానీ నిగనిగలాడే కేశ సంపదకు అప్పటికీ, ఇప్పటికీ, ఎప్పటికీ మా 'బ్రాండ్' కొబ్బరినూనె నిలుస్తుంది" అని బ్యాక్‌గ్రౌండ్ ప్రకటన వినిపిస్తుంది మనకు.

గ్లోబలైజేషన్ ఆధునికతల పేరిట సమాజంలో స్త్రీల పాత్రను పునర్నిర్మిస్తున్నాం, పునర్ నిర్వచిస్తున్నాం అని పైకి ఎంత గొప్ప కబుర్లు చెప్పినా, నయా ఆర్థిక వ్యవస్థ నిర్మాణానికి అనువుగా స్త్రీలు సామాజిక, ఆర్థికరంగాల్లో కొత్త పాత్ర పోషించడానికి అవకాశాలు కల్పించినా – ఇవన్నీ జెండర్ వివక్ష పరిమితుల్లోనే ఉంటాయి. జెండర్ పునర్నిర్మాణానికి అనుసరిస్తున్న కొత్త కొత్త వ్యూహాల నుండి మనం తెలుసుకోదగ్గ ఆసక్తికరమైన అంశం ఏమిటంటే – మార్పు అనేది ఒక్కో చారిత్రిక సందర్భంలో దానంతట అదే బలీయంగా ముందుకు వస్తుంది 'నూతన తరం స్త్రీ'ల ఆవిష్కారం గతంలోనూ జరిగిందే.

బ్రిటిష్ వాళ్ళ హయాంలో ఇంగ్లీష్ చదువులకు ప్రజాదరణ కలిగించడానికి ఆడపిల్లలకు చదువులు ఉండాలి, ఆడాళ్ళకీ 'నాగరికత' అబ్బించకపోతే ఎలా అంటూ అప్పటిదాకా ఉన్న సంప్రదాయ స్త్రీ గణంలో 'మార్పు' రావాలని చెప్పారు. ఆనాటి స్థలకాల అవసరాలకు అనుగుణంగా స్త్రీలను పునరుత్పత్తి చేసారు. వీళ్ళ దృష్టిలో ఆడవాళ్ళకు విద్య ఎందుకు అవసరం అయిందంటారూ? సరికొత్తగా జ్ఞానోదయం పొందిన పితృస్వామిక భావజాలం చేసే సరికొత్త ప్రసారాలను అందుకునే అధునాతన ట్రన్స్‌మిటర్లుగా ఆడవాళ్ళు ఉండాలిగా మరి. చదువుకున్న మగవాళ్ళ తాహతుకు తగ్గినట్లుగా ఆడవాళ్లు ఉండాలి. అందం, చందం, చదువూ – సంధ్యా ఉన్న ఆడది భార్యగా పక్కన నిలబడితే మగవాడికి సమాజంలో అదో పెద్ద హోదా కదా! వంటింటి కుందేళ్ళతో సొసైటీలో వేగడం నామోషీ నాయె. 'మహిళాలోకం'లో మార్పుకోరేందుకు మగవారికి ఉన్న కారణాలు ఇంతకన్నా ఎక్కువ ఉంటాయంటారా? సామాజిక మార్పులకు హేతువు ఇది.

ఇక ఆర్థికపరంగా చూస్తే నానాటికీ ఉద్యోగాలు చేసే మహిళలు సంఖ్య పెరగడం, కుటుంబంతో పాటు వాళ్ళ కొనుగోలు శక్తీ పెరగడంతో వినిమయదారీ సంస్కృతికి వీళ్ళే లక్ష్యంగా మారారు. టీవీ ప్రేక్షకుల సంఖ్యలో మహిళలు సింహభాగం కావడం మరో అనువైన అంశంగా మారింది. ఇన్ని మార్పులు సమాజంలో చోటు చేసుకున్నా మారుతున్న కాలంతో పాటే వన్నె చిన్నె మెరుగులు దిద్దుకుని మరీ దాష్టీకం చేస్తున్న పితృస్వామిక భావజాలాన్ని గానీ, అది మహిళాలోకం మీద రుద్దిన విలువల వ్యవస్థను గానీ, ప్రశ్నించే స్థాయికి 'నవీన మహిళలు' ఎదగలేకపోయారు.

ఆధునికత పేరిట కొత్త విలువలను రుద్దే క్రమంలో భారతీయ మహిళ రెండు రకాలుగా సరుకుగా మార్చబడింది. సంప్రదాయం, జాతీయ సంస్కృతి, స్త్రీత్వం, శీలం తదితర సకల సద్గుణ రాశులుగా ఉండడంతో పాటు పితృస్వామిక, మతపరమైన భావజాలాలు, సామాజిక – ఆర్థిక

> **“ ఇక ఆర్థికపరంగా చూస్తే నానాటికీ ఉద్యోగాలు చేసే మహిళలు సంఖ్య పెరగడం, కుటుంబంతో పాటు వాళ్ళ కొనుగోలు శక్తీ పెరగడంతో వినిమయదారీ సంస్కృతికి వీళ్ళే లక్ష్యంగా మారారు. టీవీ ప్రేక్షకుల సంఖ్యలో మహిళలు సింహభాగం కావడం మరో అనువైన అంశంగా మారింది. ”**

కట్టుబాట్లు, ఇవన్నీ కలిసి 'మహిళలను ఎక్కడ ఉండాలో అక్కడ ఉంచేందుకే' కృషి చేస్తు న్నాయి. ఈ విలువల దృష్టిలో ఒద్దిక, అణుకువ, మన్నన కలిగిన తల్లిగా, భార్యగా మసలు కోవడమే ఆదర్శ స్త్రీ మూర్తులకు ఉండాల్సిన లక్షణాలని నిర్ధారించారు. సమ్మతి తయారీ (మాన్యుఫ్యాక్చరింగ్ కన్సెంట్) లాగ ఇది కూడా ఒక విధంగా దాష్టీకపు అంగీకార తయారీగా మనం చెప్పుకోవచ్చు. సామాజిక కట్టుబాట్లు, మత సంప్రదాయాల పేరిట మహిళలకు సంబంధించి మాతృత్వం సహా అన్ని అంశాల మీద కట్టుకున్న భర్త అధికారం చలాయిం చేందుకు లైసెన్సు ఉండనే ఉందయ్యే. మహిళల పాలిట ఇంతమంది నైతిక కాపలాదారులా? పైగా పుణ్యలోక ప్రాప్తికి పతి పాదసేవతో సహా అన్ని రకాలుగా భర్తను మెప్పించాలా? కుటుంబ క్షేమం కోసం తనకు తాను కొవ్వొత్తిగా కరిగి పోయి, త్యాగమూర్తిగా వర్థిల్లాలా? – ఇదిగో ఇలాంటి 'మంచి' లక్షణాలతో మూర్తీభవించిన 'ఆధునిక మహిళ'లే మనకు తెర మీద వాణిజ్య ప్రకటనలో కనిపిస్తుంటారు. ఇదేదో ఇంటిపట్టున ఉండే భార్యలకు, తల్లులకే కాదు, ఉద్యోగం చేసే మహిళలూ ఈ చట్రంలోనే కనిపించాలి, ఆధునిక వస్త్రధారణ ఒకటే మినహాయింపు.

సమకాలీన పత్రికలు, సినిమాలు, టెలి సీరియల్స్, వాణిజ్య ప్రకటనలు ఇవన్నీ పైన మనం చెప్పుకున్న 'ఆధునిక మహిళ' ప్రతిరూ పాల్ని ఫ్యాషన్‌గా, ఫ్యాన్సీగా ప్రచారంలోకి తెస్తున్నాయి. నేడు ఉన్న ఆర్థిక వ్యవస్థలో అటు సంపాదనపరురాలిగా, ఇటు వినియోగదారుని గా రెండు రకాలా మహిళలను మెప్పించాలి. పన్లో పనిగా 'సంఘ సంస్కృతి' దెబ్బతినకుండా కూడా చూసుకోవాలి. 90వ దశకం తరువాత ప్రపంచీకరణ విధానాలు ఊపందుకున్న క్రమంలో వినిమయదారీ సంస్కృతికి రెక్కలు వచ్చాయి. ఇంత వెల్లువలో కూడా సమాజంలో మహిళలు ద్వితీయ శ్రేణి పౌరులుగా ఉంటూనే ఉన్నంతలో సౌకర్యంగా ఉండడానికి ఎలాంటి సామాన్లు, సరుకులు కొనుక్కోవాలనే మోక్ష మార్గాన్ని వాణిజ్య ప్రకటనలు చూపిస్తా ఉన్నాయి. ద్వితీయ శ్రేణి జీవితానికి – సౌకర్యానికి మధ్యన ప్రపంచీకరణ విధానాలు ఇలా 'రాజీ' కుదిర్చాయి.

భారతీయ మహిళలను వాణిజ్య ప్రకటనల సరుకులుగా మార్చే క్రమంలోనే వారిని ఆ సరుకులకు వినియోగదారులుగా కూడా తయారు చెయ్యడం గొప్ప విచిత్రం. లావాదేవీకి రెండు వైపులా ఉన్నది మహిళలే. మనదేశంలో అనేకాదు ప్రపంచంలో ఎక్కడ చూసినా జరుగు తుంది ఇదే.

మహిళల శరీరాన్ని, అంగాంగాల్నీ చూపించి సొమ్ము చేసుకోవడం – ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ఈ క్షీణకళ మరింత వెలుగులు చిమ్ముతుంది ఈ మధ్యన – వినియో గదారుల్లోని మగ మహానుభావుల్ని ఆకట్టు కోవడానికే అని వేరే చెప్పనక్కరలేదు.

వాణిజ్య ప్రకటనలో కామోద్దీప భావనలు చొప్పించడానికి 'మల్టీమీడియా' మూలంగా కొత్తగా అంది వచ్చిన సాంకేతిక పరిజ్ఞానం ఇప్పుడు మనం టీవీల్లో చూస్తున్నాం – కొత్త కొత్త విదేశీ బైక్‌ల విడి భాగాలను స్త్రీ శరీరంలోని విడి భాగాలతో సరిపోలుస్తూ మన సల్మాన్‌ఖాన్ లాంటి చొక్కాలేని యువకుడు ఆ "బైక్"ని సవరదీస్తా ఉంటాడు ఆ తరువాత ఆ బైక్ మీద ఎక్కి సవారీ చేస్తున్నట్లు చూపిస్తున్నారు.

కామోద్దీప భావనల సరసకు చేరే ఇలాంటి వాణిజ్య ప్రకటనలు దీనికీ దానికీ అని పరిమితం కాలేదు. మరీ ముఖ్యంగా బహుళజాతి కంపెనీ లు తమ సరుకులు అన్నింటినీ ఇలాంటి 'సరస' ప్రకటనల ద్వారానే మార్కెట్ చెయ్యాలని ప్రయ త్నిస్తున్నాయి. యాక్స్, పారిస్, కూపర్, డెనిమ్ వంటి అత్తరు (బాడీస్ప్రే) కంపెనీలు, హేవార్డ్, ఇంపీరియల్ బ్లూ, రాయల్ ఛాలెంజ్ వంటి మత్తుపానీయాల కంపెనీలు, విఐపి ఫ్రెంచి లాంటి అండర్‌వేర్ కంపెనీల సహా అన్ని బహుళ జాతి కంపెనీలు వాణిజ్య ప్రకటనలలో చూపించే మగవాళ్ళు ఆ కంపెనీల ఉత్పత్తులతో పాటు, ఆ ఉత్పత్తులకు ఉప ఉత్పత్తులుగా చూపించే అమ్మాయిలనూ స్వంతం చేసుకునే వినియోగదారులుగా చూపిస్తున్నాయి. నిజానికి ఈ ప్రకటనల్లో అమ్మాయిలను చూపించాల్సిన పనేలేదు. పాత్ర పోషణకు వారికి ఏ అవ కాశమూ లేదు. ఈ ప్రకటనల్లో ఐనా అమ్మాయి లను చూపించి వాళ్ళని ఏ విస్కీ సీసాగానో, సిగిరెట్‌గానో – ఒక సరుకుగా కుదించేసి మగ మహారాజ పోషకులకు అమ్మే ప్రయత్నం చేస్తున్నాయి. ఈ కంపెనీలు ఆడవాళ్ళను సరుకులతో పాటుగా దొరికే 'బంపర్ ఆఫర్ బహుమతులు'గా చూపిస్తున్నాయి. ఈ జాడ్యం దేశీయ కంపెనీలు కూడా అంటించుకున్నాయి. 'అమూల్' బనియన్ కంపెనీ వాణిజ్య ప్రకటన చూసారా మీరు! అందులో కొంతమంది రౌడీలు ఒక ఆడపిల్లని బలవంతంగా కార్లో ఎక్కించు కుపోవడానికి ప్రయత్నిస్తుంటారు. ఆ అమ్మా యేమో 'రక్షించండి' 'రక్షించండి' అని కేకలేస్తుంది. ఇంతలో లోపల ఒంటి మీదున్న బనీను, డ్రాయరు కనిపించేలా ఉన్న ఒక యువకుడు అక్కడికి ప్రత్యక్షమవుతాడు. కదిలిపోబోతున్న కారుకి తన ఒంటిమీదున్న బనీన్ని గాలంగా వేసి ఆపేస్తాడు. వెనక్కి గుంజి కార్లో ఉన్న రౌడీలను 'రఫ్' ఆడించి ఆ అమ్మాయిని రక్షిస్తారు. దాంతో ఆ అమ్మాయి మన హీరోగారిని కృత జ్ఞతా భావంతో గట్టిగా హత్తుకుపోతుంది. దాంతో పాటే కింద ఓ 'క్యాప్షన్' ప్రత్యక్ష మవు తుంది – "మీ లోదుస్తులు ఫిట్‌గా ఉంటే బయట కూడా 'ఫిట్' కింద లెక్క" అని 'ఫిట్'గా ఉండే బనీన్లు కొనుక్కుంటే మీకు 'ఫిట్టయ్యే అమ్మాయి' ప్రైజ్ క్యాచ్'గా దొరుకుతుందని ఊరిస్తున్నారు.

సాంస్కృతిక రాజకీయాల దృష్ట్యా పరిశీలిస్తే ఈ వాణిజ్య ప్రకటనలు స్త్రీ పురుషుల మధ్య ఉన్న ద్విపద సంబంధాలను మనకు పట్టి ఇస్తా యి. ఉత్తమాధమ, ఆధిపత్య అణుకువ, క్రియా శీల–క్రియాశూన్య సంబంధాలతో పాటు అంతిమంగా 'వినియోగదారుడు – సరుకు' సంబంధాలను మనకు తెలియ చేస్తాయి. ఎంత సరసశృంగార వాణిజ్య ప్రకటనలయినా సామాజిక నిర్మాణంలో ఆడవాళ్ళపై మగవారి ఆధిపత్యపు 'బ్యాలన్సు' చెడిపోకుండా తగు జాగ్రత్తలు తీసుకుంటారు.

వినిమయ సంస్కృతి ఆర్థికవ్యవస్థలో 'జెండర్' అసమానతకు కొదవేమీ లేదు. వాణిజ్య ప్రకటనల రంగంలో 80 దశకంలోనే 'సర్ఫ్' కంపెనీ పెద్ద కుదుపు తెచ్చింది. 'లలితగారు' (కవితా చౌదురి) గుర్తున్నారా! చురుకైన, తెలివైన గృహిణికి ప్రతిరూపంగా బుల్లితెరను ఓ ఊపు ఊపేసిన ప్రకటన అది. మార్కెట్‌లోకి సరుకులు వెల్లువలా వచ్చి పడిపోతుంటే ఏది మంచో, ఏది చెడో ఇట్టే పసికట్టే తెలివైన మధ్యతరగతి గృహిణిగా చాలాకాలంపాటు అందరి మన స్సులో నిలిచిపోయిన ప్రకటన అది. 'చౌకగా' వస్తువులు, సరుకులు కొనాలనుకునే సగటు

మనస్తత్వం మీద ఈ ప్రకటన పెద్ద యుద్ధమే చేసింది. 'ఇంకా చౌకలో ఏం లేవా! అనే ప్రశ్నకు బదులు, "కాసంత రేటయినా ఫర్లేదు, మన్నిక యిందేనా" అని అడిగే దశకు మధ్య తరగతి కొనుగోలు వర్గాన్ని తీసుకువచ్చేసింది ఈ వాణిజ్య ప్రకటన. అదీ 'లలితగారి' తెలివి.

ఇంటికి కావల్సినవన్నీ అమర్చుకునే తెలివైన గృహిణిగా 'లలితగారు' ఆనాటి మధ్యతరగతి కుటుంబాల మీద ప్రగాఢమైన ముద్ర వేసారు. ఐతే ఈ తెలివితేటలు బట్టల సబ్బులు, ఒంటి సబ్బులు, తలనూనె వంటి వాటికే పరిమితం సుమా! అదే ఎల్ఐసి పాలసీలు తీసుకోవాలన్నా, మ్యూచువల్ ఫండ్‌లో పెట్టుబడులు పెట్టాలన్నా, స్కూటరో, మోటారుబైకో కొనాలన్నా నిర్ణయాధికారం మగవారికే ఉండేలా వాణిజ్య ప్రకటనలు వచ్చేయి. ప్రకటన కర్తల లక్ష్యం కూడా మగవారే. ఇప్పటికీ లక్ష్యం ఐతే మారలేదు. ప్రకటనల్లో కొంత మార్పులు వచ్చాయి. ఆడవాళ్లకూ ఇలాంటి వాణిజ్య ప్రకటనల్లో చోటు దక్కింది. కానయితే ఇంతకు ముందే మనం చెప్పుకున్నట్లు వారి ఉనికి 'సరుకుల'కు 'సెక్సీతత్వాన్ని' అందించడం వరకే పరిమితం.

ఇదే కాలంలో టీవీలో లలితగారికి సమాంతరంగా రజని (ప్రియా టెండూల్కర్) పాత్ర వచ్చింది. ఇంటి పట్టున ఉండే ఇల్లాలే అయినా ప్రజా జీవితంలో పౌర బాధ్యతలు, విద్యుక్త ధర్మాలను ప్రబోధించే మధ్య తరగతి కుటుంబంలోని తల్లిగా గొప్ప పాత్ర పోషణ చేసింది. అలాగే 'సర్ఫ్' లలితగారు భారతీయ సమాజంలో 'జెండర్' అసమానతలను దాటుకుని ధైర్యంగా, ధృడలక్ష్యంతో పోలీసు ఆఫీసరు అయిన తీరును వివరించే 'ఉడాన్' టెలి సీరియల్‌లో నటించి రాణించింది.

ఈ కాలంలోనే అప్పటిదాకా అగుపించిన 'స్త్రీ' ప్రతిరూపంలో ఏయే మార్పులు వచ్చాయి. చక్కటి మేకప్‌తో డాబు సరిగా కనిపించే స్త్రీ ప్రతిరూపం అత్యంత సాదాసీదాగా మారిపోయింది. ఆడవాళ్ళ స్థానం 'అద్దం' ముందే అనే ధోరణి నుంచి బయటపడి సాదా సీదాగా ఉండే ఆధునిక మహిళ (లలితగారు, రజనిలా) గృహజీవితంలో, ప్రజా జీవితంలో చొరవగా వ్యవహరించే దిశకు మారింది. సంపాదన పరురాలు అవడానికి అవకాశాలు సృష్టించుకుంది. మగవారితో ధీటుగా బయట ప్రపంచంలోకి అడుగు పెట్టింది. ఇలా ఆధునిక మహిళ బయటి ప్రపంచంలోకి అడుగు పెట్టడంతో పాటే బోరోలిన్, లాక్మే తదితర చర్మ సౌందర్య సాధనాల కంపెనీలూ ఆధునిక మహిళ కొంగుపట్టుకు వచ్చేశాయి, అది వేరే సంగతి అనుకోండి.

**"వాణిజ్య ప్రకటనల రంగంలో 80 దశకంలోనే 'సర్ఫ్' కంపెనీ ప్రకటనలో 'లలితగారు' చురుకైన, తెలివైన గృహిణికి ప్రతిరూపంగా బుల్లితెరను ఓ ఊపు ఊపేసింది. మార్కెట్‌లోకి సరుకులు వెల్లువలా వచ్చి పడిపోతుంటే ఏది మంచో, ఏది చెడో ఇట్టే పసికట్టే తెలివైన మధ్యతరగతి గృహిణిగా చాలా కాలంపాటు అందరి మనస్సులో నిలిచిపోయిన ప్రకటన అది. 'చౌకగా' వస్తువులు, సరుకులు కొనాలకునే సగటు మనస్తత్వం మీద ఈ ప్రకటన పెద్ద యుద్ధమే చేసింది."**



ఎయిర్ టెల్ కొత్త యాడ్: ఆఫీసులో బాస్ అయినా ఇంట్లో భర్తకు వండి పెట్టాల్సిందే

ఈ ఆధునిక మహిళ 'ట్రెండ్' కేవలం టీవీల్లో వాణిజ్య ప్రకటనలకూ, సీరియల్స్‌కి మాత్రమే పరిమితం కాలేదు. ఆనాటి సినిమా రంగాన్నీ బాగానే ప్రభావితం చేసింది. హీరోయిన్ అంటే ఆట- పాటలకే పరిమితం కాకుండా సామాజిక – పౌర జీవితంలో కూడా క్రియాశీల భాగస్వామి అయ్యే ధోరణులతో చాలా సినిమాలే వచ్చాయి. బాసు చటర్జీ, బసు భట్టాచార్య, మృణాల్‌సేన్, హృషికేష్ ముఖర్జీ, శ్యాంబెనెగళ్, గుల్జార్, సాయ్ పరాంజపే వంటి ఉద్దండ దర్శకులు ఆధునిక మహిళకు సరికొత్త నిర్వచనం చూపించారు.

ఇప్పుడు అదంతా గత వైభవంగా మిగిలిపోయింది. సిన్మాలేంటీ, వాణిజ్య ప్రకటనలేంటీ వేటిని తెరచి చూసినా ఆడవాళ్ళను 'రసోద్దీప' ముడి సరుకుగా, అలంకార ప్రాయంగా తయారు చేసేసాయి. విదేశీ సరుకులకు మనం తలుపులు బార్లా తీసేసాక ఈ ధోరణులు మరింత పెచ్చరిల్లిపోయాయి. సరుకులు కూడా స్త్రీత్వం – మగటిమ విభాజకంతో రెండు గుట్టలుగా వచ్చిపడిపోతున్నాయి. ఆడవాళ్ళు దేన్లో అయినా విజయం సాధించాలంటే అది వారి శక్తి సామర్థ్యాలు, తెలివితేటల మీద కాకుండా వారి భౌతిక సౌందర్యం మీద ఆధారపడి ఉన్నాయని ఒప్పించే ధోరణి ప్రబలిపోయింది. ఫెయిర్ అండ్ లవ్లీ క్రీమ్‌లు, సన్ – స్క్రీన్‌లోషన్లు, గోళ్ల రంగులు, లిప్‌స్టిక్‌లు, షాంపూలు – ఇవీ ఇవాళ స్త్రీలకు 'మోక్ష' ప్రదాయినులు. ఫెయిర్ అండ్ లవ్లీ ప్రకటనలే తీసుకోండి – సంగీతం పంతులుగారి అమ్మాయి పెళ్ళి చూపులకు వచ్చిన అబ్బాయి ఆ అమ్మాయిని అంతగా ఇష్టపడడు. పంతులుగారూ – వాళ్ళమ్మాయీ ఇద్దరూ దిగులు పడిపోతారు. చివరికి పంతులుగారి అమ్మాయి ఫెయిర్ అండ్ లవ్లీవాడి 'చర్మ సౌందర్యాన్ని' మెరుగుపరుచుకుని అదే అబ్బాయిని ఆకట్టుకుని పెళ్ళికి సరే అనిపించడంతో పంతులుగారి దిగులు తీర్చేస్తుంది. అలాగే ఇంకో ప్రకటనలో వయసు మీద పడిన దంపతులు తమకి ఒక కొడుకు లేకపోయాడే ఉన్నది ఆడపిల్ల, తనూ ఇట్లా (నల్లగా) ఉందే అని దిగులు పడిపోతారు. అప్పుడా అమ్మాయి ఫెయిర్ అండ్ లవ్లీ వాడి ఎర్రగా బుర్రగా తయారయి ఎయిర్ హోస్టెస్ ఉద్యోగం సంపాదించి కొడుకు లేకపోయాడే అన్న తల్లిదండ్రుల దిగులు తీర్చేస్తుంది. ఏం పోగాలం వచ్చి పడింది? 'పైగా జన్మకుండలే మారిపోయింది' అనే ట్యాగ్ క్యాప్షన్ ఒకటి.

ఇప్పటిదాకా మనం పరిశీలించిన అంశాల్ని బట్టి అంచనాకు రావాల్సి వస్తే వాణిజ్య ప్రకటనలు కేవలం సరుకుల అమ్మకాలకే పరిమితం కాలేదు. అవి సరుకులతోపాటు ఒక జీవన విధానాన్ని (లైఫ్ స్టైల్)ను కూడా అమ్మే లక్ష్యంతో వస్తున్నాయని మనం అర్థం చేసుకో

**“ వాణిజ్య ప్రకటనలు కేవలం సరుకుల అమ్మకాలకే పరిమితం కాలేదు. అవి సరుకులతోపాటు ఒక జీవన విధానాన్ని (లైఫ్ స్టైల్)ను కూడా అమ్మే లక్ష్యంతో వస్తున్నాయని మనం అర్థం చేసుకోవచ్చు. నూతన ప్రపంచ క్రమాన్ని (న్యూ వరల్డ్ ఆర్డర్) మన మీద రుద్దడానికి ప్రయత్నిస్తున్నాయి. మన అభిప్రా యాలను, నడవడికను మన వేషభాషలను ఈ నూతన ప్రపంచ క్రమానికి అనువుగా మలిచేందుకు ప్రయత్నిస్తున్నాయి. ”**

వచ్చు. నూతన ప్రపంచ క్రమాన్ని (న్యూ వరల్డ్ ఆర్డర్) మన మీద రుద్దడానికి ప్రయత్నిస్తున్నాయి. మన అభిప్రాయాలను, నడవడికను మన వేషభాషలను ఈ నూతన ప్రపంచ క్రమానికి అనువుగా మలిచేందుకు ప్రయత్నిస్తున్నాయి. ఆధునికత పేరిట డాబుసరి జీవితం కోసం అంగలార్చేలా చేస్తున్నాయి. ఇదంతా బహుళజాతి కంపెనీల ప్రభావమే. మరి మన భారతీయ కంపెనీలు ఏం చేస్తున్నాయీ? బెంగుళూరు కేంద్రంగా హిమాలయ డ్రగ్ కంపెనీ అని ఒక దేశీ కంపెనీ ఆయుర్వేద సౌందర్య సాధనాలు (కాస్మోటిక్స్) ఉత్పత్తి చేసి అమ్ముతుంటుంది. నేటితరం పిల్లల మనసెరిగిన అమ్మమ్మతో దేశీయ సౌందర్య రహస్యాల గురించి విప్పి చెప్పే వాణిజ్య ప్రకటనలు విరివిగా జారీ చేస్తుంటుంది ఈ కంపెనీ. ఈ ప్రకటనల సారాంశం ఏమిటంటే – భారతదేశం గొప్ప సంస్కృతీ, సంపదల వారసత్వాన్ని కలిగి ఉంది. ఆధునికతను స్వంతం చేసుకోవడానికి వెనుకాడదు. అయితే ఈ ఆధునికతను గత కాలపు పురాతన స్వర్ణమయ సంప్రదాయ సంపదల నుండే స్వంతం చేసుకోవచ్చు. సభ్య ప్రపంచానికి కూడా ఈ సొబగులు అందివ్వడానికి భారతదేశం సిద్ధంగా ఉందని చాటి చెపుతుంది. ‘అన్నీ మన వేదాల్లో ఉన్నాయిష’ అదే టైపు సెంటిమెంటుతో కూడిన మార్కెటింగ్ వ్యూహం ఇది.

ఒకసారి మళ్ళీ మనం ‘సర్ఫ్’ వాణిజ్య ప్రకటన, ‘రజని’ సీరియల్‌ను పరిశీలిస్తే ఇందులో పురుష పాత్రకు అంతగా ప్రాధాన్యం లేదని మనం గమనించవచ్చు. ‘రజని’ సీరియల్‌లో ‘భర్త’ పాత్ర పోషించిన కరన్‌రజ్దాన్ కొంగుచాటు మొగుడుగా కనిపిస్తాడు. 1980వ దశకంలో వచ్చిన వాణిజ్య ప్రకటనలలో (ముఖ్యంగా గృహోపకరణాలు, సరుకులకు సంబంధించిన) మగ పాత్రలు లేకపోవడం మనం స్పష్టంగా గమనించవచ్చు. ఇందుకు ఒకటి అరా మినహాయింపులు ఉన్నాయనుకోండీ. ప్రెస్టీజ్ ప్రెషర్ కుక్కర్ వాణిజ్య ప్రకటన (భార్యను ప్రేమించే మగవాడు ప్రెస్టీజ్ పాత్రలను ఎలా నిరాకరించగలడు?) ఇలాంటి మినహాయింపు కిందకే వస్తుంది. బహుశా ఈ వాణిజ్య ప్రకటన తరువాతే ‘మంచి’ భర్త, ‘మంచి’ తండ్రి, ‘మంచి కొడుకు’ పాత్రలతో వినిమయ సరుకులను విభిన్నమైన రూపాల్లో మార్కెటింగ్ చేసే వాణిజ్య ప్రకటనలు వచ్చాయి. ఈ పాత్రలు ఇంటిపనులు, వంటపనులు సహా అన్నింటా ఆడవాళ్ళకు ధీటుగా పనిచేస్తూ కనిపిస్తాయి. మారికో ఇండియా వారి ‘నూడుల్స్’, ప్రోక్టర్ & గాంబిల్ వారి ఏరియల్, షాలిమార్ – యండిఎఫ్ మషాలా వంటి వాణిజ్య ప్రకటనలు ఈ కోవకే వస్తాయి. గ్లోబల్ పెట్టుబడిదారీ విధానం మన మీద రుద్దిన కొత్త ఆర్థికవ్యవస్థలో పితృస్వామిక భావజాలంలో కొంత సడలింపుకు ఈ రకంగా అవకాశం కల్పించింది. ఇదంతా స్త్రీలను ఉద్ధరిద్దామనే తలంపుతో చేసింది కాదు సుమా. వినిమయదారీ పెట్టుబడి పోగుబడాలన్నా, వినిమయదారీ సంస్కృతి అంగలు పంగలమీద విస్తరించాలన్న ‘జెండర్’ విభజనకు సంబంధించి ‘తటస్థత’ పాటించకపోతే ‘నష్టం’ వస్తుంది అనే సూత్రం మూలంగానే ఈ సడలింపును సర్దుబాటు చేసారు. ఏతావాతా కుటుంబ ఆదాయానికి వేణ్ణీళ్ళకు చన్నీళ్ళ తోడులా ఆడవాళ్ళు కూడా అంతో ఇంతో సంపాదించి పెట్టే క్రమంలోనే బాహ్య ప్రపంచంలోనే మహిళలకు గుర్తింపు ఇవ్వాలనే స్పృహ పెరిగింది.

అలాగే ఇవాళ వస్తున్న వాణిజ్య ప్రకటనలు ఆధునికత పేర మహిళల అంగాంగ ప్రదర్శనలకు, శృంగారానికి ప్రతీకలుగా చూపించడం వెనుక పితృస్వామిక సమాజంలో మహిళల స్థానం ఎక్కడో, ఏమిటో చెప్పకనే చెబుతున్నాయి. భారతీయ మహిళలను అంతర్జాతీయ మహిళ (గ్లోబల్ వుమన్)గా తీర్చిదిద్దడానికి పశ్చిమ దేశాలు సాంస్కృతికంగా ఎంచుకున్న మార్గం ఇది. ఆధునికతకు పశ్చిమదేశాల సంస్కృతికి మధ్య దూరం చెరిపేసి మన ఆడవాళ్ళ మనసుల్లో వారు ఏం ఇంకించదలుచుకున్నారో నేనిప్పుడు వేరేగా చెప్పనక్కర్లేదనుకుంటా... నా నమ్మకం ఏంటంటే – ఇవాళ చాలామంది ఆడవాళ్ళు ప్రగతిశీలంగా ఆలోచించగలుగుతున్నారు. ఏది మంచో, ఏది చెడో వివేచన చేయగలిగే సత్తా వారికి ఉంది.

ఒకప్పుడు ‘బిజ్’ వాషింగ్ పౌడరు, ‘తృప్తి ఫుడ్స్’ వంటి కంపెనీలు (రెండు ఉత్పత్తులూ భారతీయ కంపెనీలకు చెందినవే) ఆడవాళ్ళు ఉద్యోగార్థం బయటకి వెళ్ళినా ఇల్లు గడపడానికి ఏ లోటు రాకుండా చూసుకునేందుకే మా ఉత్పత్తులు ఉన్నాయి అని హామీ ఇస్తూ వాణిజ్య ప్రకటనలు గుప్పించాయి. ఇప్పుడు బహుళజాతి కంపెనీలేమో ఆడవాళ్ళు సంప్రదాయకంగా తమ పాత్ర పోషించడానికి ‘ఇంటా – బయటా’ పనుల భారాన్ని చక్కబెట్టుకోవడానికి తమ వాణిజ్య ఉత్పత్తులు సుకరంగా ఉంటాయని ఊరిస్తున్నాయి. తేడా ఏమన్న ఉందా వీటిల్లో?

పశ్చిమ దేశాల ‘ఆధునిక ధోరణుల’ పట్ల మన మీడియాలో ఊహాపోహాలు ఉన్నాయి. బహుశా ఇది వలసవాదం మిగిల్చిపోయిన అవశేషం కావచ్చునేమో. ఐతే ఈ ధోరణులు మన సంస్కృతికి గొడ్డలి పెట్టువంటివి అనో, కాకపోతే పరమాద్భుతమనో భావించే రెండు ధోరణులూ మన మీడియాలో ఉన్నాయి. 1980 – 90 దశకాల మధ్య గ్లాక్సో కంపెనీ ‘కాంప్లాన్’ వాణిజ్య ప్రకటనలలో అంతర్జాతీయ ఆటల పోటీల్లో నెగ్గిన ఏ ఈతగాడివో, పరుగు పందెం వాళ్ళనో చూపించి వారి ఆరోగ్యానికి, వారి గెలుపుకి ‘కాంప్లాన్’ తాగడమే కారణం అని చూపించేది. క్రమంగా ఈ విదేశీ ప్రతినిధుల స్థానంలో దేశీయ ప్రముఖులు చోటు చేసుకున్నారు. వినిమయదారీ ఆర్థిక వ్యవస్థలలో స్థానికతకు, ‘దేశీ పరిమళాలు అద్దడానికి కారణం ‘విదేశీ బ్రాండు’ అనే ముద్ర వదిలించుకోవడానికే. ‘విస్పర్’ కంపెనీ వాణిజ్య ప్రకటనలలో కూడా మీరు ఇదే ధోరణి గమనించవచ్చు. బహుళజాతి కంపెనీలు తమ ఉత్పత్తుల అమ్మకాల కోసం ‘వసుధైక కుటుంబాన్ని’ తీర్చిదిద్దుతున్నాయి.

ప్రపంచీకరణ, వినిమయదారీతత్వం, బహుళజాతి కంపెనీలు ఇవన్నీ కలిసి భారతీయ మార్కెట్లు గతంలో ‘అంటరానివి’గా భావించే విషయాల పట్ల అనురక్తిని పెంపొందించాయి.

ఐతే ఇదే తరుణంలో ప్రపంచీకరణ పడగ నీడన వ్యాపిస్తున్న సాంస్కృతిక సామ్రాజ్యవాదానికి ప్రతిఘటనా ఎదురవుతుంది. వాణిజ్య ప్రకటనలు టీవీ సీరియళ్ళు – వీటిలో ఎక్కడ అవకాశం దొరికితే అక్కడ పెళ్ళి, మాతృత్వం, కుటుంబం, స్త్రీత్వం, అందచందాలు – ఈ అంశాలన్నింటా తిరిగి సంప్రదాయ విలువలను చొప్పించేస్తున్నారు.

పరంపరా, కలశ్, కుటుంబ్, క్యోంకి సాస్‌బీ

**"ఒకప్పుడు 'బిజ్' వాషింగ్ పౌడరు, 'తృప్తి ఫుడ్స్' వంటి కంపెనీలు ఆడవాళ్ళు ఉద్యోగార్థం బయటకి వెళ్ళినా ఇల్లు గడపడానికి ఏ లోటు రాకుండా చూసుకునేందుకే మా ఉత్పత్తులు ఉన్నాయి అని హామీ ఇస్తూ వాణిజ్య ప్రకటనలు గుప్పించాయి. ఇప్పుడు బహుళజాతి కంపెనీలేమో ఆడవాళ్ళు సంప్రదాయకంగా తమ పాత్ర పోషించడానికి 'ఇంటా - బయటా' పనుల భారాన్ని చక్కబెట్టుకోవడానికి తమ వాణిజ్య ఉత్పత్తులు సుకరంగా ఉంటాయని ఊరిస్తున్నాయి. తేడా ఏమన్న ఉందా వీటిల్లో?"**




**డాల్డా వాణిజ్య ప్రకటన: మాతృ ప్రేమను కూడా వస్తువులతో కొలవాల్సిందే.**

కభీ బహుథీ (అత్తా ఒకప్పటి కోడలే) వంటి హిందీ సీరియల్స్ ఇందుకు ఉదాహరణలు. మన సంస్కృతిని, సంప్రదాయ విలువలను కాపాడే గురుతర బాధ్యతను భారతీయ మహిళల భుజస్కందాలపై మోపుతున్నారు. మగాళ్ళు మాత్రం 'స్వేచ్ఛ'గా ఆధునికతను, విదేశీ విలువలను ఒంటపట్టించుకుని కులాసాగా కాలం గడిపెయ్యవచ్చు. వాళ్ళకు ఉన్న ఒకే ఒక బాధ్యత ఏంటంటే – ఆడవాళ్ళు సంప్రదాయ భారతీయ విలువల కట్టుబాటు తప్పకుండా కాపలాకాయడం.

భూస్వామ్యకాలపు విలువలను సంప్రదాయం పేరిట మళ్ళీ మహిళల నెత్తిన రుద్దేందుకు పెద్ద ప్రయత్నలే జరుగుతున్నాయి. టీవీ సీరియళ్ళే కాదు, ప్రియా మషాలా, గోకుల్ శాండల్ పౌడర్, బిస్కెట్లు, చిరుతిళ్ళు, అభరణాలూ ఒకటేమిటి దాదాపు అన్ని వాణిజ్య ప్రకటనల్లోనూ ఇదే ధోరణి. అంతర్జాతీయ భారతీయ మహిళల (గ్లోబల్ ఇండియన్ వుమన్) గురించి అదరగొట్టిన మీడియనే ఇవాళ మళ్ళీ క్షీణ విలువలను మనమీద రుద్దేందుకు తహతహలాడుతుంది. 'క్యోంకి సాస్ భీ" సీరియల్‌లో కోడలికి గర్భస్థ లింగ నిర్ధారణ పరీక్ష చేయించి 'పుట్టేది మగపిల్లవాడని చెప్పించడం, ఇద్దరు నర్సులు నడిచి వస్తుంటే వరుసగా నిలబెట్టిన మోటారు సైకిళ్ళు ఒక్కొక్కటే హాండిల్‌ని పక్కకి తిప్పేసుకోవడం (మొహం తిప్పేసుకుంటున్నట్లు), ఒక మోటార్ సైకిల్ మాత్రం పక్కకి ఉన్న హాండిల్ వాళ్ళ వైపుకి తిరగడం, ఆ వెంటనే 'బజాజ్ పల్సర్, అసలైన మగాడు' అని గాత్రం వినిపించడం – ఇవన్నీ క్షీణ విలువలలో భాగమే.

పైకి ఇవన్నీ గ్లోబల్ సాంస్కృతిక సామ్రాజ్యవాదానికి జాతీయతకు మధ్య ఘర్షణ నెలకొన్న వాతావరణాన్ని స్ఫురిస్తుంటాయి. నిజానికి ఈ రెండూ శాంతియుత సహజీవనం చేస్తున్నాయి. ఘర్షణ అంటూ ఏదన్నా ఉంటే అది మార్కెట్లలో వాటా కోసమే తప్ప, మహిళలను ఉద్ధరించాలనే ఉద్దేశం వాటికే మాత్రం లేదు. ఈ రెండు వాదాలు మహిళలకు క్షీణ విలువలనే ఆపాదిస్తున్నాయి.


మీడియాలో 'జెండర్' విభజన ధోరణులలో దాగి ఉన్న మరో కోణం హిందూ జాతీయతావాదం. ప్రత్యేకించి వాణిజ్య ప్రకటనలో ఇది ప్రస్ఫుటంగా కనిపిస్తుంది. కులము, మతము, వర్గం – వీటికి అతీతంగా 'జెండర్'ను తటస్థ రూపంలో చూపిస్తున్నట్లు కనబడినా నిజానికి ఇది భారతదేశంలో ఉన్న వైవిధ్యతను, భిన్న జాతుల కులాల, మతాల సమాహారమన్న వాస్తవాన్ని కప్పిపెట్టడానికి చేసే ప్రయత్నమే. 'డోవ్' సబ్బును ఏ ముస్లిం మహిళో, ఏ దళిత – గిరిజన మహిళో వాడుతున్నట్లు చూపిస్తున్నారా? లేదు, అందుకు కారణం వీరు 'భవిష్య వినియోగదారీ సమూహం' కిందకి రారు అనేదేనా? కానేకాదు. హిందూ జాతీయ వాదాన్ని బలంగా ప్రతిష్టించే క్రమంలో 'అవాంఛిత' కులాలు, మతాలకు చెందిన వారిని 'అసుంటా' పెట్టే కార్యక్రమమే ఇది. 'హిందూ సాంస్కృతిక ఆర్థికవ్యవస్థ'లో వీళ్ళంతా కడగట్టున ఉండాల్సిన వాళ్ళు, అందుకే ఓ పథకం ప్రకారం మీడియాలో మనకు 'హిందూత్వ' ప్రతిరూపాల్నే చూపిస్తు న్నారు. అక్కడా ఇక్కడా పొరబాటున 'వేరే' వాళ్ళని చూపించాల్సి వచ్చినా వాళ్ళను మట్టి బుర్రలు గానో, చతుర్లాడేందుకు పనికొచ్చే పాత్రలుగానో చూపిస్తారు. క్వాలిటీ ఐస్‌క్రీంలో చూపించే క్రైస్తవ్'నన్' మనకు ఇందుకు ఒక ఉదాహరణ.

ఇక 'వర్గ' ప్రస్తావనకు వస్తే – మనకు కనబడేదంతా 'హైక్లాసు' వాళ్ళే. పొలంలోనో, ఫ్యాక్టరీల్లోను, చేతివృత్తులు, చిల్లరకొట్లు తదితర రంగాల్లో రెక్కలు ముక్కలు చేసుకుని కష్టించి పని చేసేవాళ్ళు ఎవరన్నా మనకు ఈ వాణిజ్య ప్రకటనలలో కనబడతారా? అథవా చూపించినా ఇంతకు ముందు మనం చెప్పుకున్నట్లే ఆటపట్టించడానికి పనికొచ్చేవాళ్ళుగా మాత్రమే కనబడతారు. సన్‌లైట్ డిటర్జెంట్ పౌడరు, యూరోక్లీన్ వాక్యూమ్ క్లీనర్ వంటి వాణిజ్య ప్రకటనలలో మీరీ ధోరణిని స్పష్టంగా గమనించవచ్చు.

ఏతావాతా మనకు అర్థం అయ్యేది ఏమిటంటే భారతీయ మహిళల వారసత్వం అంతర్జాతీయ భారతీయ మహిళ ప్రతిరూపంలో ఒదిగిపోయింది. ఆడవాళ్ళు అన్ని రంగాల్లో ఎంత ముందుకు పోయినా – ఇంటర్నెట్‌తో మగాళ్ళ కన్నా మెరుగ్గా విన్యాసాలు చేసినా (రీడిఫ్ మెయిల్, కోకకోలా), (బోలెరో) కారు నడిపినా, కరాటే పోటీలో మగ ప్రత్యర్థిని పడగొట్టినా (పాండ్స్ మాజిక్ డియోడరెంట్), డాక్టరుగా వృత్తిధర్మం నిర్వహిస్తున్న (పార్క్ ్స, లైజాల్, సారిడాన్) ఇంటిపని, వంటపని చక్కబెట్టే బాధ్యతను మరిచిపోకుండా మరీ మరీ గుర్తు చేస్తుంటారు. ఇంతేనా అసలు మొత్తం సమాజాన్నే 'తప్పుడు ప్రతినిధిత్వం'తో తప్పుదోవ పట్టిస్తున్నారు. స్త్రీ విముక్తి, స్త్రీ స్వేచ్ఛ వంటి విశాలమైన ఉదార భావనలను గొప్పింటి సంబరాలకు సమానార్థకంగా మార్చేస్తున్నారు. ఒక ఊహా ప్రపంచాన్ని మనముందు సృష్టిస్తున్నారు. నేల బారు వాస్తవాలను గమనించకుండా ఈ ఊహా ప్రపంచాన్ని అందుకోవాలంటే ఎవరైనా నేల విడిచి సాము చెయ్యాల్సిందే. ఊరిస్తున్న ఈ కలల, కోర్కెల ప్రపంచంలోనే మహిళలు తమంతట తామే ఇవాళ దిశా నిర్దేశం చేసుకుంటున్నారు. పరుగులు తీస్తున్న ఈ పోటీ ప్రపంచంతో పోటీ పడి మరీ అన్ని రంగాల్లో ముందుకు దూసుకువస్తున్నారు. జెండర్ వివక్షతో కూడిన పితృస్వామిక అధిపత్య ధోరణులను, ప్రపంచీకరణ మాటున వెర్రితలలు వేస్తున్న వినిమయదారీ ధోరణులను దాటుకుని మహిళలు తమ భవిష్యత్తును తామే తీర్చిదిద్దుకోగలరన్న విశ్వాసం నాకు ఉంది. •

**మతతత్వం**

# గుజరాత్‌లో విద్యార్ధులపై కాషాయ సేన ప్రయోగాలు




**అనుపమ కటకం**

"ప్రొఫెసర్స్ అనే వారు భోదించే వారు లేదా ఉపన్యచించేవారు, కాని ఆచార్యులు అనే వారు ఆచరించి చూపేవారు. ఈ ప్రొఫెసర్స్ అనే పదం బ్రిటీష్ వారి నుండి మనకి సంక్రమించింది. కాబట్టి అటువంటి పదజాలాన్ని విసర్జించి కేవలం "ఆచార్యులు" అనే సంభోధించాలి.

– పాఠం 'శిక్షణ్ ను భారతీకరణ్' పేజి నెం: 40

దిలీప్ అనే రాజుకి పిల్లలు లేరు. ఆయన వశిష్ట మహాముని ఆశ్రమానికి వెళ్ళి ఆయన ఆశీస్సులు కోరగా వశిష్ఠుడు ఆయన కోరిక నెరవేరాలంటే గోవులను పూజించాలనీ, వాటిని జాగ్రత్తగా చూసుకోవాలనీ శెలవిచ్చాడు. ఒక రోజు ఒక సింహం ఆవును చంపటానికి దాడి చేయబోగా, దిలీపుడు ఆ సింహంతో నన్ను తినేసి ఆ ఆవును వదిలివేయమని వేడుకున్నాడు. రాజుగారి అకుంఠిత దీక్ష ఫలించి అచిర కాలంలోనే ఆయనకు అనేక మంది పిల్లలు కలిగారు.

– పాఠం 'ప్రేర్నదీప్'–3, పేజి. 39.

భారతదేశం నుండి చికాగో వెళుతున్న విమానం సముద్రమట్టానికి కొన్ని వేల అడుగులు ఎగురుతుండగా ఒక నీగ్రో జాతీ యుడు ఆ విమానం తలుపు తీయటానికి ప్రయ త్నించగా ఒక భారతీయుడు అతనిని పట్టుకొని దున్నపోతుని కట్టేసినట్లు కట్టివేసి, వందల మంది ప్రయాణీకుల ప్రాణాలు కాపాడాడు. ఆ తర్వాత విమానం చికాగోకి క్షేమంగా చేరింది. ఆ నీగ్రో జాతీయుడు ఒక కరుడుగట్టిన నేరస్థుడు కాగా, ఆ ధైర్యశాలి అయిన భారతీయుడు ఎయిర్ ఇండియా ఉద్యోగి.

– "ధైర్యశాలి గురుదేవ్ సింగ్" పుస్తకంలో ఒక కథ. పేజి. నెం: 3

ఈ రోజు ఏదైతే మనం మోటారు కారు అని పిలుచుకుంటున్నామో అది వేదాల కాలంలోనే జనించింది. దాన్ని అనుష్వరథం అనే వారు. సాధారణంగా ఏ రథమైనా గుర్రాలచే నడపబడుతుంది. కాని అనుష్వరథం అంటేనే గుర్రాలు లేకుండా నడిచే రథం లేదా యంత్ర రథం అని అర్ధం. అదే ఈ రోజు పిలవబడుతున్న మోటార్ కార్. రుగ్వేదంలో ఇది వివరించబడింది.

– పాఠం 'తేజోమయి భారత్', పేజి. 60)

"భారతదేశంలో విద్య అనేది నిజమైన విద్య కాదు, భారతీయం కాదు. అసలు విద్యకీ, ఈ దేశంలోని భూమికీ ఎటువంటి సంబంధం లేదు. కారల్‌మార్క్స్, మెక్‌కాలే వంటి వారి మాయాజాల పదాల వలన నేడు యువతరం దశా, దిశా లేకుండా పొగరుబోతులుగా, మూర్ఖులుగా తయారయ్యారు."

– శిక్షణ్ ను భారతీయకరణ్

ఇవన్నీ గుజరాత్ రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ముద్రించిన పాఠ్యపుస్తకాలలో కనిపించే మచ్చుకి కొన్ని రాదాహరణలు.

భారతీయ జానపద సాహిత్యంలో పశువుల ఆరాధన, ఋషులు, భవిష్యత్ దార్శినికుల పాఠాలు, దేవతలు, దయ్యాల పాత్రలు పరంపరగా వస్తూనే ఉన్నాయి. కాని ఆందోళనకరమైన అంశం ఏమిటంటే, ఈ పాఠ్యపుస్తకాలలోని సారాంశం ఒక నిర్ధిష్టమైన ప్రయోజనం కోసం వక్రీకరించబడి ఉండటమే. వీటికి అదనంగా అనేక చాప్టర్ల నిండా రాజకీయ అసత్యాలు, ఆధిపత్య ధోరణి పదాలు, జాత్యాహంకార వ్యాఖ్యలు, పనికిమాలిన వ్యక్తిగత కథాంశాలు, తప్పుడు సిద్ధాంతాలు గుప్పించబడ్డాయి.

భారతీయ సంస్కృతి, హిందూ నియమ నిబంధనలు గురించి వివరించే తొమ్మిది రకాల పుస్తకాలను గుజరాత్ ప్రభుత్వం అదనపు పాఠ్యాంశాలుగా రాష్ట్రంలోని 40 వేల ప్రాథమిక, సెకండరీ పాఠశాలలలో పంపిణీ చేయటానికి పూనుకుంది. ఈ తొమ్మిది పుస్తకాలలో ఎనిమిదింటిని రచించింది "దీనానాద్ బాత్రా" అనే ఆయన. ఆయన రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్‌లో దీర్ఘకాలంగా పని చేస్తున్న వ్యక్తి. 'శిక్షా బచావో ఆందోళన్ సమితి' అనే సంస్థ నిర్వాహకుడుగా ఉన్నాడు. పుస్తకాలలో ఏ అంశాలు ఉండాలి అని నిర్ధేశించడం, తమకు ఇష్టం లేని అంశాలను పుస్తకాలలో తొలగించాలని ప్రచారం చేయడం, హిందూత్వతో కూడుని లేని పదాలు, పేరాలు తొలగించటం వంటి కార్యకలాపాలలో ఆయనకి పెట్టింది పేరు. ఈ సంవత్సరం మొదటి భాగంలో ప్రముఖ రచయిత వెండీ డోనిగర్ పుస్తకం "ది హిందూస్, ఒక ప్రత్యామ్నాయ చరిత్ర" పెంగ్విన్ ఇండియా ప్రచురణను ఆపివేయటంలో బాత్రా, ఆయన అనుచరులు ప్రధాన పాత్ర పోషించారు. కారణం ఆ పుస్తకం హిందూ మతాన్ని అగౌరవపరిచేలా ఉందంట.

ఈ తొమ్మిది పుస్తకాలపై స్పందనలు భిన్నంగా వచ్చాయి. మతవాద శక్తులు వీటిలో ఎటువంటి తప్పు జరగలేదని పేర్కొనగా, అభ్యుదయవాదులు ఈ పుస్తకాలలో అన్ని తప్పులే రాన్నాయని ప్రకటించారు. అయినా ఈ పుస్తకాల పంపిణీ యథావిధిగా కొనసాగింది. కాషాయవాదుల అనాగరిక సంస్కృతి మరొకసారి జూలు విదిల్చింది. ఒక రకమైన పాక్షిక దృక్పథం కలిగిన కొంత మంది వ్యక్తులు లేదా సమూహాలు అనేక సందర్భాలలో ఇటువంటి చర్యలతో మతోన్మాదాన్ని పెంచుతూ వినాశనకరమైన పరిస్థితులు కల్పిస్తున్నారు.

ఈ పుస్తక పంపిణీ అవసరం, ఉపయోగం గురించి రాష్ట్ర అధికార వర్గానికి ఎటువంటి స్పష్టతా లేదు. "ఈ పుస్తకాన్ని ముద్రించి, పంపిణీ

చేయమని మాకు పై నుండి ఆర్డర్లు వచ్చాయి. ఇవి పాఠ్యప్రణాళికలో భాగం కాదు కానీ అన్ని లైబ్రరీలలో ఉంచేందుకు తెచ్చాము" అనిఒక అధికారి పేర్కొన్నారు.

విచారకరమైన అంశం ఏమిటంటే, గుజరాతీయులు సాంప్రదాయబద్ధులే గానీ, ఛాందసవాదులు కారు. పాశ్చాత్య సంస్కృతిలో తమకు అవసరమయ్యే వాటన్నింటినీ అక్కున చేర్చుకుంటారు. అయినా వారు మత విశ్వాసాలు మెండుగా ఉన్నవారు కాబట్టి కాషాయదళాల ఎజెండాకి ఇంచుమించుగా అందరూ అంగీకరించారు. ఇతర ప్రాంతాలకూ, దేశాలకూ విపరీతంగా వలసల వెళుతుండడం వలన గుజరాతీయులు ఇతర సంస్కృతులకు కూడా అనుభవిస్తారు. అందువలన ఒక వైపు మత విశ్వాసాల గ్రంథాలను అందచేయటం, మరోప్రక్క చిత్ర విచిత్రవాదనలు, నమ్మకాలతో కూడిన పుస్తకాలను ఈ సమూహాలకు అందచేయటం ఛాంధసవాదుల వ్యూహం అని ఒక పరిశీలకుడు పేర్కొన్నారు.

### బాత్రా పుస్తకాలు

2007లో తన పుస్తకాలను ముద్రించినపుడు గుజరాత్ రాష్ట్ర పాఠశాల బోర్డు వాటిని పరిశీలించి, మెచ్చుకుందని బాత్రా తెలిపారు. పాఠశాల పాఠ్యాంశాలుగా వాటిని అనువాదం చేసి ఇవ్వమని పాఠశాల బోర్డు బాత్రాని కోరిందట. తనకూ, బోర్డుకూ ఈ విషయంలో ఎటువంటి ఆర్థిక లావాదేవీలూ జరగలేదని పేర్కొన్నారు. ఇంతకంటే ఆందోళనకరమైనది, అయినా ఆశ్చర్యపోవాల్సిన అవసరం లేనిది ఏమిటంటే, అప్పటి రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ నరేంద్రమోడీగారు వీటిని ఆమోదించటమేకాక ప్రతి పుస్తకంలో తన సందేశాలను రాసి మరీ ముద్రింపచేశారు.

అలా ముద్రించిన పుస్తకాలు 1. విద్యాలయ, 2. ప్రవృత్తియాన్ ను ఘర్, 3. శిక్షాన్ మా త్రివేణి, 4. ప్రేర్నదీప్ నాలుగా భాగాలు 5. శిక్షాన్ ను భారతీయకరణ్, 6. వేదిక్ మాథమెటిక్స్, 7. తేజోమయి భారత్. అధికారిక సమాచారం ప్రకారం ప్రతి పుస్తకం 50 వేల కాపీలు ముద్రించబడి, పంపిణీ చేయబడ్డాయి.

ఈ పుస్తకాలన్నీ హిందీ నుంచి గుజరాతీకి అనువాదం చేయబడ్డాయి. ఫ్రంట్‌లైన్ పత్రిక ఈ పుస్తకాల గుజరాతీ అనువాద కాపీలను సంపాదించగలిగింది. మీడియా కోసం వీటిని ఆంగ్లభాషలో కుదించి వ్రాసి ప్రచురించారు. వీటిని పరిశీలించిన తరువాత చాలా స్పష్టంగా అర్థమయ్యింది ఏమిటంటే, బాత్రాగారు తన సొంత పైత్యాన్ని అన్ని సబ్జెక్టులలో కుమ్మరించారు. సైన్స్, సాహిత్యం, చరిత్ర, గణితశాస్త్రం, భూగోళశాస్త్రాల్లో తన వాదనలు చొప్పించారు.

**“ విద్యారంగంలో ఆధునీకరణ అంటే పాశ్చాత్యీకరణకాదు, భారతీయత ఉండాలని బాత్రా తెలిపారు. మన దేశంలోని విద్యావ్యవస్థ దుస్థితికి కమ్యూనిస్టులు, తూర్పు దేశాల వారే కారణ మని దూషించారు. ఆంగ్ల భాష విద్యా వ్యవస్థ "హిందు" అనే పదజాలాన్ని ఛండాలంగా చూపించిందనీ, కారల్‌మార్క్స్ పుత్రులూ, మెకాలే వంటివారూ మన పురాతన పదజాలంతో ఆటలాడి, అనేక వక్రీకరణలతో, తేడాలతో మొత్తం చరిత్రకే తీరని గాయం చేశారని ఆరోపించారు. ”**



దీనానాథ్ బాత్రా

ప్రేర్నదీప్ పేరుతో వచ్చిన 4 పుస్తకాలు మొత్తం వ్యక్తిగత కథల సమాహారం. ఇందులోనే రాజుగారు పిల్లలు పుట్టడం కోసం గోవులను పూజించటం (గో సేవ) కథలు ఉన్నాయి. ప్రేర్నదీప్‌లో డా॥ సర్వేపల్లి రాధాకృష్ణన్‌గారి సంభాషణలుగా పేర్కొంటూ వ్యాఖ్యానాలు ఉన్నాయి. సర్వేపల్లిగారు బ్రిటీష్‌వారితో మాట్లాడుతూ "భారతీయులు దేవుడు వండిన అద్భుతమైన రోటీలు(చపాతీలు)అని, బ్రిటీష్ వారు సగం వండిన రోటీలు అనీ, ఆఫ్రికన్లు అతిగా వండిన రోటీల వంటివారు" అని పేర్కొన్నారని రాశారు.

ప్రేర్నదీప్‌లో స్వామి వివేకానంద మీద కూడా ఒక కథనాన్ని గుప్పించారు. ఒక సారి పాశ్చాత్య దేశస్తుడు స్వామి వివేకానందతో మాట్లాడుతూ మీరు భారతీయ దుస్తులనే వాడాలని ప్రచారం చూస్తూ, కాళ్ళకు మాత్రం విదేశీ చెప్పులు ఎందుకు వేసుకున్నారని ప్రశ్నించాడు? అప్పుడు స్వామి, మా దేశంలో విదేశీయులకు స్థానం ఇక్కడే (తన చెప్పులను చూపిస్తూ). అందుకే నేను చెప్పులు ధరించి వారికి సంకేతమిస్తున్నాను అని అన్నారట.

శిక్షాన్ ను భారతీయకరణ్ అను పుస్తకంలో బాత్రా గారు విద్యా వ్యవస్థ మీద తన భావాలను వెళ్ళగక్కారు. విద్యారంగంలో ఆధునీకరణ అంటే పాశ్చాత్యీకరణకాదు, భారతీయత ఉండాలని తెలిపారు. మన దేశంలోని విద్యావ్యవస్థ దుస్థితికి కమ్యూనిస్టులు, తూర్పు దేశాల వారే కారణమని దూషించారు. ఆంగ్ల భాష విద్యా వ్యవస్థ "హిందు" అనే పదజాలాన్ని ఛండాలంగా చూపించిందనీ, కారల్‌మార్క్స్ పుత్రులూ, మెక్‌కాలే వంటివారూ మన పురాతన పదజాలంతో ఆటలాడి, అనేక వక్రీకరణలతో, తేడాలతో మొత్తం చరిత్రకే తీరని గాయం చేశారని ఆరోపించారు.

శిక్షాన్ మా త్రివేణి అనే పుస్తకంలో బాత్రా గారు ఉపదేశమిస్తూ, సరైన భారతీయ సంస్కృతి అలవడాలంటే, యువత తప్పనిసరిగా రోజూ రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘం శాఖా సమావేశాలకు హాజరవటమే పరిష్కారమని శెలవిచ్చారు. మంచి స్నేహితుల సమూహం ఉంటే సరిపోదు. ఎటువంటి అవలక్షణాలు లేని వారు అవ్వాలంటే తప్పనిసరిగా స్వామీజీలు, గురూజీలవంటి వారి సాన్నిహిత్యం ఉండాలని తెలిపారు. రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘం శాఖలకు వెళ్ళే ప్రతి విద్యార్థిలోనూ అద్భుతమైన మార్పులు చోటు చేసుకుంటాయని ఉపదేశించారు.

సైన్స్‌పై ఆయన రాసిన ఆణిముత్యాలకి కొన్ని ఉదంతాలు: రాముడు ఉపయోగించిన పుష్పక విమానం, ప్రపంచంలోనే మనిషి ఉపయోగించిన మొట్టమొదటి విమానం. వేద గణితశాస్త్రం మాత్రమే అసలైన గణితశాస్త్రమని, దానిని మాత్రమే తప్పనిసరిగా పాఠశాలలలో భోదించాలని శెలవిచ్చారు. పురాతన కాలంలో నాన్న ఋషులే మన శాస్త్రవేత్తలనీ, వారు ఆనాడు జీవ రసాయనశాస్త్రాలూ, వైద్యం, టెక్నాలజీలో కనుగొన్న అంశాలనే ఈనాడు పాశ్చాత్య దేశాలన్నీ అనుకరిస్తున్నాయని పేర్కొన్నాడు.

అంతేకాదు, బాత్రాగారు నైతికంగా రాజకీయంగా ఇచ్చిన సలహా ఏమిటంటే,

> **"సైన్స్‌పై బాత్రా రాసిన ఆణిముత్యాలకి కొన్ని ఉదంతాలు: రాముడు ఉపయోగించిన పుష్పక విమానం, ప్రపంచంలోనే మనిషి ఉపయోగించిన మొట్టమొదటి విమానం. వేద గణితశాస్త్రం మాత్రమే అసలైన గణితశాస్త్రమని, దానిని మాత్రమే తప్పనిసరిగా పాఠశాలలలో భోదించాలని శెలవిచ్చారు. పురాతన కాలంలో వాన్న ఋషులే మన శాస్త్రవేత్తలనీ, వారు ఆనాడు జీవ రసాయన శాస్త్రాలూ, వైద్యం, టెక్నాలజీలో కనుగొన్న అంశాలనే ఈనాడు పాశ్చాత్య దేశాలన్నీ అనుకరిస్తున్నాయని పేర్కొన్నాడు."**

భారతదేశ చిత్ర పటాన్ని చుట్టప్రక్కల ఉన్న దేశాలతో కలిపి పునర్‌చిత్రీకరించాలని డిమాండ్ చేశారు. ఆర్.ఎస్.ఎస్ చెప్పే 'అఖండ్ భారత్' ఇదే. పుట్టిన రోజు వేడుకలలో వాడే క్యాండిల్స్, కేక్‌లు మన సంస్కృతి కాదనీ, వాటిని పూర్తిగా తొలగించాలని శెలవిచ్చారు.

తేజోమయి భారత్ పుస్తకం బాత్రాగారు రాసిందికాదు. కానీ శాస్త్ర విజ్ఞానంపై అందులో రాసినవి బాత్రాగారి రచనలను మించిపోయాయి. పేజి నెం: 92-93లో ఇలా వ్రాశారు: కుంతీదేవికి సూర్యునితో సమానుడైన కుమారుడు జన్మించాడు. రెండు సంవత్సరాలుగా గర్భం దాల్చలేకపోయిన గాంధారీదేవి, ఈ వార్తవిని, గర్భస్రావానికి పాల్పడింది. ఈమె ఉదరము లోంచి ఒక పెద్ద మాంసపు ముద్ద బయట పడింది(ఋషి). ద్వైపాయన వ్యాసుడు అనే ఆయన దీనిని గమనించి మాంసపు ముద్దను శీతల భాండాగారంలో కొన్ని రకాలైన ఔషదాలు ఉపయోగించి భద్రపరిచాడు. ఆ తరువాత దానిని వంద భాగాలుగా చేసి ఒక్కొక్క దానినీ ఒక్కొక్క పాత్రలో నిండుగా నెయ్యి పోసి రెండు సంవత్సరాలు భద్రపరిచాడు. రెండు సంవత్సరాల తరువాత వంద మంది కౌరవులు జన్మించారట. వీర్య కణాల పరిశోధన అనేది కొన్ని వేల సంవత్సరాల క్రిందటే కనుగొనబడిందని దాని సారాంశం.

జాతీయ అవార్డు గ్రాహీత అయిన చరిత్రకారుడు డోనిగర్‌ను కూడా బాత్రాగారు వదలలేదు. భారతీయ చరిత్రనంతా ఆయన వక్రీకరించి రాశారని విమర్శించారు. కాని దేశంలోని చరిత్రకారులందరూ అటువంటి వక్రీకరణలన్నింటినీ బాత్రాగారే చేస్తున్నారని తిప్పికొట్టారు.

ఈ పుస్తకాలన్నీ ప్రచురణ జరిగి విడుదలయినపుడు, ప్రముఖ చరిత్రకారుడు ఇర్ఫాన్ హబీబ్ మీడియాతో మాట్లాడారు. ఈ పుస్తకాలలో సారాంశం ఎంత పనికిమాలిందిగా ఉందంటే, వాటి గురించి మాట్లాడటం కూడా అనవసరం అన్నారు. భౌగోళికశాస్త్రాన్ని అభూతకల్పనలతో నింపిన వాళ్ళు, పిల్లలకు ఏమి భోదిస్తారో అర్థం కాకుండా ఉంది. గుజరాత్‌కు చెందిన మరొక చరిత్రకారుడు ఈ పుస్తకాలు తిరోగామి దిశలో వాండటమే కాదు, ఇవి లేత మనసులపై చాలా దుష్ప్రభావాన్ని కలిగించే రీతిలో ఉన్నాయని పేర్కొన్నారు.

విద్యారంగ ప్రపంచంలోకి బాత్రా తన పాఠ్యపుస్తకాల ద్వారా పెద్ద అడుగే వేశారు. ఈ మధ్యకాలం వరకు ఎన్.సి.ఈ.ఆర్.టిపై బాత్రా పెద్ద యుద్ధమే జరిపారు. అనేక పాఠ్యాంశాలలోని అభ్యంతరకర వ్యాఖ్యలను ఉపసంహరించాల్సిందిగా పోరాడారు. న్యాయపోరాటాలకు కూడా తెరతీసి, దాదాపు పది కేసులతో NCRT పై యుద్ధం చేశారడు. సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ మీద కూడా పోరాడాడు. మొత్తం జదీూజు సిలబస్‌నే ప్రక్షాళన చేయాలనీ, ఒక కొత్త ప్రణాళికను కూడా రూపొందించాడు. ఇందులో ముఖ్యమైనవి విదేశీ భాషల భోదనలను రద్దు చేయటం, 6వ తరగతి నుండి 8వ తరగతి వరకు సంస్కృతం తప్పనిసరి చేయటం, కాల్ సెంటర్ ఒకటి ప్రారంభించి అందులో విద్యార్థులకు సంస్కృతి, విలువలు, జాతీయత అంశాలను బోధించాలని సూచించారు. NCRT హిందీ పుస్తకాలలో ఉన్న ఉర్ధూ, ఆంగ్ల పదాలను తొలగించటం, జదీూజు బోర్డు ఇతర దేశాలతో ఎటువంటి ఒప్పందాలు చేసుకోకుండా ఉంచటం మరియు మొత్తం జదీూజు సిలబస్‌ను భారతీయ విలువలతో బోధించేదిగా పేరుతో మార్చివేయడం.

ఈ ప్రచారోద్యమపు ఉద్దేశమేమిటని మీడియా ఆయనను ప్రశ్నించగా "భిన్నత్వంలో ఏకత్వం"అనే భారతీయ భావజాలానికి తను కంకణం కట్టుకున్నాననీ, అందుకనే విద్యారంగంలో భారతీయత కావాలని పోరాడుతున్నాననీ ప్రకటించాడు.

ఢిల్లీ యూనివర్సిటీ చరిత్ర సిలబస్ ఆధారంగా ప్రొఫెసర్ ఏ.కె.రామానుజం రామాయణం మీద రచించిన ప్రముఖ వ్యాస సంపుటి, అందులో రామాయణంలో సాంస్కృతికపరంగా స్పష్టంగా కనిపించే అనేక రుపాల గురించి వర్ణించిన దానిపై బాత్రాగారు ఢిల్లీ హైకోర్టుకు వెళ్ళి ఆ వ్యాస సంపుటి తొలగించాలని కేసు వేటం ద్వారా ఆయన పేరు దేశవ్యాప్తంగా మారుమ్రోగింది. ఆ సమయంలో మాజీ ప్రధానమంత్రి డాక్టర్ మన్మోహన్‌సింగ్ కుమార్తె ప్రొఫెసర్ ఉవేందర్ సింగ్ ఈ సిలబస్ రూపకర్తగా ఉన్నారు. ఆవిడ తన ప్రకటనలో తన చరిత్ర విభాగం ఈ సిలబస్‌ను తయారు చేసినపుడు అనేక విషపూరితమైన, వ్యక్తిగత దూషణలు, లీగల్ నోటీసులు బెదిరింపులు ఎదుర్కొన్నామని, ఇవన్నీ విద్యా ప్రణాలికకు కీడు చేస్తాయని తెలిపారు.

భారతీయ సంస్కృతిలో బాత్రాలాంటి ఏకపక్ష, వివక్షతో పని చేసే వారందరు ఎలా మనగలుగుతున్నారన్నది శోచించవలసిన విషయం. మితవాద ప్రభుత్వాలు ఏర్పడిన తర్వాత బాత్రాలాంటి స్వీయ ప్రకటిత హిందూ మత రక్షకులకు మరింత ధైర్యం పెరిగింది. ఆయనకూ, ఆయనలాంటి వారికీ ప్రస్తుత ప్రభుత్వము మద్ధతుగా నిలబడుతుందనటంలో ఎటువంటి సందేహం లేదు. నరేంద్రమోడీ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు బాత్రా పుస్తకాలకు సమ్మతినిచ్చిన సంగతి గుర్తుంచుకోవాలి.

ఈ మధ్యకాలంలో విద్యావేత్తలు, రచయితలు, సినీ నిర్మాతలు, చరిత్రకారుల మీద జరిగిన దాడులు గమనిస్తే మితవాదుల మద్ధతుతోనే ఇవి జరిగాయని ప్రస్ఫుటంగా తెలుస్తుంది. పౌరసమాజంలోని అన్ని వర్గాల నుంచి వీటికి వ్యతిరేకంగా ఉవ్వెత్తున ఉద్యమాలు లేస్తే తప్ప, మరీ ముఖ్యంగా విద్యావేత్తల నుండి, మేధావుల నుండి ఇది జరగకపోతే, భవిష్యత్తు చాలా అగమ్యగోచరంగాను, అంధకారబంధురంగాను మారబోతోంది.

గతంలో ఇటువంటి ఛాందస భావజాల ఉద్యమాలు ప్రజ్వరిల్లినప్పుడు వాటిని అణచివేసే ప్రయత్నం జరగలేదు కాబట్టే ఈ రోజుకీ బాత్రాలాంటి వారు సమాజానికి కీడు చేయగలుగుతున్నారని చరిత్రకారులు గుర్తు చేస్తున్నారు. దురదృష్టవశాత్తు ప్రతిసారి ఇటువంటి బాధితులు ఆత్మరక్షణలో పడి అంతిమంగా ఈ ఛాందసవాదుల దాడులకు లొంగిపోయే ప్రమాదం, పరిస్థితి కలుగుతూ ఉంటాయి.

**(ఫ్రంట్‌లైన్ నుండి అనువాదం: ఎల్.ఎస్.భారవి)**

**ఆర్థిక రంగం**

# ప్రణాళికా విధానానికి మంగళం పాడిన మోడీ



రచయిత న్యూఢిల్లీలోని సెంటర్ ఫర్ ఎకనామిక్ స్టడీస్ అండ్ ప్లానింగ్ ప్రొఫెసర్. ఆర్థిక వ్యవహారాలపై విస్తృతంగా రాస్తారు

**సిపి చంద్రశేఖర్**

మారిన పరిస్థితులకు అనుగుణంగా ప్రణాళికాసంఘాన్ని బలపరచటం, విస్తరించటం కాకుండా ప్రధాని నరేంద్ర మోడీ దాన్ని పూర్తిగా రద్దుచేశారు. దీనిద్వారా ఆయన సరళీ కరణ విధానాలకు ఏ చిన్న అడ్డంకిని కూడా తాను సహించబోనన్న సందేశాన్ని పంపించారు.

ప్రధానమంత్రి నరేంద్రమోడీ స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగంలో ప్రణాళికాసంఘాన్ని రద్దు చేస్తానని ప్రకటించటం ద్వారా అనేక సందేశాల్ని పంపారు. వాటిలో ఒకటి, జవహర్‌లాల్ నెహ్రూ నాయకత్వంలోని తొలి కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరించిన ఆర్థిక విధానాల నుండి విడగొట్టు కుంటున్నానని స్పష్టం చేశారు. దేశాభివృద్ధికోసం కృషిచేసిన వారిలో ఒకరిగా కూడా నెహ్రూను ఆయన గుర్తించటం లేదు. రెండవది, ప్రభుత్వ పాత్రను పరిమితం చేసి 'కనీసస్థాయిలో ప్రభుత్వం, అత్యధికంగా పరిపాలన' అనే విధానాల్ని అమలు చేయటానికి పూనుకుంటున్నట్లు తెలిపారు. ఈ విధానంలో మార్కెట్ల ప్రాముఖ్యత పెరుగుతుంది. పారిశ్రామికరంగ జంతుప్రవృత్తి ఆధిపత్యం వహిస్తుంది. మూడవది, తాను పాత సంస్థలను సంస్కరించటం, నవీకరించటంతోనే సంతృప్తి చెందకుండా, కొత్త సంస్థల్ని నిర్మించటానికి పూనుకుంటానని చెప్పారు. వీటిలో మూడవ అంశం ప్రధానమైనది. నెహ్రూ నాయకత్వంలో ఆర్థికాభివృద్ధికి కీలకపాత్ర వహించిన ప్రణాళికాసంఘాన్ని పక్కన పెట్టటం కాకుండా దాన్ని పూర్తిగా రద్దుచేశారు.

తన ప్రభుత్వం ఆర్థికాభివృద్ధిలో నిర్వహించబోయే పాత్ర ఏమిటో ఆయన స్పష్టం చేయలేదు. పెట్టుబడిదారీ విధానంలో ఆర్థికాభివృద్ధిలో ప్రభుత్వం పాత్ర ఉండదంటే అమాయకులు మాత్రమే నమ్ముతారు. వాస్తవంలో ప్రభుత్వ పాత్ర అనేక రకాలుగా ఉండవచ్చు. ఉదాహరణకు పెట్టుబడిదారీ విధానానికి అత్యవసరమైన మౌలిక సదుపాయాల నిర్మాణానికి అవసరమైన పెట్టుబడులు, సాంకేతిక నైపుణ్యం తదితరాలు ప్రైవేటు రంగానికి లేకపోవటంతో ప్రభుత్వమే వాటి నిర్మాణానికి పూనుకోవచ్చు. ప్రైవేటురంగం నిర్ణయాత్మకం కావటంతో పెరుగుతున్న అసమానతలు, మార్కెట్ల వైఫల్యం ఫలితంగా వస్తున్న సమస్యల పరిష్కారానికి కృషి చేయవచ్చు. అన్నింటికన్నా లాభాలే పరమావధిగా కార్మికుల్నీ, వినియోగదారుల్నీ దోచుకుంటూ, పర్యావరణానికి హాని కలిగించే విధంగా ప్రైవేటురంగం తీసుకుంటున్న నిర్ణయాల్ని క్రమబద్ధీకరించటానికి ప్రయత్నం చేయవచ్చు. ప్రైవేటురంగ పెట్టుబడుల నిర్ణయాలను బలపరుస్తూ, ఎక్కడికెళితే లాభాలు ఎక్కువగా ఉంటాయో ఆ ప్రాంతానికి ప్రైవేటు పెట్టుబడులు వెళ్ళేలా సమన్వయం చేయవచ్చు. ప్రజలనుండి ప్రైవేటు రంగానికి ధనం ప్రవహించడానికి అనుగుణంగా ప్రైవేటు పెట్టుబడులకు రాయితీలివ్వడంపై కేంద్రీకరించ వచ్చు.

వాస్తవానికి మార్కెట్ ఆర్థికవ్యవస్థల్లో పైన చెప్పిన లక్ష్యాలను సాధించటానికి అనుగుణంగా ప్రభుత్వ పాత్ర ఉంటుంది. ప్రభుత్వాల మధ్య ఉండే వ్యత్యాసం అంతా ఈ లక్ష్యాలలో వేటి సాధనకు ఆ ప్రభుత్వాలు ప్రయత్నిస్తున్నాయనే దానిలోనే ఉంటుంది. ప్రభుత్వ పాత్రను పరిమితం చేస్తామనే నినాదాలు ప్రముఖంగా వినిపిస్తున్నప్పటికీ, ప్రణాళికా సంఘాన్ని రద్దు చేయాలని ప్రధానమంత్రి నరేంద్రమోడీ చెపుతున్నప్పటికీ వాస్తవంలో ప్రభుత్వ పాత్రను పరిమితం చేయటానికి సిద్ధపడలేదు. ఆర్థిక నిర్ణయాలకు సంబంధించిన అధికారాన్ని ఆయన తన కార్యాలయంలోనే కేంద్రీకరించుకున్నారు. తన మాటకు ఎదురొడ్డని, తాను చెప్పినదాన్ని కాదనని విధేయులైన మంత్రుల్ని నియమించుకున్నారు. భూసేకరణలో ఆటంకాలు, పర్యావరణ అనుమతులు తదితర చిక్కులను తొలగించి మౌలిక పారిశ్రామిక రంగాన్ని అభివృద్ధి చేయగలిగిన వాడిగా తనకు తాను ముద్ర వేసుకున్నారు. జాతీయ జంతు సంరక్షణ బోర్డులో స్వతంత్రుల ప్రాతినిధ్యంపై ఆయన వైఖరి, ఆయన ఎంచుకున్న అభివృద్ధి నమూనాకు ఆటంకం కలిగించే సంస్థల ఎడల ఆయన వైఖరిని తెలియచేస్తాయి. బ్రాండ్ మోడీ ప్రాజెక్టులను గుజరాత్‌లో అమలుచేయటానికి పూనుకున్న పారిశ్రామికవేత్తలను ఆయన సత్కరించారు. ఫలితంగా పారిశ్రామికవేత్తలు మోడీ తరహా అభివృద్ధి క్రమంలో ఒకరితర్వాత ఒకరు భాగస్వాములుగా చేరి మోడీ దృష్టిలోపడటం కోసం ప్రయత్నించారు. ఆ విధంగా ప్రత్యేక గుర్తింపు తెచ్చుకోవటానికీ, పెద్ద ఎత్తున ప్రైవేటు పెట్టుబడులను రప్పించటానికీ ఎంత పెద్ద మొత్తంలోనైనా ప్రోత్సాహకాలు ఇవ్వటానికి సిద్ధపడ్డారు.

కాబట్టి 'ప్రణాళికా సంఘం స్థానంలో 21వ శతాబ్దంలో కోర్కెలకు అనుగుణంగా, రాష్ట్రాల భాగస్వామ్యాన్ని బలపరిచే సంస్థను ఏర్పాటు చేస్తానని ప్రధాని చేసిన ప్రకటన బూటకం. తన సొంత ఎజెండాను ముందుకు తీసుకుపోవటానికి సాధనంగా వినియోగించుకోవటానికి చేసిన ప్రయత్నమే. ప్రణాళికాసంఘం స్థానంలో ఏర్పాటు చేయబోయే సంస్థ ఏ విధంగా ఉండాలో చెప్పమని అధికారిక వెబ్‌సైట్‌లో ట్విట్టర్‌ద్వారా అడగటం తన అభిప్రాయాన్ని ప్రజాభిప్రాయంగా చూపించటానికి చేసిన ప్రయత్నమే.

**చారిత్రకంగా ప్రణాళికాసంఘంలో మార్పులు**

ప్రధానమంత్రి తన ఆకాంక్షలకు అనుగుణంగా ప్రణాళికాసంఘాన్ని మార్చుకోకుండా, ఆ సంఘాన్ని రద్దుచేసి కొత్త సంఘాన్ని ఎందుకు ఏర్పాటు చేస్తున్నాడనే ప్రశ్న ఇక్కడ ఎదురౌతుంది. వాస్తవానికి ప్రణాళికాసంఘం ప్రారంభమైనప్పటినుండి దాని పాత్ర, లక్ష్యాలలో అనేక మార్పులు సంభవించాయి. ప్రభుత్వం ఏర్పాటు చేసిన సంస్థ రాజకీయ నాయకులకున్న లక్ష్యాలతో ఆర్థికవేత్తలు, శాస్త్రవేత్తలు, గణాంక వేత్తల నైపుణ్యాన్ని కలిపి అత్యధిక అభివృద్ధినీ, పెరుగుదలనూ సాధించే విధంగా పెట్టుబడులను వినియోగించటం, అధిక ఉద్యోగాలు కల్పించటం, అభివృద్ధి ఫలాలను సక్రమంగా పంపిణీ చేయడం మొదలైన లక్ష్యాలతో ప్రణాళికా సంఘాన్ని ఏర్పాటు చేశారు. తొలి దశలో

సోవియట్‌లో ప్రణాళికాబద్ధ అభివృద్ధితో ఉత్తేజితమైనారు. ప్రణాళికాసంఘం ప్రభుత్వంపై శక్తివంతంగా ప్రభావం చూపాలని భావించారు.

కానీ 60వ దశాబ్దం చివరలో ముఖ్యంగా వ్యవసాయం, విదేశీ చెల్లింపుల సంక్షోభం వచ్చిన 60వ దశాబ్దం మధ్యభాగంలో ప్రణాళికావేత్తలు రూపొందించిన, ప్రణాళికలో చెప్పుకున్న లక్ష్యాలు సాధించలేకపోతున్నామని స్పష్టమైంది. భారత సమాజం, రాజ్యాధికారం ఉన్న స్థితిలో ప్రభుత్వం ఏమి చేయాలి... ఏమి సాధించాలి... అని ప్రణాళికలో చెప్పింది సరికాదని తేలింది. స్వాతంత్ర్యానంతర కాలంలో అనుసరించిన ప్రణాళికా విధానంపై భ్రమలు తొలిగి, ప్రణాళికా విధానంపై నమ్మకం తగ్గటం ప్రారంభమైంది. ఆ వైఫల్యాలన్నింటినీ ఇక్కడ చర్చించటం సరైంది కాదు. కానీ రెండవ, మూడవ పంచవర్ష ప్రణాళికల సమయంలో ప్రణాళికాసంఘం రూపొందించిన లక్ష్యాలకు, వాటి అమలుకు మధ్య ఉన్న వ్యత్యాసం ఈ వైఫల్యాలను స్పష్టంగా వెల్లడించింది. ఆ కాలంలో ఆ ప్రణాళికా సంఘం నిర్దేశించిన లక్ష్యాలలో ఎక్కువభాగం అమలు జరగలేదు. వ్యవసాయోత్పత్తిని పెంచటం, దేశీయ మార్కెట్‌ను విస్తృతపర్చటం కోసం భూమిపై గుత్తాధిపత్యాన్ని బద్దలుకొట్టి, భూసంస్కరణలను అమలు జరపాలనే లక్ష్యాలను సాధించటంలో ఈ వైఫల్యం కొట్టవచ్చినట్లు కనిపించింది. ప్రణాళికా సంఘం, రాజకీయ నాయకత్వం కూడా ఇది కీలకమైన ముందడుగని భావించింది. కాని భారతదేశంలోని రాజ్యాంగయంత్రం యొక్క స్వభావం, అధికార చట్రం దృష్ట్యా ఈ విధానాన్ని పూర్తిగా అమలు చేయటం సాధ్యం కాలేదు.

మొదట రూపొందించిన ప్రణాళికా విధానం విఫలం కావటం... 1966–69 మధ్య ప్రణాళికా విధానానికి సెలవు ప్రకటించటంతో దేశంలో ప్రణాళికా సంఘానికీ, ప్రణాళికా విధానానికీ ప్రాధాన్యత తగ్గింది. స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగంలో ప్రణాళికా సంఘంపై ప్రధానమంత్రి మోడీ చేసిన దాడీ మొదటిది కాదు. కానీ మోడీ అంత తీవ్రంగా గతంలో ఎవరూ దాడి చేయలేదు. కాల క్రమంలో ప్రణాళికా సంఘం పాత్రను కుదించేశారు. నిర్దేశించుకున్న కొన్ని లక్ష్యాల్ని సాధించటం కోసం దేశంలో ఎంత పొదుపు చేయగలం, ఎంత పెట్టుబడులు పెట్టగలం, ముఖ్యమైన మౌలిక సదుపాయుల కల్పనారంగంలో పథకాల అమలుకూ, కొన్ని రంగాలలో అవసరాలకు సరిపోకుండా ఉన్న సదుపాయాలను కల్పించటానికీ ఎంత పెట్టుబడి అవసరం అవుతుంది, మనం అందుకోగలిగిన కొత్త అవకాశాలు ఏమి వస్తున్నాయి. కార్యక్రమాల రూపకల్ప నకూ, అమలుకూ సంబంధించిన ప్రత్యేక సమస్యల పరిష్కారానికి ఏమి చేయాలి... తదితర విషయాలకు ప్రణాళికాసంఘం పరిమితం అయ్యే విధంగా దాని పాత్రను కుదించారు. మొత్తం అభివృద్ధి వ్యూహానికి తక్కువ ప్రాధాన్యత ఇచ్చి, పరిమిత లక్ష్యాల సాధనకోసం ప్రత్యేక ప్రాజెక్టులకూ, పథకాలకూ ఎక్కువ ప్రాధాన్యతనిచ్చారు. ఈ విధమైన ప్రణాళికలో అభివృద్ధి లక్ష్యాల సాధనకు అవసరమైన నిధులను అంచనా వేయటం, ఆ నిధులను ఏవిధంగా సమీకరించాలో చర్చించటం కీలకంగా ఉంటాయి. మహలనోబిస్ నమూనాలో ప్రత్యేకమైన అభివృద్ధి విధానాన్ని అనుసరించే ప్రయత్నంలాంటిదేమీ ఉండదు.

1991లో నయా–సరళీకరణ విధానాల అమలు ప్రారంభించిన తర్వాత వచ్చిన ప్రభుత్వాలు పెట్టుబడులు, వాణిజ్యాన్ని సరళీకరించాయి. ఉత్పత్తినీ, ధరల్నీ క్రమబద్ధీకరించాయి. ప్రైవేటురంగాన్నీ, ప్రైవేటు చొరవనూ ప్రోత్సహించే విధానాలను అమలు పరిచాయి. దీంతో ప్రణాళికా విధానాన్ని దిగజార్చే పద్ధతులు గుణాత్మకంగా నూతన మలుపు తిరిగాయి. అస్థిరమైన ద్రవ్య పెట్టుబడులు పెద్దమొత్తంలో దేశంలోకి రావటంతో వీరి సెంటిమెంట్లు ప్రభుత్వ విధానాలపైన, ముఖ్యంగా రెవెన్యూ ఆదాయం, ప్రభుత్వ ఖర్చులపైన ప్రభావం చూయిస్తున్నాయి. ఇటువంటి నూతన పరిస్థితుల్లో ప్రభుత్వం సమన్వయ కర్త, క్రమబద్ధీకరించే పాత్ర నుండి వారిని ప్రోత్సహించే పాత్రకు మారింది. ఈ విధమైన రాజ్యంలో ప్రణాళికా సంఘం ఎక్కువ హడావుడి లేకుండా తన పాత్రను, బాధ్యతలను మార్చుకుంది.

మూడు కొత్త రంగాలలో ప్రణాళికా సంఘం పాత్ర ప్రధానంగా ఉంది. మొదటిది, విద్యుత్, రోడ్లు, ఓడరేవులు, సమాచార రంగాలలో ప్రభుత్వం బడ్జెట్‌లో డిమాండ్లు పెట్టకుండా, పెట్టుబడులకోసం ప్రయత్నించడం. పబ్లిక్–ప్రైవేటు భాగస్వామ్యం, దీర్ఘకాలిక పెట్టుబడులు పెట్టే రంగాలలోకి ప్రైవేటు పెట్టుబడులు వచ్చేవిధంగా ప్రోత్సాహకాలు కల్పించటం, మౌలిక సదుపాయాల రంగాల, సేవల ధరలపై ప్రభుత్వ నియంత్రణ ఎత్తివేసి అవి గిట్టుబాటయ్యేలా చేయటం వంటి చర్యలకు పాల్పడుతున్నది. ఈ విధంగా మౌలిక సదుపాయాల రంగంలో ప్రైవేటు పెట్టుబడులకై ఒత్తిడి చేస్తున్నది. రెండవది, సామాజికరంగంలో లక్ష్యాలను సాధించటానికీ, దారిద్ర్యాన్ని తగ్గించటానికీ ప్రైవేటు రంగాన్ని ప్రోత్సహిస్తున్నది. కొంతమేరకు ఉద్యోగలు కల్పించటం, పేదరికంలో ఉన్నవారికి కొద్ది మొత్తంలో ఆహారభద్రత కల్పించటం, విద్య, వైద్య రంగాలలో కొంతమేరకు మానవాభివృద్ధి సూచికలను పెంచేవిధంగా చేయటం... ఈ పనులకోసం ప్రైవేటువారిపై ఉన్న ఆంక్షలను తొలగిస్తున్నది. చివరిగా ప్రయివేటు రంగమే పేదలకు రుణాలివ్వటం, వివిధ రకాలైన బీమా పథకాలు అమలు చేయటం, సామాజిక సేవల్ని అందించటం... తదితర పనులు చేసేందుకు ప్రణాళికాసంఘం మార్గాలు అన్వేషిస్తున్నది. ప్రైవేటు సంస్థలకు గ్యారంటీ ఆదాయం వచ్చేవిధ ంగా వాటి శక్తి సామర్థ్యాలను వినియో గించుకోవటం, ప్రభుత్వ సేవలను ప్రజలకు అందించటం కోసం పబ్లిక్–ప్రైవేటు పార్టనర్‌షిప్ ఒప్పందాలను రూపొందించే పనిని ప్రణాళికా సంఘం చేస్తున్నది. 1950లో పెట్టుబడులను, నిర్ణయాలను సమన్వయం చేసే సంస్థగా ఏర్పాటు చేసిన ప్రణాళికాసంఘం ప్రస్తుతం చేస్తున్న కృషి ఆ సంస్థ ఏర్పాటు లక్ష్యాలకు పూర్తి భిన్నమైనది.

ప్రభుత్వ మిగులును వివిధ రంగాలకు కేటాయించాలనే ఒత్తిడిని తగ్గించి, గతంలో వదిలేసిన ప్రాజెక్టులు, రంగాలకు ప్రైవేటు మార్కెట్ నుండి నిధులు సమీకరించేలా ప్రణాళికాసంఘం పాత్ర మారిందని చెపుతున్నారు. గ్యారంటీలు, గిట్టుబాటయ్యే విధంగా పెట్టుబడులు పెట్టటం, సెక్యూరిటీలు తదితరాల ద్వారా ప్రైవేటురంగం పెట్టుబడులు పెట్టే విధంగా రుణాలిచ్చి, ప్రోత్సహకాలు కల్పిస్తు న్నారు. ఈ విధమైన రుణాల కోసం ప్రోత్సాహకాలు కల్పించేవిధంగా ప్రణాళికా సంఘం ముఖ్యమైన, కీలకమైన పాత్ర నిర్వహిస్తున్నది.

## మార్పులున్నా ప్రణాళికా విధానం కొనసాగుతున్నది

ఇన్ని మార్పులు జరుగుతున్నప్పటికీ చారిత్రకంగా, వాస్తవంలోనూ ప్రణాళికాసంఘం కొనసాగుతూనే ఉన్నది. ప్రణాళికాసంఘాన్ని ఈ విధంగా క్రమరహితంగా, మార్కెట్‌ను ప్రోత్సహించే దానిగా మార్చినప్పటికీ ఇప్పటికీ దాని వెబ్‌సైట్‌లో ప్లానింగ్ కమిషన్ అమలు చేయాల్సిన మూడు ముఖ్యమైన అంశాలున్నాయి. మొదటిది భవిష్యత్‌కు, దేశ దీర్ఘకాలిక అభివృద్ధికి సంబంధించి వ్యూహాత్మక లక్ష్యాల్నీ, ప్రాధాన్యతల్నీ నిర్ణయించటం, అందుకను గుణంగా వివిధ రంగాలలో అభివృద్ధి లక్ష్యాల్ని నిర్ణయించటం, నిర్ణయించుకున్న దిశలో అభివృద్ధి జరిగేలా ప్రోత్సహించడం చేయాలని ఉన్నది.

రెండవది, పన్నులు వసూలు చేయటంలో ఉదారంగా వ్యవహరిస్తున్నందున ప్రభుత్వాలకు తగ్గిన ఆదాయాన్ని గమనంలో ఉంచుకొని, ప్రభుత్వ నిధులను రాష్ట్ర ప్రభుత్వాలు, కేంద్ర ప్రభుత్వ శాఖల మధ్య కేటాయింపులు చేయటంలో మధ్యవర్తిగా వ్యవహరిస్తున్నది. రాష్ట్రాలకు ఎంతశాతం నిధులివ్వాలనేది నిర్ణయించటంలో ప్రణాళికా సంఘం పాత్ర ప్రధానమైనప్పటికీ, మిగిలిన నిధుల్ని కేంద్ర ప్రభుత్వ పథకాల ద్వారా అందజేయటంలో ప్రణాళికా సంఘం పాత్ర కూడా ఉంటుంది. రాష్ట్రాలకు ఇస్తున్న కేంద్రపన్నులు, రాష్ట్రాలు సొంతంగా సమీకరించుకుంటున్న నిధుల్ని రాష్ట్రాలు ఏవిధంగా ఖర్చు చేస్తున్నాయి అనే విషయాన్ని

అజమాయిషీ చేయటంలో ప్రణాళికాసంఘం పాత్ర ఉంటున్నది. దీన్ని రాష్ట్రాలు వ్యతిరేకిస్తున్నాయి. రాష్ట్రాల ప్రణాళికలకు సంబంధించి వార్షిక చర్చలు జరిపే సందర్భంలో ప్రణాళికా సంఘానికి ఈ అవకాశం లభిస్తుంది.

చివరిగా ప్రణాళికా సంఘం మానవాభివృద్ధికి సంబంధించిన.... గ్రామీణ ప్రజల ఆరోగ్యం, మంచినీళ్ళు, గ్రామీణప్రాంతంలో విద్యుచ్ఛక్తి, అక్షరాస్యత, పర్యావరణ పరిరక్షణ తదితర అంశాల అభివృద్ధిపై సమగ్ర దృక్పథంతో వ్యవహరిస్తుంది. ఈ అంశాలలో అభివృద్ధి చెందిన దేశాలను వదిలివేసినా, మనలాంటి దేశాల స్థాయికి తీసుకురావాలన్నా చేయాల్సింది చాలా వుంది.

ప్రపంచ మార్కెట్లో ఎదుగుదలకు అవకాశం ఉన్న రంగాలపై ప్రణాళికాసంఘం కేంద్రీకరించి కృషి చేయాల్సిన అవసరం ఉంది. బహుళజాతి కంపెనీల పెట్టుబడులపై మాత్రమే ఆధారపడే అభివృద్ధి విధానం జయప్రదం కాజాలదు. ఎర్రకోట బురుజుపై నిలబడి అంతర్జాతీయ సంస్థల్ని 'భారత దేశంలో నిర్మించమని' పిలుపివ్వటం ఒక్కటే సరిపోదు. జపాన్, దక్షిణ కొరియాల్లో వ్యక్తిగత కార్పొరేషన్లకన్నా మన ప్రభుత్వ సంస్థలకు నైపుణ్యాలు, అధికారం ఎక్కువగా ఉన్నాయి. అందువల్ల ఈ సంస్థలు ప్రపంచ మార్కెట్లో వస్తున్న మార్పులు, అభివృద్ధికి అవకాశం ఉన్న రంగాలను గుర్తించి, వాటిని లక్ష్యంగా పెట్టుకొని, ఆ దేశ ప్రత్యేకతలకు అనుగుణంగా అభివృద్ధి సాధించటంలో ముఖ్యపాత్ర నిర్వహించాలి. దేశీయ ప్రైవేటు సంస్థలు ఈ రంగాల్లోకి ప్రవేశించి అవసరమైన సాంకేతిక నైపుణ్యం, ఇతర నైపుణ్యాలను సంపాదించుకొని, అంతర్జాతీయ మార్కెట్లోకి ప్రవేశించి నిలదొక్కుకొనే విధంగా అవసరమైన ప్రోత్సాహకాలు, ప్రతిఫలం ఇవ్వటంలో ఈ సంస్థల పాత్ర ముఖ్యమైనది. ప్రణాళికాసంఘం ఈ పనుల్ని సక్రమంగా నిర్వహించకపోతే ప్రణాళికాసంఘాన్ని రద్దు చేయటం, ప్రైవేటు సంస్థల నిర్ణయాల్లో ప్రభుత్వ జోక్యం ఉండదని ప్రకటించటం వల్ల పరిష్కారం లభించదు. ప్రపంచీకరించబడిన ప్రపంచంలో పెట్టుబడికి సంబంధించి నిర్ణయాలు తీసుకోవటానికి



మోంటెక్ సింగ్ అహ్లువాలియా

ప్రణాళికాసంఘం వద్ద తగినన్ని నిధులు, మానవ వనరులు ఉండాలి.

ప్రణాళికాసంఘం నిర్వహించే వాటిలో రెండవది విస్తారమైనది. ఫెడరల్ విధానం అమలులో వున్న దేశంలో జరుగుతున్న అభివృద్ధిని సమన్వయం చేయటం పర్యవేక్షణ చేయటం ముఖ్యమైనది. కొన్ని పరిమితుల్లోనైనా తీవ్రంగా ఉన్న అంతర్రాష్ట్ర అసమానతలను తగ్గించటానికి కొంత కృషి చేస్తున్నది. నిధులు, మౌలిక సదుపాయాలు, అభివృద్ధిలో ప్రాంతాలవారీగా తీవ్ర అసమానతలున్న దేశంలో వివిధ రాష్ట్రాలలో పెట్టుబడులు, వివిధ కార్యకలాపాల్ని విస్తరించి అభివృద్ధిలో పరస్పరం కలిసిపోయేలా చేయటం కోసం ప్రణాళికాసంఘం ముఖ్యమైన కృషి చేస్తున్నది. అనేక భాషలు, అనేక సంస్కృతులు, బహుళజాతుల ప్రజలున్న దేశంలో సమైక్యతను, సమగ్రతను కాపాడటానికి రాజకీయంగా ఇది అవసరం.

భారతదేశంలో అథమస్థాయిలో వున్న మానవాభివృద్ధిని పెంపొందించడానికీ, అందుబాటులో వున్న నిధుల నుండి అత్యధిక ప్రయోజనం పొందటానికీ, అవసరమైన సామాజిక, మౌలిక సదుపాయాలు కల్పించటానికీ నిధులు కేటాయించటం ద్వారా ప్రణాళికావేత్తలు సామాజిక దృక్పథంతో న్యాయం చేయటానికి ప్రయత్నించారు. ఈ రంగాలకు నిధుల కోసం వేట, కేటాయింపులకోసం ఒత్తిడిచేసే సంఘంగా ప్రణాళికా సంఘం ఉంది. ప్రణాళికాసంఘం దారిద్ర్యాన్ని గురించి వేస్తున్న అంచనాలు పరిహాసాస్పదంగా ఉండేవి. అయినప్పటికీ దరిద్రం పెరుగుదల గురించి మానవాభివృద్ధిలో కోల్పోతున్న వాటిని, అదనంగా పొందుతున్న వాటిని గురించి నిరంతరం పరిశీలన చేయటం ద్వారా మౌలికమైన లక్ష్యాల నుండి వైదొలగకుండా నిరంతరం పర్యవేక్షణ, ఒత్తిడి చేసే సంస్థగా ప్రణాళికాసంఘం ఉంది.

ఈ కాలంలో ప్రణాళికాసంఘం తగిన విధంగా వ్యవహరించలేదన్నది ఇక్కడ చర్చ కాదు. పరిమితమైన ఈ రంగాలలో తన పాత్రను తాను నిర్వహించింది. ప్రణాళికాసంఘం తగిన పాత్ర నిర్వహించటానికి వ్యతిరేకమైన వాతావరణంలో ఈ పనులను చేయటానికి తగినంత ప్రాధాన్యతగల కృషి చేసింది. అలాంటి ప్రణాళికాసంఘాన్ని బలపరచటానికీ, విస్తరించటానికీ కృషి చెయ్యటం కాకుండా ఆ సంఘాన్ని రద్దు చేయటం ద్వారా ప్రధానమంత్రి నరేంద్రమోడి ప్రణాళికాసంఘం లాంటి సంస్థలు పెడుతున్న కనీస ఆంక్షలు, సమన్వయం చేసే చర్యలను కూడా తాను సహించజాలనని స్పష్టం చేశాడు.

ఇంతకుముందు చెప్పుకున్నట్లుగా గుజరాత్‌లో నరేంద్ర మోడీ ట్రాక్ రికార్డు చూస్తే ప్రైవేటు రంగంలోని బడాబాబులకు ప్రభుత్వ నిధులను తరలించే పాత్ర నిర్వహించింది. వీరిలో కొందరు ఇప్పటికే గుజరాత్ మూలాలతో పెద్ద వాణిజ్య ముఠాలుగా ఉండి, మోడీకి విధేయతను ప్రకటిస్తున్నారు. బిజెపిలో మోడీ సృష్టించిన రాజకీయ వేత్తలు, అతని చుట్టూ ఇతరులు ఉన్నారు. మోడీ చుట్టూ ఉండేవారిలో గౌతమ్ అదాని ఒకడు. అతను కార్పొరేట్ రంగంలోకి ఎదగటం నమ్మశక్యం కాని అద్భుతమైన కట్టుకథలా ఉంటుంది.

ఇతరంగా వ్యాపార వర్గాలకు అనుకూలంగా ఉండే ఫోర్బ్స్ ఆసియాలాంటి పత్రికల్లో ప్రచురించిన సమాచారం ప్రకారం ప్రభుత్వం ఉదారంగా, పెద్దమొత్తంలో ఉచితంగా భూములు ఇవ్వటం, ప్రతిష్టాత్మకంగా తీసుకుని ఉత్పత్తులు చేయటం, వీటికోసం పెద్దమొత్తంలో రాయితీలు ఇవ్వడం ఈ అభివృద్ధి కథల్లో ప్రధానపాత్ర వహించాయి. ఇది ప్రణాళికకు తక్కువ ప్రాధాన్యతనిచ్చి, ఆశ్రిత పెట్టుబడిదారీ విధానానికి పెద్దపీట వేస్తుంది. ఆశ్రిత పెట్టుబడిదారీ విధానం అటువంటి పథకాలను రచించటం, ప్రధాని ఆశించినట్లు వాటిని వాణిజ్య ఉత్పత్తి స్థాయికి తీసుకెళ్లి, లాభాలు సంపాదించాలంటే దానికి నామమాత్రంగా కూడా ప్రణాళికాసంఘం అవసరం లేదు. అందువల్లనే ఆ పేరుతో ఉన్న ఉన్న సంఘాన్నీ, దాని సాంప్రదాయాన్నీ ప్రభుత్వం రద్దు చేస్తున్నది.


## 'మార్క్సిస్టు'కు మీ సందేహాలు రాయండి!

'మార్క్సిస్టు' సైద్ధాంతిక మాసపత్రికలో సిపిఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు బివి రాఘవులు ప్రతినెలా పాఠకుల సందేహాలకు సమాధానాలిస్తున్న సంగతి మీకు తెలుసు. ప్రస్తుత అంతర్జాతీయ, జాతీయ, రాష్ట్ర రాజకీయ పరిణామాలపై మీ సందేహాలను నివృత్తి చేసుకునేందుకు ప్రశ్నలను రాసి పంపండి! ప్రతినెలా 20వ తేదీలోపు మీ ప్రశ్నలు మాకు చేరితే తదుపరి సంచికలో రాఘవులు సమాధానాలు లభిస్తాయి.

మీ ప్రశ్నలు అందాల్సిన చిరునామా!

**ఎడిటర్,**

'మార్క్సిస్టు' సైద్ధాంతిక మాసపత్రిక,

ప్రజాశక్తి ప్రెస్, గవర్నరుపేట, విజయవాడ-2

# లెనిన్‌పేరిట లెనినిజంపై దాడి!

(21వ పేజీ తరువాయి)

కేంద్ర కమిటీకి పంపించాడు. మొరటుగా వ్యవహ రించడమే గాక మరీ శక్తివంతుడుగా తయారైన ఆయనను ప్రధాన కార్యదర్శి పదవి నుంచి తప్పిస్తే బావుంటుందని సూచించాడు. మరోవైపు ట్రాట్స్కీకి అధికార దృష్టి అధికంగా వుంటుందని కూడా వ్యాఖ్యానించాడు. ఇందుకు సంబంధించి లెనిన్‌రాసిన మూడు లేఖలను కమిటీ ముందు స్టాలిన్ చదివి వినిపించాడు. ఆ తర్వాత కూడా ఆయననే కార్యదర్శిగా ఎన్నుకున్నారు. ఇందులో దాపరికం అంటూ ఏమీ లేదు. లెనిన్ 1924 జనవరి 21న కన్నుమూశాక స్టాలిన్ అత్యున్నత గౌరవంతో నివాళులర్పించాడు. ఆయన భౌతిక కాయాన్ని మసోలియంలో ఏర్పాటు చేయిం చాడు.

లెనిన్ చివరలో రాసిన ఈ వ్రాతలనే వీలునామా అని అభివర్ణించడం ఆ తర్వాతి ఏడాది మొదలైంది. ట్రాట్స్కీ మద్దతుదారైన మాక్స్ ఈస్ట్‌మన్ లెనిన్ చనిపోయాక..అంటూ రాసిన పుస్తకంలో దీని ప్రస్తావన చేశారు. ప్రపంచమంతా దానిపై పెద్ద చర్చ బయిలు దేరింది. స్టాలిన్ ఆ పుస్తకం ప్రతులను పొలిట్ బ్యూరో సభ్యులందరికీ పంపిణీచేయించాడు. దాంతోపాటే వాస్తవాలకు సంబంధించి ఒక పత్రం జతపర్చాడు. ఇదంతా ఒక కమ్యూనిస్టు వ్యతిరేక వ్యవహారమనీ అయినా ఆ తన పత్రంతో సహా మొత్తం విషయం పార్టీకి వివరించడం అవసరమనీ ప్రతిపాదించాడు. అయితే పొలిట్‌బ్యూరో ఆ అవసరం లేదని భావించింది.

ట్రాట్స్కీ కూడా ఈ పుస్తకాన్నీ, అందులోని విషయాలనూ పూర్తిగా ఖండించాడు. ఈస్ట్‌మన్ పార్టీ పట్ల వ్యతిరేకతతోనే రాశాడని తనకు ఏ సంబంధంలేదనీ ప్రకటించాడు. కృపస్కయా మరింత వివరణ ఇస్తూ వీలునామా అంటూ ఏమీ లేదని స్పష్టంగా ప్రకటించింది. ఇవన్నీ సుపరిచితమైన లేఖలేనని పార్టీకి ఇప్పటికే సమర్పించబడ్డాయని తెల్పింది. పైగా ట్రాట్స్కీ గురించి లెనిన్ ఏమనుకున్నదీ కూడా రాసింది.

ఆ తర్వాత కూడా అనేక అంతర్గత పోరాటాలు జరిగాయి. చివరకు ట్రాట్స్కీని 1928లో ఆల్మా ఆటాకు ప్రవాసం పంపించారు. 1929 లో దేశ ద్రోహ కార్యకలాపాలకు పాల్పడబోననే హామీ తీసుకుని దేశం నుంచే బహిష్కరించారు. ఆయన పట్ల ప్రభుత్వం ఉదారంగానే వ్యవహ రించింది. వెళ్లేముందు ఆయన తన అనుయా యులను బయిటకు రావద్దనీ, పార్టీలోనే కీలక స్థానాల్లో కొనసాగుతూ వీలైన మేరకు వ్యతిరేకంగా పనిచేయాలనీ సందేశమిచ్చాడు. ఫలితంగా తర్వాతి దశల్లో సోవియట్ కమ్యూ నిస్టు పార్టీ, సమాజం కూడా తీవ్ర కల్లోలాలను ఎదుర్కోవలసి వచ్చింది. ప్రత్యర్థులపై కఠినంగా వ్యవహరించాడనీ, అనుమానంతో అనేకమందిని అకారణంగా శిక్షించాడనీ స్టాలిన్‌పై విమర్శ లూ వచ్చాయి. వాటిపై చాలా చర్చ నడిచింది. ఇక్కడ ఆ వివరాలు అవసరం లేదు గానీ ఒక వాస్తవం మాత్రం చెప్పుకోవాలి. స్టాలిన్ సోవియట్ యూనియన్‌ను బలోపేతం చేసి నడిపించాడు. ఫాసిజాన్ని ఓడించడానికి స్ఫూర్తినిచ్చాడు. మరో వంక ఒకప్పుడు ఆయన సమవుజ్జీనన్న ట్రాట్స్కీ మెక్సికోలో మకాం వేసి స్టాలిన్ నిరంకుశత్వాన్ని ఖండించే పేరిట సోవియట్ వ్యతిరేక ప్రచారంతోనే జీవితమంతా గడిపాడు. చివరకు ఆయనను 1940లో అరాచకవాదులు హత్య చేశారు. ఇది స్టాలిన్ చేయించాడన్న ప్రచారాన్ని పాశ్చాత్యదేశాలు దాదాపు ఖాయం చేశాయి.

అంతర్జాతీయంగా అప్పటికీ, ఇప్పటికీ కూడా ట్రాట్స్కీ వాదులు వామపక్ష పరిభాషలోనే కమ్యూనిస్టు ఉద్యమ మౌలిక భావాలపై దాడి చేస్తుంటారు. అయితే వారి ప్రచురణల్లో ఉపయుక్త సమాచారం వుంటుందనేది నిజమే గాని నిర్ధారణలు తప్పుదారిలో నడిపించడం కద్దు. అందులో భాగమైన 'లెనిన్ అంతిమ పోరాటం' నిజానికి లెనినిజంపై ఆక్రోశం తప్ప మరొకటి కాదు. ఉపోద్ఘాతంపై విడిగా చేసిన సమీక్ష ఆ అంశాన్ని ధృవపరుస్తుంది. జాతీయంగానూ, అంతర్జాతీయంగానూ వామ పక్షాలు, కమ్యూనిస్టుపార్టీలు ఆత్మ విమర్శ చేసుకోవలసిందేగాని దాని అర్థం నిరాశను నూరిపోయడం, విద్రోహులను నెత్తిన పెట్టు కోవడం మాత్రం కాదు. ⊙

---

# కమ్యూనిస్టు పార్టీలో ఆంతరంగిక ప్రజాస్వామ్యం

(18వ పేజీ తరువాయి)

సమర్థవంతంగా అమలు జరుపుతున్నామా లేదా అన్నదే సమస్య. ఏమేరకు ఇది సక్రమంగా అమలు జరిగితే ఆమేరకే సరైన నిర్ధారణలకు రాగలుగుతాం.

సమీక్ష ప్రాతిపదికగానే భవిష్యత్తు విధానం రూపొందిస్తాం. అఖిలభారత మహాసభకు 2 మాసాలు ముందుగానే రాజకీయ విధానం ముసాయిదా అన్ని ప్రాంతీయ భాషల్లోనూ విడుదలవుతుంది. పార్టీ శ్రేణుల మధ్య చర్చకు వదులుతాం. పార్టీశ్రేణులే కాదు, పార్టీ శ్రేయోభిలాషుల అభిప్రాయాలను కూడా పరిగణనలోకి తీసుకుంటాం. అందుకే ఈ ముసాయిదా తీర్మానాన్ని పార్టీ అంతర్గత చర్చకు మాత్రమే పరిమితం చేయకుండా బహిరంగంగానే విడుదల చేస్తాం. దాని మీద ఎవరైనా తమ అభిప్రాయాలు, సవరణలు, వివరణలు నేరుగా కేంద్ర కమిటీకి పంపవచ్చు. వాటన్నింటినీ కేంద్రకమిటీ పరిశీలించి మహాసభ ముందుంచబోయే ముసాయిదాకు తగు సవర ణలు చేస్తుంది. ప్రతి మహాసభ సందర్భంగానూ కేంద్ర కమిటీకి వేలాది సవరణలు అందటమే ఇందుకు నిదర్శనం.

పార్టీ భవిష్యత్తు విధానాన్ని రూపొందించే ఈ విధాన నిర్ణయ ప్రక్రియలో పార్టీ సభ్యులు ఎంతగా భాగస్వాములైతే అంతగా పార్టీ బలో పేతం అవుతుంది. పార్టీలో ఉన్న ఈ అంతర్గత ప్రజాస్వామ్యాన్ని సభ్యులంతా సద్వినియోగం చేసుకుంటున్నారా లేదా అన్నదే ఇక్కడ ముఖ్యమైన సమస్య. కొన్ని సందర్భాలలో శాఖా కార్యద ర్శులు, కార్యకర్తలు కూడా తగు శ్రద్ధవహించక పోవడం గమనిస్తాం. నిర్ణయాల దశలో భాగ స్వాములు కానందువల్లనే అమలు దశలో అభ్యంతరాలు లేవనెత్తటం చూస్తుంటాం. ఎదురు దెబ్బలు తగిలినపుడు, పునాది చెదిరి నపుడు గందరగోళానికి గురవుతుంటారు. పార్టీ యావత్తూ నిర్ణయాలలో భాగస్వాములైనప్పుడే పార్టీ పటిష్టమవుతుంది. అందుకే కేంద్ర కమిటీ విడుదల చేసే ముసాయిదా నివేదికను పార్టీ సభ్యులూ, కార్యకర్తలంతా అధ్యయనం చేయాలి. శాఖల్లోనూ, కమిటీల్లోనూ తమ అభిప్రాయాలు నిర్మొహమాటంగా తెలియజేయాలి.

మహాసభల సందర్భంగా పార్టీ విధానానికి సంబంధించినంత వరకు రెండు కీలక దశలు న్నాయి. మొదటిది శాఖాస్థాయి నుండి కేంద్ర కమిటీ వరకు సమీక్ష దశ. రెండవది ముసా యిదా రాజకీయ తీర్మానం పైన చర్చ. ఈ రెండు దశల్లోనూ పార్టీ సభ్యులంతా ప్రత్యక్షంగా భాస్వాములు కావాలి. శాఖా మహాసభల నుండే ఈ ప్రక్రియ ప్రారంభమవుతుంది. ఈ ప్రక్రియలో చురుకుగా భాగస్వాములు కావటం ద్వారా మాత్రమే జయాపజయాలకు కారణాలను గుర్తించగలుగుతారు. సరైన విధానాన్ని రూపొందిం చడంలో తమవంతు పాత్ర పోషించగలు గుతారు. ⊙

# బిపన్ చంద్ర

(2వ పేజీతరువాయి)

కూడిన రచనలకే పరిమితం కాకుండా, పాఠశాల, కాలేజీ, విశ్వవిద్యాలయ విద్యార్థులను ఉద్దేశించి అనేక పుస్తకాలు రచించడం, అవి లక్షలాది సంఖ్యలో అమ్ముడుపోవడం ద్వారా సాధ్యమయింది. ఆయన దేశవ్యాపితంగా పర్యటిస్తూ కాలేజీల్లో, విశ్వవిద్యాలయాల్లో, వామపక్ష, అభ్యుదయ దృక్పథంతో పనిచేసే అనేక సంస్థల్లో ఉపన్యాసాలు ఇచ్చేవారు. ఆయన ఓ గంటపాటు ఉపన్యాసం ఇస్తే, మరెన్నో గంటల పాటు దానిపై చర్చలు జరిగే సందర్భాలు ఎక్కువగా ఉండేవి. ఈ చర్చల్లో వామపక్ష, అభ్యుదయ భావాలు కలిగిన విద్యార్థులు, ఇతరులు పాల్గొనేవారు. ఆ చర్చల్లో బిపన్ ఎంతో ఓపిగ్గా పాల్గొని సమాధానాలు ఇస్తుండే వారు. నాలుగు దశాబ్దాల అధ్యాపక వృత్తిలో ఆయనతో సంబంధం కలిగిన వేలాది విద్యార్థులతో పాటు, అంతకన్నా ఎక్కువ సంఖ్యలో ఇతర ప్రజానీకంతో కూడా ఆయనకు సంబంధాలు ఉండేవి. ప్రజారంజక రచనలను, పాండిత్య రచనలను అనుసంధించడం, పాఠశాల బాలలనుండి, పండితుల వరకూ ఉద్దేశించి రచనలు చేయడం ఆయనలోని ఒక విశిష్టత.

ఆర్థికజాతీయవాదం ఆవిర్భావంపై రచన తర్వాత బిపన్ రచనల్లో ప్రధానమైనది 'భారత స్వతంత్ర పోరాటం'. దీనికి ముందు ఆయన 'ఇండియన్ నేషనల్ మూవ్‌మెంట్ అండ్ లాంగ్‌టెర్మ్ డైనమిక్స్' అనే రచనను ప్రచురించారు. దీనిలో ఆయన భారత జాతీయోద్యమ ప్రత్యేకతలను చెప్పడంతో పాటు, అది ఇతర దేశాల జాతీయ విముక్తి పోరాటాలకు ఏమాత్రం తీసిపోదని వివరించారు. జాతీయోద్యమంలో గాంధీ సానుకూల పాత్రను కూలంకషంగా చర్చించారు. దాని ఆధారంగానే బిపన్ చంద్ర మరింత విస్తృతంగా 'భారత స్వతంత్ర పోరాటం' పుస్తకాన్ని రచించారు. దీనిలో ఆయన వ్యక్తం చేసిన అభిప్రాయాలు కొన్నింటిపై కొంత భిన్నాభిప్రాయం ఉన్నప్పటికీ, అభ్యుదయవాదులు ప్రతి ఒక్కరూ దీనిని ఒక ప్రామాణిక రచనగా గుర్తిస్తారు.

1970లలో బిపన్ చంద్ర స్కూలు పిల్లల కోసం 'ఆధునిక భారత దేశం' అనే ఎన్‌సిఇఆర్‌టి పాఠ్యపుస్తకాన్ని రచించారు. ఇది ఆ కాలంలో ఆయన చేసిన ఒక ప్రధాన కృషి. ఈ చరిత్ర పాఠ్యగ్రంథంలో ఆయన వలసపాలన ప్రభావం, జాతీయోద్యమ పాత్రలను స్పష్టంగా వివరించారు. ఏ ప్రాంతాన్నీ నిర్లక్ష్యం చేయకుండా చరిత్ర, ఆర్థిక పరిస్థితి, సంస్కృతి మొదలైన అంశాలను తడిమారు. 1977లో ప్రచురించిన ఈ పుస్తకంపై ఆరెస్సెస్ తదితర మతోన్మాదులు తీవ్రంగా దాడిచేశారు. కేంద్రంలో తొలి బిజెపి ప్రభుత్వం ఏర్పడినపుడు 2001లో దీన్ని పాఠ్యపుస్తకంగా రద్దుచేశారు. అయితే, 2009లో ఇది పునర్ముద్రించబడింది. ఈ కాలంలోనే ఆయన మతతత్వంపై ఎంతగానో ఆందోళన చెందారు. మతోన్మాదం, మతతత్వ ప్రమాదంపై ఆయన ఎన్నో వ్యాసాలు రచించారు. అవన్నీ కలిపి 1984లో 'ఆధునిక భారతదేశంలో మతతత్వం' అనే పేరుతో పుస్తకంగా ప్రచురించబడ్డాయి. మతతత్వం, లౌకిక తత్వం, ప్రజాస్వామ్యం గురించి వివరిస్తూ రాసిన చిన్నపుస్తకం కూడ ఎంతో ప్రాచుర్యం పొందింది. ఇది లౌకికవాద, ప్రజాతంత్ర శక్తులకు మతోన్మాదాన్ని ఎదుర్కోవడానికి ఒక కరదీపికగా ఉపయోగపడుతుంది. మతతత్వం అనేదొక జబ్బు, మతకొట్లాటలు అనేవి దానికి సూచనలు మాత్రమే. మతకొట్లాటలు లేక పోయినా, మతతత్వం వ్యాప్తిచెందుతుం టుంది అని ఆయన చెప్పేవారు. అందుచేతనే మతతత్వానికి వ్యతిరేకంగా నిరంతరం అప్రమత్తంగా ఉండి, పోరాటం చేయాలని ఆయన అభిప్రాయపడేవారు. ఏడాదిలో ఒక్కవారం పాటయినా, దేశవ్యాపితంగా మతోన్మాద వ్యతిరేక వారం పాటించాలని ఆయన చెప్పారంటే దానిపట్ల ఆయన ఎంతగా ఆందోళన చెందే వారో అర్థం చేసుకోవచ్చు. తన జీవితాంతం ఆయన మతోన్మాదానికి వ్యతిరేకంగా రాజీలేని వైఖరితీసుకున్నారు.

నేషనల్ బుక్ ట్రస్ట్ చైర్మన్‌గా పనిచేసిన కాలం ఆయన జీవితంలో ఒక ముఖ్య ఘట్టం. 2004 నుండి 2012 వరకు ఆయన ఆ పదవిలో కొనసాగారు. ఎంతో సృజనాత్మకంగా ఆయన ఎన్‌బిటి ప్రచురణలను ఈ కాలంలో విస్తరించారు. పుచ్చలపల్లి సుందరయ్య, పిసి జోషి మొదలైన కమ్యూనిస్టు, వామపక్ష నేతల జీవిత చరిత్రలను ఇంగ్లీషుతో పాటు పలు ప్రాంతీయ భాషల్లోను ప్రచురించడంలో ఆయన పాత్ర అమోఘమైనది.

అసంపూర్తి రచన 'భగత్ సింగ్ జీవిత చరిత్ర' ను బిపన్ వదిలి వెళ్లారు. మతోన్మాదానికి వ్యతిరేకంగా పనికివస్తుందనే ఉద్దేశంతోనే ఆయన ఈ రచనను చేపట్టారు. మతోన్మాదులు భగత్ సింగ్‌ను సైతం దుర్వినియోగం చేస్తున్న తరుణంలో 1970లలో ఆయన 'నేను ఎందుకు నాస్తికుడినయ్యాను' అన్న భగత్ సింగ్ రచనను వెలికి తీసి ప్రచురించారు. కొన్నేళ్లక్రితం జెఎన్‌యులో భగత్‌సింగ్ స్మారకోపన్యాసం ఇస్తూ 'రూపుదిద్దుకుంటున్న మార్క్సిస్టు' అని భగత్ సింగ్‌ను బిపన్ అభివర్ణించారు. భగత్ సింగ్ వారసత్వాన్ని మతోన్మాదులు విజృంభిస్తున్న ఈ సమయంలో విస్తృతంగా ప్రచారం చేయవలసిన అవసరం ఎంతైనా ఉందని ఆయన భావన. మతోన్మాదం ప్రమాదంపై తీవ్రంగా హెచ్చరిస్తూ, ప్రజలను అప్రమత్తం చేయడంలో బిపన్ సముచిత పాత్ర నిర్వహించారు.

మార్క్సిస్టు పద్ధతిని చరిత్రపరిశోధనకు అన్వయించడంలో దిట్ట అయిన బిపన్ ఆధునిక భారతదేశ చరిత్రను ప్రత్యేకించి అధ్యయనం చేశారు. అది ఆయన స్పెషలైజేషన్. అంత మాత్రంచేత ఆయనకు ప్రాచీన, మధ్యయుగాల భారత చరిత్రపై అవగాహన లేదని కాదు. కాని ఆయన ఈ విషయాలలో ఎంతో నమ్రతను ప్రదర్శించేవారు. బరున్ దాస్ గుప్తా అనే ఆయన బిపన్‌కు నివాళులర్పిస్తూ ఇదే విషయాన్ని ప్రత్యేకంగా ప్రస్తావించారు. భారతదేశంలో మొఘలుల కాలంలో హిందూ, ముస్లింల మధ్య కొట్లాటలు జరగలేదని కొందరు గట్టిగా చెబుతుంటారు కదా, అది నిజమేనా అని ఆయన ప్రశ్నించారు. దానికి బిపన్ ఆ కాలం గురించి చెప్పేందుకు నేను అథారిటీ కాదు, దయచేసి రోమిలా థాపర్‌ను అడగండి అని సమాధాన మిచ్చారు.

ఇంతటి బహుముఖ ప్రజ్ఞాశాలి కావడం మూలంగానే 2014, ఆగస్టు 30వ తేదీన కన్నుమూసినపుడు ప్రస్తుతం ప్రొఫెసర్లు, అంబాసడర్లు, ఫిల్మ్‌మేకర్లు, జర్నలిస్టులు, రాజకీయ, సామాజిక కార్యకర్తలుగా ఉన్న ఆయన పూర్వవిద్యార్థులు వందల సంఖ్యలో వచ్చి ఆయనకు నివాళలర్పించారు. అంతేకాదు, రాష్ట్రపతి, ప్రధాని, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు లాంటి రాజకీయ ప్రముఖులు సంతాప సందేశాలు పంపారు. కమ్యూనిస్టుపార్టీలు ఆయన మృతికి సంతాపం తెలియచేస్తూ ప్రకటలను విడుదలచేశాయి. ఇలా విభిన్న వర్గాలకు చెందినవారు ఒక ప్రొఫెసర్‌గా పనిచేసిన వ్యక్తికి నివాళులర్పించడం ఒక అరుదైన ఘటన. ఆయన చూపిన అభ్యుదయ వామపక్ష మార్గంలో పయనించడం, ఆయన తన జీవిత చివరి అంకం వరకు రాజీలేకుండా వ్యతిరేకించిన మతతత్వంపై నిరంతర పోరాటం చేయడం ఆయనకు వామపక్ష, అభ్యుదయ, లౌకికవాదులు ఇచ్చే నిజమైన నివాళి.

# వలసవాదానికి పుట్టిన బిడ్డ హిందూత్వ



– సునీత్ చోప్రా

సాంఘిక పీడన, ఆర్థిక దోపిడీ పరస్పర సంబంధం కలిగినవి. రెండే అణచివేతకు సంబంధించిన సామాజిక రూపాలు. కుల, వర్గ విభజనను ఒకటిగా భావించడం జరుగుతోంది. ఈ రెండూ ఒకటేననీ, ఒకే కుదురు నుండి వచ్చినవనీ భావించడం చాలా పొరపాటు. వర్గ సంబంధాలు ఉత్పత్తి క్రమం నుండి ఉద్భవించగా కుల సంబంధాలు ఇప్పుడు వినియోగ సరళిని ప్రతిబింబిస్తాయి.

వర్గ సంబంధాలు శక్తివంతమైనవి. అంతర్గత చలన స్వభావం కలిగినవి. ఉత్పత్తి శక్తులుగా అవి వారిని ముందుకు నడిపిస్తాయి. తద్విరుద్ధంగా కుల సంబంధాలు స్పష్టమైన వర్గపోరాటం తలెత్తకుండా నిరోధించి హేయమైన మార్గానికి మళ్లిస్తాయి.

వర్గ పోరాటాన్ని అణచివేయటానికి, విభజించి పాలించే ప్రయత్నాలను అమలు చేసే సందర్భంలో కులతత్వాన్ని అద్భుతమైన సాధనంగా వలస పాలకులు భావించారు. కులానికి సమానంగా వాడుతున్న 'క్యాస్ట్' అనే మాట భారతదేశంలోకి మొట్టమొదటగా ప్రవేశించిన పోర్చుగీసు వారినుండి వచ్చింది. బ్రిటీష్‌వారు వచ్చిన తర్వాత వారన్ హేస్టింగ్స్ చొరవతో కుల వ్యవస్థను క్రమబద్ధీకరించి, దానికి చట్టబద్ధత కల్పించారు. ఈ విధంగా ఏకశిలా సదృశ్యమైన హిందూ పర్సనల్ చట్టాన్ని సృష్టించారు. ఇందుకేమీ తీసిపోని ఏకశిలా సదృశ్యమైన ఇస్లామిక్ పర్సనల్ చట్టంతో పోటీగా సృష్టించిన ఈ చట్టం దాదాపు ఒకటిన్నర దశాబ్దాలకుపైగా వలసవాదులకు విశ్వసనీయంగా సేవలందించింది. ఆర్.ఎస్.ఎస్. దృక్పథమైన హిందూత్వ ఈ వలస విధానానికి పుట్టిన బిడ్డ అని, హైందవ ఆలోచనలోని వివిధ ధోరణులకు సైతం వ్యతిరేకమనీ ఈ చరిత్ర సాక్ష్యమిస్తున్నది.

శిలా సదృశ్యమైన ఈ విభజనను కల్పించటానికిగానూ చిట్టెం కట్టుకుపోయిన కుల, మత ఆధిపత్యానికీ, పౌరస్మృతికీ పెత్తందారులుగా బ్రాహ్మణులను, మౌల్వీలను మున్నెన్నడూ లేనిస్థాయికి వలసవాదం పెంచింది. అది కుల వ్యవస్థకు అంతకుముందులేని కాఠిన్యాన్ని సంతరింపజేసింది. అలా చేయకుంటే వలస వ్యవస్థ నిలదొక్కుకోలేదు.

**(రచయిత రాసిన 'కాలం చెల్లిన సంప్రదాయాలు, వాటి కుళ్లు రాజకీయాలు' వ్యాసం నుండి ఈ వాక్యాలు గ్రహించబడ్డాయి.)**

Marxistu, monthly organ of Communist Party of India (Marxist) A.P . State Committee.
Printer & Publisher B.V. Raghavulu. RNI Reg.No. APTEL/2006/17554. Vol.9, No.6. Published on October 1, 2014